www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 199 | శుక్రవారం 11-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



చిన్న వ్యాపారులకు

ఊరట

- టర్నోవర్ పరిమితి రూ.40 లక్షలు
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలు
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ : చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారులకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి ఊరట లభించింది. జీఎస్టీ పరిధిలోకి వచ్చే వ్యాపార పరిమితిని పెంచుతున్నట్లు కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతమున్న పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. కాంపొజిషన్ పథకం కింద ఉండే పరిమితిని రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లకు పెంచుతున్నట్లు తెలిపారు. జీఎస్టీ మండలి 32వ సమావేశం న్యూఢిల్లీలో గురువారం జరిగింది. ఇందులో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులకు

- మిగతా 11 లో

సువిధ బాదుడు

రైలు చార్జీల మోత | ఐదారు రెట్లు అధికం

- ఆర్ఏసీ పేరుతో ఇద్దరికి ఒకే బెర్తు
- సికింద్రాబాద్ నుంచి విజయవాడకు సాధారణ చార్జీ రూ.220
- డైనమిక్ ఫేర్‌లో గరిష్ఠ ధర రూ.1,065
- సంక్రాంతి వేళ ప్రయాణికుల ఇక్కట్లు
- సికింద్రాబాద్- విశాఖపట్నం స్లీపర్ చార్జీ రూ.360 - సువిధలో మాత్రం రూ.1365

సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలుచేస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు దోచుకుంటున్నాయి. తాము కూడా మినహాయింపు కాదంటూ రైల్వే, రోడ్డు రవాణా సంస్థలు రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నాయి. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే సాధారణ టికెట్ ధరల కంటే మూడు రెట్లు అధిక చార్జీలు వసూలు చేస్తోంది. సువిధ రైళ్లలో ఆర్ఏసీ పేరుతో ఉన్న బెర్తుల కంటే ఎక్కువ టికెట్లు విక్రయించడం దీనికి నిదర్శనం. సాధారణ చార్జీతో పోలిస్తే ఆర్ఏసీ టికెట్లకు ఐదారు రెట్లు అధికంగా వసూలు చేయడమే కాకుండా...ఒక బెర్తును ఇద్దరికి కేటాయించడం రైల్వే శాఖ దోపిడీకి పరాకాష్ట అని ప్రయాణికులు మండిపడుతున్నారు.

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ : సంక్రాంతి రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి విజయవాడ, కాకినాడ, నర్సాపురం, విశాఖ నగరాలకు జనవరి 10 నుంచి 13 తేదీలు, అదేవిధంగా తిరుగు ప్రయాణానికి అనుగుణంగా 'సువిధ' ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. సికింద్రాబాద్– కాకినాడ మధ్య రోజుకు రెండు, మూడు సువిధ రైళ్లు నడుపుతోంది. స్లీపర్, ఏసీ క్లాస్ టికెట్లతోపాటు ఆర్ఏసీ టికెట్లనూ ఇప్పటికే పెద్ద సంఖ్యలో

- మిగతా 2 లో





చరిత్రకు చిహ్నం

విశాలాంధ్ర - అమరావతి : తెలుగుజాతి గొప్పతనం, వైభవం, చరిత్రను చాటి చెప్పేలా వెల్కమ్ గ్యాలరీని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. గుంటూరు జిల్లా లింగాయపాలెం సమీపంలోని సీడ్ క్యాపిటల్‌లో గ్యాలరీ నిర్మాణానికి సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిసి చంద్రబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జర్మనీ, జపాన్, సింగపూర్‌తోపాటు దేశానికి చెందిన మొత్తం 15 కంపెనీలతో అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ (ఏడీపీ)తో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. వెల్కమ్ గ్యాలరీ వాక్‌లో భాగంగా అమరావతిలో జరుగుతున్న భవన నిర్మాణాలు, అభివృద్ధి పనలను సింగపూర్ మంత్రి ఈశ్వరన్, ఇతర ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ, రాజధాని అమరావతి అభివృద్ధిలో సింగపూర్ సహకారం మరువలేనిదన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాల భూములివ్వగా, రూ.48 వేల కోట్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. సింగపూర్ తరహాలో అమరావతిని అభివృద్ధి చేస్తామని తెలిపారు. పరిపాలన, నైపుణ్యాభివృద్ధిలో సింగపూర్ సహకారం ఉందని, లీక్వాన్ యూనివర్సిటీ రేటింగ్‌లో ఏపీ అగ్రగామిగా నిలవటం హర్షణీయమన్నారు. ప్రపంచంలోనే ఐదవ అత్యున్నత నగరం కావానే లక్ష్యంతో

- మిగతా 2 లో

- తెలుగుజాతి వైభవం, స్మృతులు ఉట్టిపడేలా నిర్మాణం
- ప్రపంచం మెచ్చేలా అమరావతి అభివృద్ధి
- సింగపూర్ ప్రభుత్వ సహకారం మరువలేనిది
- వెల్కమ్ గ్యాలరీ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు

అలోక్‌పై

మళ్లీ వేటు..!

- సీబీఐ డైరెక్టర్‌గా ఉద్వాసన
- అవినీతి ఆరోపణలే సాకు
- మోదీ నేతృత్వంలో హైపవర్ కమిటీ నిర్ణయం
- మళ్లీ నాగేశ్వరరావు నియామకం



న్యూఢిల్లీ : అందరూ ఊహించినట్టే... ప్రధాని నరేంద్ర మోడీ తన పంతం నెగ్గించుకున్నారు. అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో... సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మపై వేటు వేశారు. ఆయనను విధుల నుంచి ఉద్వాసన పలుకుతూ నరేంద్ర మోడీ నేతృత్వంలోని హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకుంది. తనను సెలవుపై వెళ్లాలని సర్కారు ఆదేశించటాన్ని అలోక్‌వర్మ సుప్రీంకోర్టులో ప్రశ్నించారు. ఈ వివాదంపై విచారించిన సుప్రీంకోర్టు అలోక్‌వర్మను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వారం

- మిగతా 2 లో



సుప్రీంకు

కోటా బిల్లు

50 శాతం దాటిన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమంటూ పిటిషన్ దాఖలు

12లో

అనంతపురం వైద్య కళాశాల

ఏజెన్సీలకు కామధేనువు

- వెంకటేశ్వరుడి హుండీలా కలెక్షన్లు
- 33 అవుట్ సోర్సింగ్ పోస్టులకు నోటిఫికేషన్
- నిబంధనలకు భిన్నంగా నియామక ప్రక్రియ
- హైకోర్టు వద్దన్నా పట్టించుకోని కాలేజీ పాలకవర్గం
- అధికార పార్టీ అండతో రూ.లక్షల వసూళ్ల పర్వం

2లో



అవుట్ సోర్సింగ్ పోస్టుల నియామక ప్రక్రియ ఏజెన్సీలకు 'కామధేనువు'గా మారింది. పోస్టుల భర్తీ ప్రక్రియను దక్కించుకున్న ఏజెన్సీల కలెక్షన్లు 'వెంకటేశ్వరుడి'ని తలపిస్తున్నాయి. ఏమాత్రం పెట్టుబడి లేకుండా లక్షలాది రూపాయలను ఆర్జించే అదృష్టం దక్కినట్లే. ఇదే అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అక్షరాల జరుగుతోంది. కళాశాల పలు విభాగాలలో ఖాళీగా ఉన్న 33 పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ ప్రక్రియను రెండు ఏజెన్సీలు దక్కించుకున్నాయి. ఉద్యోగాల భర్తీ ఆ రెండు సంస్థలకు కాసుల వర్షం కురిపిస్తోంది. అధికార పార్టీ నేతల అండతో కాంట్రాక్ట్ పద్ధతిన నియమించే అవుట్ సోర్సింగ్ పోస్టులకు డిమాండు పెరగటంతో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ఈ పోస్టుల భర్తీని నిలుపుదల చేయాలని సాక్షాత్తు హైకోర్టు ఆదేశించినా ఖాతరు చేయని పరిస్థితి.

సాహితీవేత్త సహా ముగ్గురిపై దేశద్రోహం కేసు

9లో

ఇదీ లోకం!



సరిగా చూడు మన ఎమ్మెల్యే గారే.. ఎలక్షన్‌లు వస్తున్నాయి కదా.. ప్రజల్లో లీనమయిపోతున్నారు

18 నుంచి ఎస్జీటీ పరీక్షలు

- 31వరకు షెడ్యూలు ఖరారు
- టెట్ కమ్ టీఆర్టీ సిలబస్‌తో నిర్వహణ
- 3 గంటల వ్యవధి
- రోజుకు రెండు సెషన్లు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : డీఎస్సీ–2018 ప్రక్రియలో భాగంగా రెండో విడతగా సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ)తోపాటు స్పెషల్ స్కూళ్ల టీచర్ పోస్టుల ఆన్‌లైన్ పరీక్షలకు ప్రభుత్వం షెడ్యూలు ఖరారు చేసింది. 2014 తరహాలో టెట్ కమ్ టీఆర్టీ సిలబస్‌తో ఎస్జీటీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎస్జీటీ పోస్టులకు ఈ విడత బీఈడీ అభ్యర్థులకు అర్హత కల్పించారు. టెట్ కమ్ టీఆర్టీ సిలబస్‌ను ప్రభుత్వం ప్రత్యేకంగా కలపడంపై సర్వత్రా విమర్శలున్నాయి. ఇప్పటివరకూ పాఠశాల విద్య, మోడల్ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్–నాన్ లాంగ్వేజెస్, లాంగ్వేజెస్, పీజీటీ, టీజీటీ, పీఈటీ, మ్యూజిక్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ల పోస్టులకు ఆన్‌లైన్లో పరీక్షలు పూర్తయ్యాయి. వాటికి టెట్ సిలబస్ లేకుండా టీఆర్టీ(టీచర్ రిక్రూట్‌మెంట్) సిలబస్‌తో ఏర్పాటు చేశారు. ఈ నెల 18 నుంచి 31 వరకూ ఎస్జీటీ, స్పెషల్ స్కూల్(ఎస్ఏ) పరీక్షలకు



పాఠశాల విద్యాకమిషనర్ కె.సంధ్యారాణి షెడ్యూలు వెల్లడించారు. ఈ నెల 18 నుంచి 27వరకు, 29, 31 తేదీల్లో ఎజ్జీటీ పరీక్షలు నిర్వహిస్తారు. 28, 30 తేదీల్లో ఎస్జీటీ(స్పెషల్), ఎస్ఏ(స్పెషల్ స్కూల్) అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు రెండు

- మిగతా 2 లో

అయోధ్యపై విచారణ నుంచి తప్పకున్న జస్టిస్ లలిత్

9లో

బీజేపీకి కూటమి బీపీ...!

- యూపీలో ఉప్పునిప్పు చెలిమి
- త్రిముఖ పోటీ వ్యూహం
- గణాంకాలు, సమీకరణల్లో ఎస్పీ-బీఎస్పీ బలోపేతం

కళ్యాణి శంకర్



ఉత్తర ప్రదేశ్.. భారత రాజకీయాల్లో అత్యంత కీలకం. ఒకరకంగా అనేక రాజకీయ పార్టీలకు గేమ్ చేంజర్. అందుకే ఉత్తర ప్రదేశ్ అంటే భారత్... భారత్ అంటే ఉత్తరప్రదేశ్ అంటుంటారు. 545 పార్లమెంటు నియోజకవర్గాల్లో 80 స్థానాలు ఉండబట్టే... యూపీ అనేక మంది ప్రధాన మంత్రులను బహుమతిగా దేశానికి అందించింది. అలాంటి అతి పెద్ద రాష్ట్రంలో ప్రస్తుతం వివిధ గణాంకాల నేపథ్యంలో సరికొత్త రాజకీయ కూటమికి బీజం పడింది. కాంగ్రెస్ పార్టీ మినహా మహాకూటమి పురుడు పోసుకుంటోంది. ఇప్పటి వరకూ ఉప్పు నిప్పులా వ్యవహరించిన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ జట్టు కట్టాయి. అదీ కాంగ్రెస్ పార్టీని పక్కన పెట్టి మరీ 2019 సార్వత్రిక ఎన్నికల్లో మహాకూటమికి శ్రీకారం చుట్టాయి. కాంగ్రెస్ లేకుండా బీజేపీని ఓడించటం సాధ్యం కాదు అని వాదించే వర్గాలకు సమాధానం చెప్పటానికి బీఎస్పీ, ఎస్పీ దగ్గర కారణాలు, గణాంకాలు ఉన్నాయి. ఈ అత్త, అల్లుళ్ల రాజకీయ బంధం రాబోయే ఎన్నికల్లో కీలకం కానుంది. ఒక రకంగా దేశ రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకునే భవిష్యత్ ప్రణాళికే ఈ సరికొత్త సమీకరణకు నేపథ్యం. తమకు అత్యంత బలం ఉన్న స్థానాలను

- మిగతా 2 లో

బ్రెగ్జిట్‌పై ఓడిపోతే ఎన్నికలు జరపాలి : కార్బిన్

లండన్ : బ్రెగ్జిట్ ఒప్పందాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టి సభ ఆమోదం పొందలేక ప్రధానమంత్రి థెరిసామె ఓడిపోయినట్లయితే మళ్లీ సార్వత్రిక ఎన్నికలు జరపాలని ప్రధాన ప్రతిపక్షం లేబర్ పార్టీ నాయకుడు జెరిమికార్బిన్ డిమాండ్ చేశారు. వచ్చే మంగళవారం బ్రెగ్జిట్ ముసాయిదా తీర్మానంపై అంతిమంగా ఓటింగ్ జరగనున్నది. ఇంతవరకు అందిన సూచనల ప్రకారం ఈ ముసాయిదా తీర్మానంపై ప్రభుత్వం ఓటమిచెందే అవకాశమే ఉన్నది. అత్యంత ముఖ్యమైన ఈ చట్టాన్ని ప్రభుత్వం ఆమోదింపజేసుకోవడంలో ఓడిపోతే వీలైనంత త్వరగా సార్వత్రిక ఎన్నికలు జరపాలని కార్బిన్ కోరుతున్నారు. ఇంగ్లాండ్ ఉత్తరప్రాంతంలోనే వేక్‌ఫీల్డులో ఆయన చేయనున్న ప్రసంగంలోని కొన్ని భాగాలను లేబర్ పార్టీ విడుదల చేసింది. కార్బిన్ డిమాండును ప్రస్తావిస్తూ కన్సర్వేటివ్ పార్టీ ఛైర్మన్ బ్రెగ్జిట్‌పైన లేబర్ పార్టీకి సరైన ప్రణాళికలేదని వ్యాఖ్యానించారు. బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందాన్ని ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలన్న గట్టి పట్టుదలతో ప్రధాని థెరిసామె కృషి చేస్తున్నారు. ఈ ఏదాది మార్చి 29లోపు బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుండి పూర్తిగా వైదొలగవలసివుంది.

జర్మనీలో 600 విమానాల రద్దు



ఫ్రాంక్‌ఫర్ట్ : జర్మనీ విమానాశ్రయాల సిబ్బంది సమ్మె చేయడంతో దాదాపు 600 విమానాలు రద్దయ్యాయి. లక్షమందికిపైగా ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. ఫ్రాంక్‌ఫర్ట్‌లోను, స్టట్‌గార్ట్‌లోను 1050 విమానాలలో సగానికిపైగా విమానాల రాకపోకలు ఆగిపోయాయి.

దేశంలోని అతిపెద్ద విమానాశ్రయం డసెల్‌డార్ఫ్ నిర్వాహకుల ప్రకటన ప్రకారం గురువారం 580 ప్రయాణీకుల విమానాలలో 370 విమానాలను రద్దు చేసినట్టు వెల్లడైంది. డిపిఎ వార్తా ఏజెన్సీ ప్రకారం ఉదయం 3 గంటల నుండి రాత్రి 11 గంటలవరకు విమానాల రాకపోకల రద్దువల్ల లక్షమంది ప్రయాణీకులు నిలిచిపోయే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. అలాగే కొలగాన్-బాన్ విమానాశ్రయంనుండి 131 విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. వేతనాలను పెంచాలని కోరుతూ జర్మనీలోని 23వేల మంది విమానాశ్రయాల భద్రతా సిబ్బంది సమ్మె చేస్తున్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

డెమోక్రాట్లతో చర్చల నుండి ట్రంప్ వాకౌట్

సరిహద్దు గోడ నిర్మాణంపై తొలగని ప్రతిష్టంభన

వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ ప్రభుత్వాన్ని తిరిగి పనిచేయించేందుకు డెమోక్రాట్లతో జరిగిన చర్చల నుండి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అకస్మికంగా వాకౌట్ చేశారు. సరిహద్దుల్లో గోడను నిర్మించేందుకు 5.7 బిలియన్ డాలర్ల నిధులు మంజూరు చేయాలని, ట్రంప్ చేసిన ప్రతిపాదనను ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ట్రంప్ ప్రభుత్వాన్ని పాక్షికంగా మూసివేస్తున్నట్టు ప్రకటించారు. కొన్ని శాఖలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రభుత్వాన్ని పూర్తి స్థాయిలో పనిచేయించడం కోసం ట్రంప్‌తో డెమోక్రాట్లు సమావేశమయ్యారు. అయితే ఈ సమావేశం నుండి ట్రంప్ మధ్యలోనే విసవిసా వెళ్లిపోయారు. వెళ్లిపోయేముందు టేబుల్‌పైన గట్టిగా కొట్టి వెళ్లిపోయారని డెమోక్రాట్లు ఆరోపించారు. ప్రభుత్వాన్ని తిరిగి పనిచేయించడానికి సరిహద్దుగోడ నిర్మాణానికి నిధులు ఇవ్వాలన్న డిమాండే ప్రధాన అడ్డంకిగా ఉన్నది. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించడం ద్వారా అక్రమ వలసలను నిరోధించవచ్చునని ట్రంప్ తాను అధికారం చేపట్టకముందు ఎన్నికల్లో చేసిన ప్రచారం సందర్భంగానే చెప్పారు. గోడను నిర్మిస్తానని కూడా హామీ యిచ్చారు. అయితే



అవసరమైన నిధులు కేటాయించడానికి డెమోక్రాట్లు తిరస్కరిస్తున్నారు. గత డిసెంబర్ 22 నుండి ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది. 9 ఫెడరల్ డిపార్టుమెంట్లు, పలు చిన్నచిన్న ఏజెన్సీలు పనిచేయడంలేదు. 8 లక్షలమంది కార్మికులు, సిబ్బందికి ఇంతవరకు వేతనాలు లేవు. గురువారానికి ప్రభుత్వం పనిచేయక 20 రోజులయ్యింది. 1995-96లో కూడా 21 రోజులు ప్రభుత్వం పనిచేయలేదు. తాజాగా వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశానికి స్పీకర్ నాన్సిపెలోసి, సెనేట్ మైనార్టీ నాయకుడు సెనెటర్‌చుక్‌షుమర్ పాల్గొన్నారు. ప్రభుత్వాన్ని తిరిగి పనిచేయిస్తే 30 రోజుల్లోపు గోడ నిర్మాణానికి నిధులు మంజూరుకు తాను మద్దతు ఇస్తానని చెప్పిన పెలోసి ఇప్పుడు తిరస్కరిస్తున్నారంటూ ట్రంప్ ఆగ్రహం ప్రకటించి సమావేశం నుండి వెళ్లిపోయారు. సరిహద్దుల్లో ఎమర్జన్సీని విధించి గోడ నిర్మించాలన్నది చివరి అవకాశమని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం సరిహద్దులుదాటి అక్రమంగా అనేకమంది ప్రవేశిస్తున్నారని, ఫలితంగా మాదక ద్రవ్యాలు స్మగ్లింగ్ అవుతున్నాయని, అలాగే జాతీయ భద్రతకు ముప్పు కలుగుతున్నదని ఆయన అన్నారు. మంగళవారం రాత్రి దేశప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎమర్జన్సీని ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించగా ఏదో ఒక విధంగా ఒప్పందం కుదురుతుందని తాను భావించానని, ఒప్పందం కుదరకపోతే ఎమర్జన్సీ మార్గాన్నే తాను ఎన్నుకునే అవకాశం ఉందని సమాధానం చెప్పారు.

కిమ్-ట్రంప్ చర్చలపై

చైనా తటస్థం?

బీజింగ్ : ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జొంగ్‌ఉన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య మరోసారి జరగనున్న చర్చల నేపథ్యంలో చైనా తటస్థ వైఖరిని అవలంబించవచ్చునని అంతర్జాతీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కిమ్ తాజాగా చైనాలో పర్యటించి ఆదేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చలు జరిపి తిరిగి స్వదేశం చేరుకున్నారు. త్వరలో తాము సమావేశం కానున్నట్టు ట్రంప్ తాజాగా వెల్లడించారు. ముఖ్యంగా అణ్వాయుధాలపైనే చర్చలు జరిగే అవకాశంవుంది. గత ఏడాది జూన్‌లో సింగపూర్‌లో ట్రంప్, కిమ్ సమావేశం కావడానికి ముందుకూడా కిమ్ చైనాలో పర్యటించి జిన్‌పింగ్‌ను కలుసుకుని మాట్లాడివచ్చారు. కిమ్ చైనాలో ఇంతవరకు 4సార్లు పర్యటించారు. సింగపూర్‌లో జరిగిన చర్చల సారాంశాన్ని కూడా కిమ్ చైనాకు వెళ్లి జిన్‌పింగ్‌కు వివరించారు. ఆ సమావేశం తరువాత ఉత్తరకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్ ట్రంప్‌ను కలవడమేగాక ఉత్తరకొరియాకు వెళ్లి కిమ్‌ను కూడా కలుసుకున్నారు. కిమ్, ట్రంప్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరగడానికి మూన్ విశేషంగా కృషి చేశారు. అయితే తాజాగా ట్రంప్‌తో కిమ్ సమావేశమై జరపనున్న చర్చలకు సంబంధించి చైనా తటస్థంగానే ఉండబోతుందన్న విశ్లేషణలు వెలువడ్డాయి. కొరియా ద్వీపకల్పంలో పూర్తి అణునిరాయుధీకరణ అమలు చేయాలని కిమ్‌పైన ట్రంప్ ప్రభుత్వం వత్తిడిచేస్తోంది. అయితే తమపైన విధించిన ఆంక్షలను తొలగించాలని, అలాగే తమ దేశ భద్రతకు అమెరికా తగిన హామీని ఇవ్వాలని ఉత్తరకొరియా కోరుతున్నది. రెండవసారి ట్రంప్‌తో భేటీ అయిన తరువాతగాని ఇరుదేశాల మధ్య సంబంధాలు ఏమేరకు విస్తృతమవుతాయి, సమస్య ఎంతమాత్రం పరిష్కారమవుతుందన్న అంశం స్పష్టమవుతుంది.

కుదరని ఒప్పందం



బీజింగ్ : రెండు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్యయుద్ధాన్ని ముగించి తిరిగి సాధారణ సంబంధాలను ఏర్పరచుకునేందుకు అమెరికా, చైనా ప్రతినిధుల చర్చలు ఫలవంతంకాలేదు. ఈసారి జరిగిన చర్చలలో ఏదో ఒప్పందం కుదురుతుందని భావించారు. చర్చలు ముగిసిన తరువాత ఉన్నతస్థాయి అధికారులు లేదా ప్రభుత్వం నుండి తగిన మార్గదర్శకంతోనే తదుపరి చర్చలు ఉంటాయని సమావేశంలో పాల్గొన్న అమెరికా ప్రతినిధులు వ్యాఖ్యానించారు. ఇక్కడ జరిగిన చర్చల సారాంశాన్ని వారు ప్రభుత్వానికి వివరించనున్నారు. చర్చలు ఫలించకపోవడంతో ఆసియాలో మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రపంచంలో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా, చైనా మధ్య వాణిజ్యయుద్ధం మార్కెట్లు, ఆర్థిక వ్యవస్థలపైన తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది.గత డిసెంబర్ 1న ట్రంప్, జిన్‌పింగ్‌లు మధ్య జరిగిన సమావేశంలో 90 రోజుల్లోపు పరస్పరం విధించుకున్న అదనపు సుంకాలను తగ్గించుకోవాలని నిర్ణయించారు. ముఖ్యంగా కొన్ని చైనా దిగుమతి చేసుకునే వస్తువులపైన అదనంగా సుంకాలు విధించారన్నది ట్రంప్ ఆరోపణ. చర్చల వివరాలను అమెరికా ప్రతినిధి ఒక ప్రకటనరూపంలో తెలియజేశారు. అయితే చర్చల ఫలితాలేమిటన్న అంశాన్ని స్పష్టం చేయలేదు. ఇంతవరకు చర్చలు సానుకూలంగానే జరిగాయని మాత్రం ఆ ప్రకటన తెలిపింది. అలాగే చర్చలు చక్కగా సాగుతున్నాయని బుధవారం ట్రంప్ ఒక ట్వీట్‌లో తెలియజేశారు. చర్చలు ఫలించగలవన్న ఆశాభావాన్ని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారాశాండర్స్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చైనా గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అమెరికా తాజా ప్రకటన ఆరోపించింది. అమెరికా నుండి వ్యవసాయ, ఇంధన, ఉత్పత్తి రంగాలనుండి వస్తువులు, ఇతర ఉత్పత్తులు, సేవలను గణనీయంగా దిగుమతి చేసుకుంటానని చైనా చేసిన వాగ్దానంపై ప్రధానంగా చర్చలు జరిగాయని అమెరికా ప్రతినిధులు తెలియజేశారు.

క్యూబా పుస్తక ప్రదర్శనకు 43 దేశాలు



హవానా : క్యూబా 28వ అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనకు 23 దేశాల ప్రతినిధులు, పుస్తక ప్రచురణకర్తలు, రచయితలు పాల్గొంటారని నిర్వాహకులు తెలియజేశారు. ఫిబ్రవరి 7 నుండి 17వ తేదీవరకు ఈ పుస్తక ప్రదర్శన జరుగుతుంది. 5 ఖండాలనుంచి 43 దేశాల పుస్తక ప్రచురణకర్తలు ఈ ప్రదర్శనకు హాజరవుతామని ధృవీకరించినట్టు క్యూబా బుక్‌ఛాంబర్ డైరెక్టర్ సోనియాఅల్‌మగర్ తెలియజేశారు. పీపుల్స్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ అల్జీరియా ప్రతినిధి గౌరవ అతిథిగా పాల్గొంటారు. క్యూబా రచయిత ఎడర్డొహెరాన్‌లియాన్‌కు ఈ పుస్తక ప్రదర్శన ఘనంగా నివాళి అర్పిస్తుందని ఆయన తెలిపారు. ఆయన సాహిత్యంలో జాతీయస్థాయి అవార్డును 2001లోనూ, 2014లోనూ అందుకున్నారు. అల్జీరియా, అర్జెంటైనా, మెక్సికో, అమెరికా, చిలీ దేశాలనుండి ఎక్కువమంది ప్రచురణకర్తలు, రచయితలు పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. 23 లాటిన్ అమెరికా దేశాలనుండి మేధావులతో సహా వృత్తినిపుణులు పాల్గొంటామని ధృవీకరించారు. 20 దేశాలనుండి 120 మంది ప్రచురణకర్తలు తాము పాల్గొంటున్నట్టు లేఖలు రాశారు. అలాగే 354 మంది రచయితలు, ఇతర మేధావులు హాజరుకానున్నారు. సాహిత్యం, చరిత్ర విభాగాలలో నికొలస్‌గులియన్ పొయిట్రీ అవార్డు, అలిజొకార్పెంటర్ నవల, చిన్న కథ, వ్యాసం తదితర విభాగాలలోనూ అవార్డులను అందజేయనున్నారు. క్యూబా 60వ విప్లవ వార్షికోత్సవానికి, క్యూబా వ్యవస్థాపక 500వ వార్షికోత్సవానికి ఈ పుస్తక ప్రదర్శనను అంకితమిస్తున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు.వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలనుండి రచయితలు, ఎడిటర్లు, అనువాదకులు, డిజైనర్లు, చిత్రకారులు, పంపిణీదారులు, సాహిత్య పఠనపట్ల ఆసక్తి కలిగిన ప్రజలు అత్యధికంగా పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.

అనంతపురం వైద్య కళాశాల

ఏజెన్సీలకు కామధేనువు

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : అనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 33 పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న పాలకవర్గం నిర్ణయించింది. వీటిలో 18 పోస్టుల నియామకాలను కామధేను అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి, 15 పోస్టుల భర్తీని రిషి వెంకటేశ్వర ఏజెన్సీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. మెడికల్ కాలేజీలో ఉద్యోగమనే సరికి నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ఎగబడుతున్నారు. పోస్టుల భర్తీ కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు నిరుద్యోగుల డిమాండును క్యాష్ చేసుకోవాలని భావించాయి. అందులో భాగంగానే అధికార టీడీపీ నాయకులతో కలిసి 'కలెక్షన్' సెంటర్‌ను ఓపెన్ చేశాయి. పోస్టు ప్రాధాన్యాన్నిబట్టి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఏజెన్సీలు వసూలు చేసినట్లు సమాచారం. భారీగా డబ్బులు ముట్టజెప్పిన వారికే పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ప్రతిష్టాత్మకమైన మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి కనీసం ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే నోటిషికేషన్ జారీ చేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికి వారు ఉద్యోగాల కోసం ఎగబడి లక్షలాది రూపాయలు చెల్లించారు. దీనివల్ల అర్హులు ఉద్యోగాలను కోల్పోయే పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో పోస్టుల పందేరంపై పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితంకావటంతో, అంతా పారదర్శకంగానే జరుగుతోందని ఏజెన్సీ చెబుతోంది. అయితే, ఏజెన్సీ నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెడికల్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీని వ్యతిరేకిస్తూ రెగ్యులర్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. తమకు పదోన్నతులు కల్పించకుండా ఖాళీ పోస్టులను భర్తీ చేయటం వల్ల నష్టపోతామని వారు కోర్టుకు నివేదించారు. పదోన్నతులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించటంలేదని తెలిపారు. దీంతో హైకోర్టు గత నెల 21న ఉద్యోగులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ప్రస్తుతానికి అవుట్ సోర్సింగ్ విధానంలో పోస్టుల భర్తీని నిలుపుదల చేయాలని ఆదేశించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు కాలేజీ పాలకవర్గం చైర్మన్, కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకూ అందాయి. అయినప్పటికీ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు నియామక ప్రక్రియను నిలుపుదల చేయకపోవటం గమనార్హం.

తప్పొప్పుకున్నా...మళ్లీ అదే తీరు

మెడికల్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో చోటు చేసుకున్న అక్రమాల ఆ నోటా, ఈ నోటా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో అవుట్ సోర్సింగ్ ఏజె న్సీలను ప్రభుత్వం హెచ్చరించింది. పోస్టుల భర్తీ విషయంలో తాము తప్పు చేశామని, క్షమించమని కోరిన ఏజెన్సీలే, మళ్లీ అక్రమ మార్గంలోనే భర్తీ ప్రక్రియకు సిద్ధంకావటం వెనుక పెద్దల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం పోస్టులను భర్తీ చేస్తామని అధికారుల వద్ద ఏజెన్సీలు లిఖితపూర్వకంగా సంజాయిషీ కూడా ఇచ్చాయి.

నోటీసు బోర్డుకే పరిమితం

అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీపై విమర్శలు వెల్లువెత్తటంతో ఏజెన్సీలు తమ అక్రమ వసూళ్లను మాత్రం ఎక్కడా ఆపలేదు. నోటిఫికేషన్ జారీకి బదులు మెడికల్ కాలేజీ నోటీసు బోర్డులో పోస్టుల వివరాలను పెటాయి. ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నోటీసు ఉంచారు. పోస్టుల భర్తీ కోసం ఏజెన్సీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టంగా పేర్కొనటం మరోసారి విమర్శలకు తావిస్తోంది. వాస్తవానికి అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీపై పత్రికలలో ప్రకటన ఇవ్వాల్సి ఉండగా, అక్రమంగా పోస్టులను భర్తీ చేయాలనే దురుద్దేశంతో ఏజెన్సీలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్రయోగాత్మకమంటూ...

నియామకాలు చేపట్టవద్దంటూ ఒకవైపున కోర్టు ఆదేశించినా, రిషి వెంకటేశ్వర అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ఆరు పోస్టులను ప్రయోగాత్మకంగా భర్తీ చేసేందుకు ఫైల్ సిద్ధం చేసింది. ల్యాబ్ అటెండెంట్, స్వీపర్‌తోపాటు సోషల్ వర్కర్, ల్యాబ్ టెక్నిషియన్ పోస్టులు రెండు చొప్పున భర్తీ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జన్మభూమి మా ఊరు గ్రామ సభల్లో కలెక్టర్ బిజీగా ఉండగా, ఏజెన్సీ మాత్రం ఆరుగురికి పోస్టింగ్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఒక జాబితాను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో ఖరారు చేశారు. హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ, దీనిపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే మిగిలిన పోస్టులను భర్తీ చేస్తామని మెడికల్ కాలేజీవర్గాలు చెబుతుండటం గమనార్హం.

అవుట్ సోర్సింగ్ పోస్టులు ఇవే

జూనియర్ అకౌంటెంట్‌లు, స్టోర్ కీపర్లు, గుమస్తాలు, రికార్డు అసిస్టెంట్‌లు మెడికల్ రికార్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఎంఎన్‌డబ్ల్యూలు, ఎలక్ట్రిషియన్‌లు, ప్లంబర్లు, రేగియోగ్రాఫిక్ టెక్నిషియన్‌లు, ఎంఆర్‌డబ్లు టెక్నిషియన్‌లు, సోషల్ వర్కర్స్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ల్యాబ్ అటెండెంట్‌లు, స్వీపర్లు, వ్యాన్ డ్రైవర్లు, క్లీనర్లు, వాచ్‌మెన్ పోస్టులు .

మళ్లీ వేటు..!

(మొదటిపేజీ తరువాయి)

లోగా హైపవర్ కమిటీ తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఐతే, సుప్రీంకోర్టు ఆదేశాలు వెలువడిన కేవలం రెండు రోజుల్లోనే హైపవర్ కమిటీ భేటీ కాగా... ఆయనను సీబీఐ డైరెక్టర్‌గా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. అంతే కాకుండా తాత్కాలిక డైరెక్టర్‌గా మరల నాగేశ్వరరావును నియమించారు. రెండు రోజుల కిందటే సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అలోక్‌వర్మ కూడా దూకుడుగానే వ్యవహరించారు. మొదటి రోజే 10 మంది సీబీఐ అధికారుల బదిలీలను నిలిపివేశారు. తాత్కాలిక సీబీఐ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఉత్తర్వులను రద్దు చేశారు. పదిమంది అధికారులు పూర్వపు బృందాల్లోనే కొనసాగుతారని స్పష్టం చేశారు. మోడీ, జస్టిస్ ఏకే సిక్రీ, కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గేతో కూడిన హైపవర్ కమిటీ ప్రధాని ఇంట్లో గురువారం సాయంత్రం భేటీ అయింది. సుమారు రెండు గంటపాటు ఈ కమిటీ చర్చించింది. కడకు అవినీతి ఆరోపణలు, విధుల దుర్వినియోగం తదితర అభియోగాలతో అలోక్‌వర్మను తొలగించారు. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావుకే బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. అలోక్ వర్మ పదవీ కాలం జనవరి 31తో ముగుస్తుంది. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు పంపించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతూ, సెంట్రల్ విజి లెన్స్ కమిటీ నివేదిక డాక్యుమెంట్లను చూపించాలని తాను కోరినట్టు తెలిపారు. తనను తప్పించడానికి కొన్ని గంటల ముందే.. అలోక్‌వర్మ ఐదుగురు సీబీఐ అధి కారులను బదిలీ చేశారు. ఆయన పదవిలో చేరిన రోజు 10 మంది అధికారుల బదిలీలను రద్దు చేశారు. గురువారం ఐదుగురు సీబీఐ అధికారులు అజయ్ భట్నాగర్, ఎంకే సిన్హా, తరుణ్ గౌబా, మురుగేసన్, ఏకే శర్మను బదిలీ చేశారు. ఇదిలా ఉంటే...అలోక్‌వర్మను తొలగించే వరకూ నరేంద్ర మోడీ నిద్రపోరని, ఎప్పుడు వేటు వేయాలా అని ప్రధాని తహతహలాడుతున్నారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. కేవలం రాఫెల్ కుంభకోణాన్ని అలోక్‌వర్మ తిరగతోడుతారనే భయంతోనే ప్రధాని ఆందోళన చెందుతున్నారని రాహుల్ ట్వీట్ చేశారు.

18 నుంచి ఎస్జీటీ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

సెషన్లలో పరీక్షలు జరుగుతాయి.

వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు :

ఎస్జీటీ, స్పెషల్ స్కూల్(ఎస్‌ఏ) అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను 'సీఎస్‌ఈ.ఏపీ.గౌవ్.ఇన్' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఎస్జీటీ అభ్యర్థులకు 3గంటలు, స్పెషల్ స్కూల్(ఎస్జీటీ), ఎస్‌ఏ అభ్యర్థులకు 2.30గంటల వ్యవధితో పరీక్షలు నిర్వహిస్తారు. ఎస్జీటీ పరీక్షలకు భారీ సిలబస్ రూపొందించడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. అతితక్కువ సమయంలో టెట్ కమ్ టీఆర్టీ సిలబస్‌ను అధ్యయనం చేయడం అసాధ్యమని పేర్కొంటున్నారు.

13న డీఎస్సీ నమూనా పరీక్ష : ఎస్టీయూ

డీఎస్సీ నమూనా పరీక్షలను ఈ నెల 13వ తేదీ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ ఎస్జీటీ (తెలుగు మీడియం) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఆఫ్‌లైన్లో పరీక్ష నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతి కేంద్రంలోనూ అభ్యర్థులు పొందిన మార్కులు తెలిపి మొదటి మూడు ర్యాంకులకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఆయా జిల్లాల ఎస్టీయూ శాఖలను సంప్రదించాలని కోరారు.

బీజేపీకి కూటమి బీపీ...!

(మొదటిపేజీ తరువాయి)

తిరిగి కైవశం చేసుకుని పోలింగ్ అనంతరం రాజకీయ పరిణామాల్లో చక్రం తిప్పాలన్నది బీఎస్పీ, ఎస్పీ కూటమి వ్యూహంగా కనిపిస్తోంది. బీజేపీని ఓడించటానికి ఈ కీలక రాష్ట్రంలో ప్రధానంగా ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ అవసరం లేదు. రెండోది కాంగ్రెస్ ఓటు బదిలీ జరగదు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ - కాంగ్రెస్ కూటమి ప్రయోగం ఫలించలేదు. కాంగ్రెస్‌తో జట్టు కట్టిన ఎస్పీకి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అలాగే మధ్యప్రదేశ్‌లో మద్దతు ఇచ్చినా మంత్రి వర్గంలో ఎస్పీకి కాంగ్రెస్ అవకాశం ఇవ్వలేదు. బీజేపీని ఓడించటానికి ఏకతాటిపైకి రావాలని ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడి పెంచుతున్న కాంగ్రెస్ పార్టీ... చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో విజయగర్వంతో...చిన్న పార్టీల డిమాండులను పట్టించుకోలేదు. ఇక దళితుల ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ అయ్యే ప్రమాదం ఉందని మాయావతి ఆందోళన చెందుతున్నారు. బీఎస్పీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆమె వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. త్రిముఖ పోటీతోనే తమ కూటమికి ప్రయోజనం కలుగుతుందని బీఎస్పీ, ఎస్పీ భావిస్తున్నాయి. రైతులు, దళితులు, బలహీన వర్గాల ఓట్లతో మహాకూటమి బీజేపీకి కాంగ్రెస్ ఓట్లు పడకుండా అడుకోగలదని ఈ రెండు పార్టీల ఆలోచన. అజిత్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌దళ్, ఇతర పార్టీలతో మహాకూటమికి రంగం సిద్ధమవుతోంది. పశ్చిమ యూపీలో చక్కెర రైతుల్లో ఆర్‌ఎల్డీ బలాన్ని పెంచుకుంది. ఇప్పటికే ఈ పార్టీ రైతుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఓం ప్రకాశ్ రాజ్‌భార్ నేతృత్వంలోని సుహల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ, కృష్ణ పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్‌ను ఈ కూటమిలోకి రప్పించే అవకాశం ఉంది. చేతులు కలిపిన ఈ వైరి వర్గాల మధ్య గణాంకాలే కాదు...కెమిస్ట్రీ పండుతోంది. యూపీలో 2014 ఎన్నికల్లో బీజేపీ ఓటు షేర్ 42.63 శాతం కాగ, ఎస్పీ,బీఎస్పీ కూడా 42.19 శాతం ఓట్లు సాధించాయి. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో మాయావతి 22.23 శాతం, ఎస్పీ 28.32 శాతం ఓట్లు సాధించాయి. ఈ కూటమిలో కాంగ్రెస్ పార్టీ చేరితే ఓట్ల షేర్ బీజేపీని మించుతుంది. ఐతే, కాంగ్రెస్‌తో కలిసే విషయంలో ఎస్పీ, బీఎస్పీ ఏకాభిప్రాయంతో లేవు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చెలిమి కారణంగా తీరని నష్టం కలిగింది. త్రిముఖ పోటీతోనే బీజేపీని నిలువరించవచ్చనే అభిప్రాయం బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో. వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పార్టీ సహకారంతో బీజేపీని ఓడించాలనేది ఎస్పీ-బీఎస్పీ పథకం. రాజకీయ పరిశీలకుల విశ్లేషణ ప్రకారం ఎస్పీ-బీఎస్పీ కూటమికి కనీసం 50 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఇక బీజేపీ, కాంగ్రెస్‌కు 30 సీట్లు వస్తాయి. రాహుల్, సోనియా స్థానాలతో పాటు మరో ఒకటి రెండు స్థానాల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉంది. ఇక బీజేపీ 24 నుంచి 25 స్థానాలు దక్కవచ్చు. హిందీ రాష్ట్రాలకు గుండెకాయలాంటి రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో మరో 30 సీట్లను బీజేపీ కోల్పోయే అవకాశం ఉంది. ఇతర రాష్ట్రాలోనూ మరో 20 సీట్లు తగ్గవచ్చు. 2014లో 282 స్థానాలు సాధించిన బీజేపీ 2019లో సుమారు 100 స్థానాల్లో ఓడిపోవటం ఖాయంగా కనిపిస్తోంది. ఇక పశ్చిమబెంగాల్, ఒడిశా, దక్షిణ భారత దేశంలో బీజేపీ ఎంత మేరకు కోలుకుంటో అంచనా లేదు. నిజానికి బీజేపీకి బలమైన మిత్ర పక్షం లేదు. తెలుగు దేశం పచ్చీ కొట్టింది. ఒంటరిగానే పోటీ చేస్తానని శివసేన స్పష్టం చేసింది. అకాలీదళ్ తీవ్ర నిరాశలో ఉంది. తాజాగా అస్సాం గణ పరిషత్ వైదొలిగింది.

కేంద్రం తీసుకు వచ్చిన పౌరసత్వం బిల్లుతో అస్సాంలో బీజేపీ ప్రభుత్వంపై ముప్పేట దాడి జరుగుతోంది. ఒక రకంగా ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీపై తీవ్ర వ్యతిరేక పెరుగుతోంది. 2014 నుంచి ఇప్పటి వరకూ 19 మిత్ర పార్టీలు ఎన్డీయేకు గుడ్‌బాయ్ చెప్పాయి. దీంతో బీజేపీకి కష్టకాలం తప్పేట్టు లేదు. ఐతే, బీజేపీ మాత్రం ఈ విశ్లేషణలను తిప్పికొడుతోంది. మోడీ చరిష్మా, బలమైన నాయకత్వం, క్రమశిక్షణ గల పార్టీగా తిరిగి అధికారంలోకి రాగలమని కమలనాథులు దీమా వ్యక్తం చేస్తున్నారు. ఐతే, పార్టీల్లో అంతర్గతంలో ఆందోళన తప్పటం లేదు. అమిత్‌షా మాటను పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. వచ్చే వారం జరిగే నేషనల్ కౌన్సిల్ సమావేశాల్లో సరి కొత్త వ్యూహాలకు పదును పెట్టాలని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తోంది. ఏతావాతా వచ్చే ఎన్నికల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలబడుతామని బీజేపీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సువిధ బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

విక్రయించింది. ఇవి పూర్తయ్యాక వెయిటింగ్ లిస్ట్ టికెట్ల కేటాయింపునకు వెళ్లింది. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు సాధారణ చార్జీ రూ.220 కాగా, సువిధ రైళ్లలో డైనమిక్ ఫేర్‌లో గరిష్ఠ ధర రూ.1,065గా నిర్ణయించారు. సికింద్రాబాద్- విశాఖపట్నం స్లీపర్ చార్జీ రూ.360 కాగా, సువిధలో రూ.1365గా నిర్ణయించారు. పైగా ఆర్‌ఏసీ టికెట్లలో ఒక బెర్తును ఇద్దరికి కేటాయించడానికి పూనుకున్నారు. ఈ విధానం సాధారణంగా రైళ్లలో ముందు నుంచే ఉన్నదే అయినా ఐదారు రెట్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్న సువిధ రైళ్లలోనూ దాన్ని అమలుచేయడం ఏమిటని నిలదీస్తున్నారు. టికెట్ రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణీకులు ఎవరైనా దానిని రద్దు చేసుకున్న పక్షంలో ఆర్‌ఏసీ వారికి ఆ బెర్తు కేటాయిస్తారు. పండగ సమయంలో మూడు నుంచి నాలుగు రెట్ల అధిక చార్జీతో టికెట్ కొన్నవారు ప్రయాణం రద్దుచేసుకునే అవకాశాలు ఉండవని రైల్వే అధికారులే అంటున్నారు. అంటే గమ్యస్థానం చేరే వరకు బెర్తులో పడుకునే అవకాశం ఉండదన్నమాట. అధికారులకు ఈ విషయం తెలిసినా రెట్టింపు ధరలు వసూలు చేస్తూ ప్రయాణీకులను దోచుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రయాణీకులు ప్రశ్నిస్తున్నారు.

చరిత్రకు చిహ్నం

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రాష్ట్రానికి రూ.70 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, వీటి ద్వారా 1.10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. రాజధానిలో నిర్మించనున్న వెల్కమ్ గ్యాలరీ వాణిజ్య, సమాజాభివృద్ధి కేంద్రంగా ఉంటుందన్నారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2,300 సంవత్సరాలనాటి తెలుగు జాతి వైభవాన్ని, స్మృతులను గ్యాలరీ ప్రతిబింభిస్తుందని చెప్పారు. కేపిటల్ సిటీ మోడల్‌లో వెల్కమ్ గ్యాలరీ నిర్మాణం ఉంటుందన్నారు. ఇందులో కన్వెన్షన్ సెంటర్లు, రిక్రియేషన్ జోన్స్, హెల్త్ కార్నర్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ ప్రాంతాలు ఉంటాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను ప్రోత్సహించేలా కో వర్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబరుకల్లా గ్యాలరీని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. భవిష్యత్తులో పలు అంతర్జాతీయ ఒప్పందాలకు వెల్కమ్ గ్యాలరీ గమ్యస్థానంగా ఉంటుందన్నారు. స్టార్టప్స్, మార్కెట్ లీడర్స్, అకడమిక్ ఇన్‌ఫ్లుయన్సర్లను ఏడీపీ ఒకచోటకు తేవటంపై చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్ మాట్లాడుతూ, సింగపూర్, ఆంధ్రప్రదేశ్ మధ్య పటిష్ట బంధం ఏర్పడిందన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి తాము పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. వెల్కమ్ గ్యాలరీ వాక్‌లో మంత్రులు నారాయణ, నక్కా ఆనందబాబు, పీ పుల్లారావు, తాడికొండ ఎమ్మెల్యే టీ శ్రావణ్‌కుమార్, పెట్టుబడులు, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, సీఆర్‌డీఏ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, అమరావతి అభివృద్ధి అథారిటీ ఎండీ లక్ష్మీ పార్థసారథి భాస్కర్, సీఎం కార్యదర్శులు సాయి ప్రసాద్, రాజమౌళి, గిరిజా శంకర్, రేరా అధ్యక్షుడు రమానాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీ మోడల్ స్కూళ్లలో..

6వ తరగతి ప్రవేశాలకు ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని 164 మోడల్ స్కూళ్ల (ఆదర్శ పాఠశాలలు)లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం పాఠశాల విద్యాకమిషన్ ఓ ప్రకటనను విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులంతా ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకు ఆన్‌లైన్లో పరీక్ష ఫీజు రూ.100, (ఎస్సీ, ఎస్టీలు రూ.30) చెల్లించాలి. మార్చి 31వ తేదీ ఉ॥ 9గం॥ నుంచి 11గం॥ వరకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో, తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుంది. వచ్చిన మార్కుల ఆధారంగా కేటగిరీల వారీగా ప్రవే శాలు కల్పిస్తారు. మోడల్ స్కూళ్లు, ప్రవేశపరీక్షల సిలబస్‌ను 'సీఎస్‌సీ.ఏపీ. గౌవ్.ఇన్' వెబ్‌సైట్‌లో పొందవచ్చు అని ప్రకటన పేర్కొంది.

జన్మభూమికి అపూర్వస్పందన

- ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు వివరించాలి
- అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జన్మభూమికి అపూర్వస్పందన లభిస్తోందని, గతంలో కన్నా అత్యధికంగా ప్రజల భాగస్వామ్యం ఉంటోందని సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. 9వరోజు జన్మభూమిపై ముఖ్యమంత్రి గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రాలపై చర్చించాలని అధికారులకు సూచించారు. గ్రామసభలను విజయవంతం చేయడంతోపాటు, వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 'నిన్న ఒక్కరోజే రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఒప్పందాలు చేశాం. దాంతో లక్షా 26వేల ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు రానున్నాయి. విశాఖలో డేటా సెంటర్ హబ్, డేటా సెంటర్ పార్కులు, సోలార్ పార్కులు. రూ.30వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ పార్కులు, రూ.40వేల కోట్లతో సోలార్ పార్కులు వస్తాయి. వర్జీనియాకు దీటుగా విశాఖ మారుతుంది. ప్రకాశం జిల్లాలో రూ.24,500కోట్ల పెట్టుబడి రానుంది. ఆసియా పల్ప్ అండ్ పేపర్ మిల్స్ వస్తోంది. ప్రత్యక్షంగా 4,500, పరోక్షంగా రూ.12వేల మందికి ఉపాధి లభిస్తుంది. 50వేల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రామాయపట్నం పోర్టు, భావనపాడు పోర్టు రానున్నాయి. ఏపీ లాజిస్టిక్స్ హబ్ కానుంది. ఉత్తరాంధ్ర, రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. వెనుకబడిన జిల్లాల్లో ఇప్పటికే సంపద సృష్టిస్తున్నాం. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. అటు అభివృద్ధికి, ఇటు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మనం చేస్తున్న కార్యక్రమాలన్నీ ప్రజలకు వివరించాలని' అని అధికారులతో చంద్రబాబు అన్నారు.

సాగుకు ఎదురీత

- రబీలో ఇప్పటి వరకు 55శాతం సాగు
- సాగునీటి కొరతతో వరికి ఆటంకాలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రబీసీజన్‌లో వరిసాగు చేసేందుకు రైతాంగం ఎదురీదుతున్నది. సాగునీరు కొరత తీవ్రంగా ఉండటం వలన నాట్లు వేసే పరిస్థితి కనిపించడంలేదు. అడపా దడపా నాట్లు వేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో లక్ష్యం నెర వేరడంలేదు. సీజన్ ఆరంభమై నాలుగో నెల నడుస్తున్న ప్పటికీ పరిస్థితిలో మార్పురాలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది రబీసీజన్‌లో వరి పంట 7.45లక్షల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే ఇప్పటి వరకు 4.13లక్షల హెక్టార్లలో మాత్రమే నాట్లు వేయ గలిగారు. అంటే కేవలం 55శాతం మేరకు సాగు చేశారు. ఆశించినస్థాయిలో వర్షాలు కురవకపోవడం వలన సాగునీటి కొరత ఏర్పడింది. పైగా జలాశయాల నుంచి విడుదల చేస్తామని ప్రకటించిన మేరకు జలాలను విడుదల చేయలేదు. దీంతో రబీలో వరిసాగు నత్తనడకన సాగుతోంది. గుంటూరుజిల్లాలో 22,254 హెక్టార్లలో వరిసాగు చేయాల్సి ఉండగా 18,946 హెక్టార్లలో సాగు చేశారు. అంటే 85శాతం సాగు జరిగింది. కృష్ణానది నుంచి డెల్టా ప్రాంతాలకు నీరు విడుదల చేయడంతో ఇక్కడ సాగు ముందుకు వెళుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 1,73,570 హెక్టార్లకు 1,45,689 హెక్టార్లలో సాగు చేశారు. ఇక్కడ 84 శాతం సాగు చేయగలిగారు. గోదావరి నుంచి జలాలు విడుదల చేయడంతో ఇక్కడా కాస్తా వేగంగా వరినాట్లు వేస్తున్నారు. ప్రకాశం జిల్లాలో 44,971 హెక్టార్లకు 35,113 హెక్టార్లలో అంటే 78శాతం సాగు చేశారు. తూర్పుగోదావరిజిల్లాలో 1,63,161 హెక్టార్లకుగాను 85,229హెక్టార్లలో అంటే 52శాతం పనులు పూర్తి అయ్యాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు సాగులో బాగా వెనకబడ్డాయి. రాయలసీమలో వర్షాలు కురవకపోవడంతోపాటు భూగర్భజలాలూ అడిగంటినాయి. ఈ నేపథ్యంలో వరిసాగు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు బోర్లపై ఆధారపడి కొంతవరకు సాగు చేశారు. చిత్తూరు జిల్లాలో 42,908 హెక్టార్లకుగాను 24,517 హెక్టార్లలో, కడపజిల్లాలో 13,312 హెక్టార్లకుగాను 1,306హెక్టార్లలో, అనంతపురం జిల్లాలో 11,190హెక్టార్లకు 4,348హెక్టార్లలో, కర్నూలు జిల్లాలో 27,371 హెక్టార్లకు 4,359 హెక్టార్లలో సాగు చేశారు. శ్రీకాకుళంలో 3,467 హెక్టార్లకు 600 హెక్టార్లలో, విజయనగరంలో 4,908 హెక్టార్లకు 133 హెక్టార్లలో, విశాఖపట్నంజిల్లాలో 5,401హెక్టార్లకు 64హెక్టార్లలో వరినాట్లు వేశారు.

ఆరుజిల్లాల్లో వెనకబడిన సాగు

రాష్ట్రంలో ప్రధానంగా ఆరుజిల్లాల్లో రబీ వరిసాగు తీవ్రంగా వెనకబడింది. విశాఖ జిల్లాలో ఒక్క శాతమే నాట్లు వేశారు. విజయనగరం జిల్లాలో మూడుశాతం, శ్రీకాకుళంజిల్లాలో 17శాతం, కర్నూలు జిల్లాలో 16 శాతం, కడప జిల్లాలో 10శాతం, అనంతపురం జిల్లాలో 39శాతం సాగు చేశారు. దీంతో ఈ జిల్లాల్లో వరినాట్లు పడే పరిస్థితి కనిపించడంలేదని తెలుస్తోంది.

దిగుబడులపై పెనుప్రభావం

సాగు తగ్గిపోవడంతో దిగుబడులపై పెను ప్రభావం చూపే అవకాశాలున్నాయి. రబీ సీజన్‌లో 7.45 లక్షల హెక్టార్లలో సాగు చేసి 40లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడులను సాధించాలని వ్యవసాయశాఖ కార్యాచరణ రూపొందించింది. సాగు సగానికి సగం పడిపోవడంతో దిగుబడులు భారీగా తగ్గుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

'జగన్' అధికారంతో రాక్షసరాజ్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో రాక్షస రాజ్యం నెలకొంటుందని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.తులసి రెడ్డి ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. భారీఖర్చుతో ఈయన పాదయాత్ర నిర్వహించారని, ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను డబ్బుతో విక్రయిస్తున్నారని విమర్శించారు. జగన్ అవినీతి సామ్రాజ్యం ఇప్పటికే బెంగళూరు, హైదరాబాద్, కడప, పులివెందుల ప్రాంతాల్లో విస్తరించిందని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర వ్యాప్తంగా రౌడీరాజ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

13న పెదరావూరులో సంక్రాంతి సంబరాలు

పాల్గొననున్న పవన్‌కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ నెల 13వతేదీన తెనాలి సమీపంలో ఉన్న పెదరావూరులో జరిగే సంక్రాంతి సంబరాల్లో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పాల్గొంటారని పార్టీ ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెదరావూరులో ఒక వ్యవసాయక్షేత్రంలో ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులతో పవన్ ఇష్టాగోష్టి కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లాలో డెల్టా పరిధిలో ఉన్న రైతాంగం హాజరవుతుంది. తర్వాత స్థానిక ప్రజలతో మమేకమై, ఆడపడుచులు నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో పాలుపంచుకుంటారు. ఈ సందర్భంగా జనసేన సాంస్కృతిక విభాగాన్ని పవన్ ప్రారంభిస్తారు. జనసేన కళాకారులు రూపొందించిన ఆడియో, వీడియోలను ఆవిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ మంత్రులు బాలరాజు, రావెల కిషోర్‌బాబు, జనసేన ప్రధాన కార్యదర్శులు తోట చంద్రశేఖర్, ముత్తంశెట్టి కృష్ణారావు, రాష్ట్ర కన్వీనర్ చింతల పార్థసారథి, పాల్గొంటారని మహేందర్‌రెడ్డి వెల్లడించారు.

రాష్ట్రాల ప్రతిపాదనలతో ఏజెండా

జీఎస్టీ సమావేశంలో ఆర్థికమంత్రి యనమల డిమాండు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వస్తుసేవల పన్ను (జీఎస్టీ) మండలి సమావేశం అజెండా ఖరారు చేయడంలో రాష్ట్రాల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు డిమాండు చేశారు. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన 32వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో యనమల మాట్లాడుతూ కేంద్రం అనుకున్న వస్తువులనే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకొస్తున్నారు. రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతిపాదనలు పట్టించుకోవడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ స్పందిస్తూ తదుపరి సమావేశాలకు రాష్ట్రాల ప్రతిపాదనలు తప్పనిసరిగా తీసుకొని అజెండా ఖరారు చేస్తామని హామీ ఇచ్చారని సమావేశం అనంతరం యనమల మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీకి సంబంధించి జీఎస్టీపై పలు అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు చెప్పారు. రియల్ ఎస్టేట్ అంశానికి సంబంధించి సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ఫిట్‌మెంట్ కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలపై సానుకూలంగా ఉన్నారని, ఏపీ నుంచి రియల్ ఎస్టేట్‌కి సంబంధించి ఏవైతే కోరుతున్నామో ఫిట్‌మెంట్ కమిటీ కూడా అవే ప్రతిపాదనలు చేసిందన్నారు. ఎంఎస్‌ఎంఈఎస్ గూడ్స్ వ్యాపారులకు రిజిస్ట్రేషన్ పరిమితిని రూ.20 లక్షల నుండి రూ.40 లక్షలకు పెంచేందుకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుందని, దీనివల్ల చిన్న వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సెటిల్ కాని ఐజీఎస్‌టీ డబ్బు రూ.7 వేల కోట్లు వెంటనే సెటిల్ చేయాలని కోరామని, దీనివల్ల రాష్ట్రానికి రూ.100 కోట్లు వస్తుందని యనమల తెలిపారు.

రైల్వే కూలీల చిలక్కొట్టుడు..!



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకుని రైల్వే కూలీలు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా విజయవాడ నుంచి ఉదయం వేళల్లో చెన్నై, సికింద్రాబాద్, విశాఖపట్నం బయలుదేరే ఇంటర్‌సిటీ రైళ్లలోని జనరల్ బోగీల్లో సీట్లను ముందే ఆక్రమించి దూరాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. మరికొన్ని దూర ప్రాంతరైళ్లలో కూడా ప్లాట్ ఫారం చివర కాపు కాచి జనరల్ బోగీల్లోకి చొరబడి సీట్లను ఆక్రమించి అమ్ముకుంటున్నారు. కుటుంబాలతో బయలుదేరే వారి నుంచి పెద్ద మొత్తంలో దండుకుంటున్నారు. ఒక్కో సీటును రూ.100 నుంచి రూ. 300 వరకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. పండగ సమీపిస్తుండడంతో అన్ని ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు రద్దీగా నడుస్తున్నాయి. 120 రోజులు ముందే బెర్తులు, సీట్లను రిజర్వేషన్ చేయించుకునే సదుపాయం ఉండటంతో అనేకమంది ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్నారు. అనివార్య కారణాల వల్ల టికెట్లు బుక్ చేయలేని వారు తత్కాల్ కోటాలో టికెట్లు లభించక జనరల్ బోగీల్లో ప్రయాణిస్తున్నారు. ఇంటర్‌సిటీ రైళ్లలో యార్డ్‌లోనే రైల్వే కూలీలు ఎక్కి ఆక్రమించేయడంతో రైలు ప్లాట్‌ఫారంపైకి వచ్చేసరికి ప్రయాణికులకు సీట్లు లభించని పరిస్థితి. విజయవాడ రైల్వేస్టేషన్‌లో గురువారం ఉదయం ఇంటర్‌సిటీ రైలెక్కిన ప్రవీణ్‌సింగ్... సీట్ల విక్రయ బాగోతాన్ని తన మొబైల్‌లో చిత్రీకరించి బయటపెట్టారు. రైల్వేమంత్రి పీయూష్ గోయల్, విజయవాడ డీఆర్‌ఎం ధనుంజయులుతోపాటు ఐఆర్‌సీటీసీ అధికారులకు ఆ వీడియోను ట్విట్టర్ ద్వారా ట్యాగ్‌చేశారు. వెంటనే స్పందించిన డీఆర్‌ఎం విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకున్న సందర్భాలున్నా ప్రయాణికులు దోపిడీకి గురవుతునే ఉన్నారనడానికి ఈ ఘటనను ఉదాహరణగా చెప్పవచ్చు.

సంపాదకీయం

'ప్రత్యామ్నాయ' వాంఛ

నూతన సంవత్సరంలో కొత్త ఆశలు, ఆంక్షలు చిగురిస్తాయి. గతం గతహ.. అన్నట్లుగా గడిచిపోయినది వదిలేసి తమ జీవితాల్లో కొత్త దనాన్ని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తారు. తమ తలరాతలు మారుతాయని, తమ బతుకుల్లో వెలుగులు నిండుతాయని కోరుకుంటారు. ఈ క్రమంలోనే 2019 సంవత్సరం దేశ తలరాతను మార్చాలని భారతీయులంతా ఆశిస్తున్నారు. ఈ మార్పు కోసమే వారు 2019 కోసం నిరీక్షించారు. ఈ ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తాము కోరుకునే అసలైన మార్పు జరుగుతుందని అందుకు ప్రత్యామ్నాయాన్ని వారు కోరుకుంటున్నారు. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావడంతో జరిగిన మార్పులు, రాజకీయ పరిణామాలను గ్రహించేందుకు ప్రజలకు అట్టే సమయం పట్టలేదంటే అతిశయోక్తి కాదు. నరేంద్రమోడీ నేతృత్వంలో దేశ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయి మతం రంగును పులుముకున్నాయి. కార్పొరేట్లు, విదేశీ పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. తత్ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ప్రజలకు ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి. నిరుద్యోగం పెరిగింది. ఉద్యోగావకాశాలు తగ్గుముఖం పట్టాయి. విద్య, ప్రజారోగ్యం, రవాణా, పీడీఎస్ వంటి ప్రభుత్వసేవలన్నీ ప్రైవేటుపరమై సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంలో ప్రతి భాగం మతతత్వం, మనువాద భరితంగా మారింది. మతపరంగా సమాజాన్ని విభజించేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. సమాజం విచ్ఛిన్నం అంచున ఉంది. మతవాద, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వ ఆగడాలను, వాస్తవ పరిస్థితిని ప్రజలు ఆలస్యమైనాగానీ గ్రహించారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే కొత్త సంవత్సరాన్ని మార్పు వత్సరంగా వ్యవహరిస్తున్నారు. అధికార పక్షం మాత్రం ఈ మార్పు జరగకుండా ఏ స్థాయికైనా దిగజారుతుంది. తమ దుష్టపాలనను కొనసాగించేందుకు ఎంతటికైనా తెగిస్తోంది. తమకు ప్రత్యామ్నాయమే లేనట్లుగా వ్యవహరించిన కాషాయ వర్గాలకు తాజాగా పలు రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితాలు చెంపపెట్టుగా నిలిచాయి. ప్రజానాడిని స్పష్టంచేశాయి. గతంలోనూ ప్రభుత్వాలు మారాయంటే అందుకు ఒక వ్యక్తి కారణం కాదు.. ఆయా ప్రభుత్వాల పనితీరు, అనుసరించిన విధానాలు, దానికున్న ప్రత్యామ్నాయం దోహదపడేవి.

అవినీతిని అంతమొందిస్తామన్న మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలోని డొల్లతనం తేటతెల్లమైంది. ఈ విషయాన్ని మోడీ కూడా అంగీకరిస్తున్నారు. అవినీతి ఆరోపణలు తనపై కాదు ప్రభుత్వంలోని కొందరిపై ఉన్నాయని పలు సందర్భాల్లో ఆయన స్వయంగా పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాఫెల్ ఒప్పందం వెలుగుచూసింది. కార్పొరేట్లను ప్రోత్సహించే, వారికి వత్తాసు పలికే వేరొక యంత్రాంగం లేదని రాఫెల్ ఒప్పందం ద్వారా మోడీ సర్కార్ రుజువు చేసింది. అధికారంలో ఉన్నప్పుడు ఆర్థిక నయా ఉదారవాద విధానాలను అవలంబించడం, అధికారంలో లేనప్పుడు లెఫ్ట్ పార్టీలతో కలిసి వాటిని వ్యతిరేకించడం ఈ బూర్జువ జాతీయ, ప్రాంతీయ పార్టీలకు పరిపాటిగా మారింది. ఈ వ్యవహారాన్ని రెండున్నర దశాబ్దాలుగా చూస్తునే ఉన్నాం. ఈ క్రమంలో కుల,మతాలకు ముప్పును తలపెట్టేందుకు కొందరు హిందూత్వను ఎంచుకుంటున్నారు. ఇది ప్రమాదకరం. ప్రస్తుత మతతత్వ, కులతత్వ, మతవాద, మనువాద, కార్పొరేట్ అనుకూల ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయాన్ని ఎంచుకునే క్రమంలో పై విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. 2019లో ప్రజలు ఆకాంక్షిస్తున్న మార్పు వ్యక్తిపరమైనది కాదు వ్యవస్థ, విధానపరమైనదని స్పష్టమవుతోంది. నాలుగున్నరేళ్లలో మోడీ ప్రభుత్వం సృష్టించిన విధ్వంసాన్ని వచ్చే కొత్త ప్రభుత్వం చక్కెబెడుతుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తిరగరాయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అయితే, ఇది అనుకున్నంత సులువు కాదు. ప్రత్యామ్నాయ విధానాల ఆధారంగా లేని కూటములు పనిచేయవు. కొన్ని లక్ష్యాలను సాధించేందుకో లేక ఎన్నికల దృక్పథంతో పనిచేయవు కాబట్టి వాస్తవ పరిస్థితులను వామపక్షాలు అర్థంచేసుకోగలవు. ప్రజాస్వామ్య, సామాజిక విప్లవానికి మరింత బలం చేకూర్చేందుకు కృషిచేస్తాయి. 2019 నిజంగానే మార్పు సంవత్సరమే. అయితే ప్రజలను చైతన్యపర్చాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో చైతన్యం వస్తే సరిపోదు వారు మతశక్తులను తిప్పికొట్టేలా పోరాడేందుకు సంసిద్ధం కావాలి. ప్రత్యామ్నాయ విధానాల ఆధారిత ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ క్రమంలో వామపక్ష పార్టీల ముందు పెద్దసవాలే ఉంది. అయినా వామపక్షాలు దీనిని సమర్థంగా ఎదుర్కొవాల్సిన అవసరం కూడా ఉంది. ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన సార్వత్రిక సమ్మె ప్రభావం రానున్న సార్వత్రిక ఎన్నికలపై ఉంటుందన్నది ఖాయం. సాంకేతిక భావంలో సార్వత్రిక సమ్మె సంపూర్ణంగా విజయవంతమైందా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా అది ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకొంది. అందుచేతనే, ఫ్యాక్టరీ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, అసంఘటితరంగ కూలీలు, మద్దతు తెలిపే రైతులు సహా 20కోట్లమంది సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నట్లు అంతర్జాతీయ మీడియా ప్రధానాంశాలలో ప్రసారం చేసింది. సార్వత్రిక సమ్మెకు విదేశాల నుండి కూడా సంఘీభావం లభించింది. 130 దేశాలలోని ట్రేడ్ యూనియన్లకు ప్రాతినిధ్యం వహించే వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు) అనుబంధ ట్రేడ్ యూనియన్ల తరఫున సంఘీభావ సందేశం పంపిందంటే సార్వత్రిక సమ్మెకు ఎంత ప్రాముఖ్యత ఉందో స్పష్టమవుతోంది.

చురక

సైన్సు కాంగ్రెసులోన
సాగినట్టి చర్చ తీరు
మూఢత్వపు అజ్ఞానం
ముప్పనిండి పారె ఏరు

మతం, వేదసారంలో
మహాశాస్త్ర విజ్ఞానం
పేరు గొప్ప ఊరు దిబ్బ
పసలేని పరిజ్ఞానం

- వేల్పుల నారాయణ

రష్యాలో సోషలిజానికి పెరుగుతున్న ఆదరణ

గావిన్ మెండల్-గ్లీసన్

సోషలిజంపై రష్యాప్రజలకు ఆదరణ పెరుగుతోంది. సోవియట్ యూనియన్ పతనానికి వారు విచారిస్తున్నట్టు ఆ దేశానికి చెందిన ఎన్జీవో 'లెవడా సెంటర్' నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 14ఏళ్లలో ఎన్నడూ లేనంత సానుకూలత ఈఏడాది వ్యక్తమవు తోందని సర్వే చెబుతోంది. ఆర్థిక, సామాజికపరమైన కారణాలే ఈ పశ్చత్తాపానికి కారణంగా తెలుస్తోంది. యూఎస్ఎస్ఆర్ / సోవియట్ యూనియన్ సోషలిస్టు విధానాలను రష్యన్లు గుర్తుచేసుకుంటున్నారు. ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు అనుగుణంగా సోషలిజానికి ప్రజాదరణ తగ్గుతూ, పెరుగుతూ వచ్చింది. 1992లో పోలింగ్ ప్రారంభ మైనప్పుడు మాత్రం ఇది 50శాతానిపైగా పడిపోయింది.

1917లో జరిగిన రష్యా విప్లవం, 1981-21లో జరిగిన రష్యన్ ప్రజాయుద్ధాల తర్వాత రష్యన్ సామ్రా జ్యంలో నుంచి సోవియట్ యూనియన్ ఉద్భవించింది. అనేక సోవియట్ రిపబ్లిక్‌ల సమాహారంతో ఏర్పడిన సోవియట్ యూనియన్ 1991, ఆగస్టు 19న కుప్ప కూలింది. సోవి యట్ యూనియన్ రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సోషలిస్టు రాజ్యం. ఇది యూరేషియాలో 1922 నుంచి 1991 వరకు విలసిల్లింది. సోవియట్ యూనియన్ పతనం అనంతరం రిపబ్లిక్ రాష్ట్రాలన్నీ విడిపోయి స్వతంత్ర సమాఖ్యగా ఏర్ప డ్డాయి. సోవియట్ యూనియన్ ఏర్పడిన తర్వాత వ్యవ సాయ సమిష్టీకరణ, పారిశ్రామీకరణ జరిగింది. ప్రైవేటు మార్కెట్ పూర్తిగా రద్దు అయింది. ప్రజలకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ లభించింది. అయితే 1991 చివరికల్లా సోవియట్ యూని యన్‌లోని రిపబ్లిక్‌లలో చాలా వరకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించు కున్నాయి. ఈ పరిణామాల తర్వాత సోవియట్ యూనియన్ పతనమైంది.

సోవియట్ యూనియన్‌లో స్వేచ్ఛ ఉండేది కాని నేడు ప్రయాణించడం, సెలవుదినాలను సరదాగా జరుపు కోవడం కూడా కష్టసాధ్యంగా మారిందని పాశ్చాత్య దేశస్తులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సోవియట్ యూనియన్ కుప్పకూలడమే కారణంగా చెబుతున్నారు. ప్రయాణ ఆంక్షల సడలింపు తర్వాత కూడా సెలవుల్లో సోచీ, బటుమీ, క్రిమియా వంటి ప్రాంతాల్లో గడపడం సోవియట్ పౌరులకు కష్టంగా మారింది. ఎలాంటి ఆంక్షలు లేని స్వేచ్ఛాయుత ప్రయాణాన్ని వారు కోరుకుంటున్నారు.

అనుకోకుండా నేను యూఎస్ఎస్ఆర్ విచ్ఛిన్నానికి సాక్షిగా నిలిచాను. ప్రభుత్వ సేవలు లభించక ప్రజలు తమ కుటుంబ భారాన్ని మోయలేక సొంత పనిప్రదేశాలనే లూటీ చేయడాన్ని చూశాను. నేనుండే తుర్కుమెనిస్థాన్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. అక్కడ పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. పై అంతస్తుల్లో ఉండే ప్రజలు తమ ఇంటి కిటికీల నుంచి చెత్తను కింద పడేసేవారు. తత్ఫలి తంగా కింది అంతస్తు లన్నీ ఖాళీ అయ్యేవి. చెత్తతో కప్పబడి ఉండటంతో అక్కడ జీవించలేని పరిస్థితి నెలకొంది. చెత్తకూపాలుగా మారిన పరిసరాలతో భీకరంగా మారిన ఆ ఇళ్లలో నిరాశ్ర యులంతా ఆశ్రయం పొందడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రజలు తమ పని భద్రతను, ఉద్యోగాలను కోల్పో యారు. తిండి తిప్పలు లేక ఆకలితో అలమటించి పోయారు. చాలా మంది నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ క్రమంలో మద్యానికి బానిసలయ్యారు. సామాజిక గందరగోళం నెలకొంది. లక్షల్లో మరణాలు సంభవించాయి. యూఎస్ఎస్ఆర్ పూర్తిగా పతనమైంది. సోషలిజం నాశనమైపోయింది.

> 14ఏళ్ల గరిష్ఠానికి చేరుకున్న సానుకూలత

నేను సోవియట్ పూర్వ రాష్ట్రమైన ఉజ్బెకిస్థాన్ నుంచి అమెరికాకు తిరిగి వచ్చాక అక్కడ పరిస్థితులు నిర్ఘాంత పర్చాయి. ముందుకు సాగే మార్గం లభించడంతో ఆశ్చర్య పోవడం నా వంతైంది. పాశ్చాత్య దేశాలకు చెందిన సామ్రాజ్యా ధినేతలు అనుభవించే విలాసాల కోసం యూఎస్ఎస్ఆర్ నాయకత్వంలోని ఓ ముఖ్య భాగం పరితపి స్తోందని అప్పటి గాని నాకు నమ్మకం కలగలేదు. నిర్విరామంగా దాడుల హెచ్చరికలు, ప్రాజెక్టులో ఎవ్వరూ వ్యక్తిగత పెట్టుబడులు పెట్టక పోవడంతో వారు తమను తాము బలిపశు వులుగా భావించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే సొంత ప్రజల సంక్షే మాన్ని పక్కనబెట్టి, స్వరాష్ట్ర వినాశనంలో భాగస్వాములయ్యారు.

పాశ్చాత్య ప్రజాస్వామ్యాల్లో లోటుపాట్లు ఉన్నప్పటికీ అవి ప్రాథమికంగా చట్టబద్ధతను కలిగి ఉన్నాయి. విదేశీ యుద్ధాల్లో లక్షలాది మంది మరణించారు. సీఐఏ జోక్యం, అమెరికా అండగల నియంతృత్వం, డబ్లుడబ్లుఐఐ నాటి నుంచి డెత్ స్క్వాడ్స్ వంటివి విధానాల్లో తప్పులకు బాధ్యతులు తప్ప మరేమీ కాదు. అమెరికాలో పేదరికం, ఆరోగ్య సంరక్షణ లేమి, కార్మికతరగతుల ఆయువు తగ్గిపోవడం వంటివన్నీ కల్ల.

సోషలిజం ఉన్నప్పుడు సైన్స్, టెక్నాలజీ, ఇంజి నీరింగ్, మ్యాథమేటిక్స్ రంగంలో మహిళల ప్రాతినిధ్యం ఎక్కువని, వారు సంతృప్తికరమైన జీవితాలను గడిపారని ఎవరికి తెలుసు? ఉపాధి, హౌసింగ్, ప్రపంచ ప్రజారోగ్యం, విద్య వంటి రంగాల్లో విజయాలను నిశితంగా పరిశీలిద్దాం. దశా బ్దాలుగా ఎలాంటి అసమా నత్వం, వివక్ష లేకుండా సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొ నకుండా సుస్థిరవృద్ధితో కూడిన ఆర్థికవ్యవస్థ ఉండేదని గుర్తుచేసుకుందాం.

లాభాపేక్ష లేకుండా సేవాదృక్పథంతో సమానత్వం సిద్ధాంతా లతో కూడిన మెరుగైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకునే అవకాశం లభిస్తే గనుక గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వినయంగా పనిచేద్దాం. మన పూర్వీకులు సాధించినవి సామాన్యమైన విజయాలు కావు. మనం కూడా మన విజయాలను పరిరక్షించు కుందాం. తద్వారా ఎలాంటి ఉపద్రవం మన దరి చేరకుండా చూసుకొనే వీలు కలుగుతుంది.

ఈ మూఢ సంస్కృతికి మూలం ఏమిటి?

ఆలపాటి సురేశ్ కుమార్

భారతదేశంలో సైన్స్ కాంగ్రెస్ వార్తలకు మీడియా మొదటినుంచీ చాలా ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పొందుపరిచిన సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌కు కనీసం ఆ సీజన్‌లో గౌరవం దక్కుతూ వచ్చింది. కొద్ది సంవత్సరాలుగా, ఇంకా చెప్పాలంటే బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఏలుబడి మొదలయిన తర్వాత సైన్స్ కాంగ్రెస్ వార్తలకు ఇంకా ప్రాధాన్యత పెరిగింది. అయితే ఆ ప్రాధాన్యతకు కారణమైన అంశాలు సంతోషించదగ్గవి మాత్రం కావు.

'వేదాల్లోనే అన్నీ ఉన్నాయష' అని కన్యాశుల్కం నాటకంలో గురజాడ అప్పారావు గారు అగ్నిహోత్రా వధాన్లుతో చెప్పిస్తారు. వేదాలు విజ్ఞానసర్వస్వం అనే భావనపై ఆ మహానుభావుడు ఆ రోజుల్లోనే వదిలిన వ్యంగాస్త్రం అది. గురజాడ గతించి, ఆయన మనకు ఇచ్చిపోయిన గొప్ప కావ్యం కన్యాశుల్కానికి వందేళ్లు నిండిపోయిన తర్వాత కూడా మనం ఇంకా వేదాల గొప్పతనం గురించి మాట్లాడుకుంటున్నాం. ఇదిగో ఈ కారణాల వల్లే ఈ మధ్య కాలంలో సైన్స్ కాంగ్రెస్ వార్తల్లో ఎక్కువ నిలుస్తున్నది.

అధునాతన విజ్ఞానం అంతా హిందూమతానికి చెందిన ఇతిహాసాల్లో, పురాణాల్లో, వేదాలలో గంపల కొద్దీ దాగి ఉందని హిందూ ఆధిక్యతావాదులు చెబుతున్నారు. సూడో సైంటిస్టులు, దారిన పోయే దానయ్యలు ఏం మాట్లాడినా ఫరవాలేదు. బాధ్యతాయు తమైన మంత్రి పదవుల్లో ఉన్నవారు, అంతకన్నా ముఖ్యంగా విద్యా వైజ్ఞానిక రంగాల్లో పనిచేస్తున్న వారు అలాంటి మాటలు అంటే దాని ప్రభావం ఎంతోకొంత సమాజంపై పడకుండా ఉంటుందా!

ఈ ధోరణికి నాంది పలికింది ప్రధానమంత్రి నరేంద్ర మోది: 'మహాభారతంలోని కర్ణుడు తల్లి గర్భం నుంచి జనించలేదన్న సంగతి ఆనాడే కృత్రిమ గర్భధారణ టెక్నాలజీ అందుబాటులో ఉందన్నదానికి తార్కాణం. వినాయకుడికి ఏనుగు శిరస్సు ఉండడం ఆనాడే విశిష్టమైన ప్లాస్టిక్ సర్జరీ విజ్ఞానం ఉండేదన్న మాటకు నిదర్శనం'. ఆశ్చర్యపోవద్దు, ఇవన్నీ మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 సైన్స్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ సెలవిచ్చిన సంగతులే. ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా, 'పురాణకాలం నాటి రుషులు దివ్యదృష్టితో వీక్షించేవారు. ఈనాటి టెలివిజన్ టెక్నాల జీకి అదే మూలం' అని విద్యార్థులకు బోధించారు.

గత మార్చిలో 105వ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారం భిస్తూ, కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్ సభలో ఉన్న సైంటిస్టులు అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. ద్రవ్యరాశి-శక్తి మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సమీకరణ కన్నా గొప్ప సిద్ధాంతం వేదాలలో ఉన్నదని మరో ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ పేర్కొన్నాడని మంత్రి ప్రకటించారు. ఆ మంత్రి స్వయనా వైద్యశాస్త్రం చదివిన వాడు.

గత సంవత్సరం ఇకొక సందర్భంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ మాట్లాడుతూ, మానవుడు జీవ పరిణామక్రమంలో ఉద్భవించాడని చెబుతున్న కారణంగా డార్విన్ సిద్ధాంతం శుద్ధ తప్పు అని పేర్కొన్నారు. ఇవి తెలిసీ తెలియక మాట్లాడుతున్న మాటలు అనుకోవడం పొరపాటు. ఇది ఒక సంస్కృతిగా తయారయింది. హిందూ ఆధిక్యతా భావనను వ్యాప్తి చేసేందుకు దేశాన్ని పాలిస్తున్న వారే ఇలాంటి భావజాలాన్ని పని కట్టుకుని ప్రచారం చేస్తున్నపుడు దీనిని సంస్కృతి అనక మరే అనగలం!

ఇలాంటి సంస్కృతిలో విశ్వవిద్యాలయాల కులప తులు కూడా భ్రష్ట భావజాలాన్ని వ్యాపింపజేస్తే ఆశ్చర్య పోవాల్సిందేముంది. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. నాగేశ్వరరావు మొన్నటి సైన్స్ కాంగ్రెస్‌లో మాటలాడిన మాటలను ఈ కోణంలో చూడాలి. పురాతన కాలంలోనే ఇండియాలో స్టెమ్ సెల్స్ టెక్నాలజీ, టెస్ట్ ట్యూబ్ బేబీ టెక్నాలజీ ఉందనేదానికి కౌరవుల పుట్టుకే నిదర్శనమని ఆయన అన్నారు.

దేశం అంతటా విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవడం మొదలు పెట్టిన తర్వాత వాటిని పాలించే విద్యావేత్తలు ప్రలోభాలకో, వత్తిడికో లొంగకుండా ఉంటారని ఆశించడం అత్యాశే అవుతుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో, ఢిల్లీ జెఎన్‌యులో ఏం జరిగిందో మనం చూశాం. దేశం అంతటా కనబడని వత్తిడితో కూడిన వాతావరణం అలముకుపోయుంది. హిందూ ఆధిక్యతా భావనకు వ్యతిరేకంగా ఎవరైనా నోరు మెదిపితే సోషల్ మీడియాలో ట్రోలింగ్ భయంకరంగా ఉంటోంది.

ఇలాంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి? ప్రభుత్వాలు మారితే పరిస్థితి మారుతుందని అనుకుంటే పొరపాటే. ప్రభుత్వాలు మారినా గానీ దేశంలో హిందూ ఆధిక్యతా భావనను వ్యాపింపజేసే ప్రయత్నాలు ఆగవు. మళ్లీ అధికారంలోకి రావాలంటే ఆ మత రాజకీయాలే దిక్కు కదా! మహా అయితే వేరే ప్రభుత్వం ఉన్న కారణంగా ఆ ప్రయత్నాలకు సర్కారు దన్ను లేకుండా పోతుందమో, అంతే. అశాస్త్రీయమైన, హేతువిరుద్ధమైన ప్రాచీన వైభోగాన్ని స్తుతించడం మాత్రం ఆగదు.

ఈ పోకడలు సమాజం అభివృద్ధికి హానికరమైనవి. వీటిని ఎదుర్కోవడం అత్యావశ్యకం. దానికి రెండు దారులు లేవు. ఉన్న ఒకటే దారి ప్రతిఘటించడం. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదుర యినా వెనుకాడకుండా నిజం మాట్లాడడం. హేతు వాదులు, ప్రజాస్వామిక వాదులు అందరి పవిత్ర కర్తవ్యం ఇది. రాజకీయ అధికారం కోసం సాగే వికృతక్రీడలో భారతసమాజం మొద్దుబారిపోవడాన్ని అనుమతించకూడదు.

వి-మెయిల్

"శిధిలావస్థకు చేరువలో కాకతీయుల కట్టడాలు", దేవాలయాలు

అద్భుత శిల్పకళా సంపద ధ్వంసమవుతోంది. అలనాటి కాకతీయుల కట్టడాలు ప్రాభవం కోల్పోతున్నాయి. నిత్యం పూజలు, అభిషేకాలు, భక్తుల సందర్శనలతో కళకళలాడే దేవాలయాలు కళ తప్పుతున్నాయి. మన చరిత్ర కాలగర్భంలో కలిసిపోతుందా! అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పురాతన ఆలయాలు, కట్టడాలు క్రింద గుప్తనిధులు ఉన్నాయన్న దురాశతో కొంత మంది ముఠాలుగా ఏర్పడి తవ్వకాలు చేపడుతున్నారు. కాకతీయుల కాలంలో ప్రాధాన్యతను సంతరించుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వెంకటాపురం మండలంలోని రామప్ప ఆలయం, చుట్టూ ఉన్న చిన్న ఆలయాలు శిధిలావస్థకు చేరుకున్నాయి. నిత్యం వందలాది మంది భక్తులు, పర్యాటకులు రామప్పగుడిని దర్శించుకుని రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఆలయం ముందు గల నంది విగ్రహం నల్లరాయితో కట్టబడి ఆకర్షణీయంగా ఉన్న ముందు తలభాగా దెబ్బతింది. రామప్ప ఆలయం చుట్టూ గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. నిత్యం విదేశీ పర్యాటకులు, అత్యున్నత హోదాలో ఉన్న అధికారులు రామప్పని నిత్యం సందర్శిస్తుంటారు. రామప్ప చెరువులో బోట్‌షికారు చేస్తూ అందాలను ఆస్వాదిస్తుంటారు. అలాగే ఇదే జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగూళ్లపరిస్థితి అంతే. పురాతన చరిత్రగల కోటగూళ్ల చూపరులను కట్టిపడేస్తాయి. కోట్టగూళ్లలో కొలువైన గణపేశ్వర స్వామి ఆలయంపై భాగం శిధిలంకాబడి. వారంరోజులు క్రితం కురిసిన భారీ వర్షాలకు దేవుని గుడి తడిసి ముద్దయింది. కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలో గల ఆలయాలు పురావస్తుశాఖ నిర్లక్ష్యం మూలాన అభివృద్ధికి నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కాకతీయుల కాలంనాటి ఆలయాలకు మరమ్మత్తులను చేయడానికి నిధులు విడుదల చేయడం లేదు. చరిత్రకారులు సైతం ఆలయాలు శిధిలావస్థకు చేరుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాకతీయుల కాలంలో కట్టబడిన ఆలయాలు, పర్యాటక ప్రదేశాలకు పూర్వవైభం తీసుకురావాల్సిన ఆవశ్యకత, ప్రభుత్వంపైన ఎంతో ఉంది.

- కామిడి సతీష్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లిజిల్లా

మరొక రోజు పుణెలో, భీమా కోరేగాం కేసు నిందితులతో...

వీక్షణం వేణుగోపాల్

మిత్రులారా, దేశవ్యాప్తంగా ప్రజాపక్ష మేధావులను, హక్కుల కార్యకర్తలను దుర్మార్గంగా ఇరికించి తయారుచేసిన అబద్ధపు కేసు (భీమా కోరేగాం కేసు) ఎలా నడుస్తున్నదో, ఆ కేసులో నిందితులుగా ప్రస్తుతం పుణెలోని ఎరవాడ జైలులో మన మిత్రులు ఎలా ఉన్నారో తెలుసుకోవాలని మీరు ఆందోళనగా, ఆసక్తితో ఉన్నారని తెలుసు గనుక నేను వెళ్లివచ్చిన ప్రతిసారీ ఒక నివేదిక రాస్తున్నాను. గతంలో 2018 నవంబర్ 27న, డిసెంబర్ 18న ఇక్కడే రాశాను.

డిసెంబర్ 18 వాయిదా తర్వాత డిసెంబర్ 20కి మరొక వాయిదా పడింది గాని నేను ఆరోజు వెళ్లలేకపోయాను. డిసెంబర్ 20 నుంచి జనవరి 4, శుక్రవారానికి మళ్లీ వాయిదా పడింది. ఈసారి వాయిదాకు హైదరాబాద్ నుంచి అక్కయ్య, నేను వెళ్లాం. సాధారణంగా మధ్యాహ్నం పన్నెండుకల్లా మిత్రులందరినీ జైలు నుంచి కోర్టుకు తీసుకొస్తారు. అందుకని మేం పదకొండున్నరకల్లా కోర్టుకు చేరాం. కేసు మధ్యాహ్నానికే పిలుస్తారని, కనుక మిత్రులందరినీ మధ్యాహ్నం తర్వాతనే తీసుకు వస్తారేమోనని లాయర్లు కూడ అన్నారు. చేసేదేమీ లేక మేం అలా కోర్టులోనే మూడో అంతస్తు వరండాలో ఎదురుచూస్తూ కూర్చున్నాం.

హఠాత్తుగా పన్నెండున్నరకు లిఫ్ట్ లోనుంచి చుట్టూ పోలీసులమధ్య వర్నన్, అరుణ్, వివి బైటికి వచ్చారు. మరొక లిఫ్ట్ లో నుంచి సురేంద్ర, సుధీర్, రోనా, మహేశ్ వచ్చారు. ఈసారి సుధనూ షోమానూ కూడా తీసుకురాలేదు. ఇంకో రెండు గంటలయినా ఎదురుచూడవలసి ఉంటుందని అనుకున్నప్పుడు హఠాత్తుగా వాళ్లు కనబడిన ఆనందం. ఒక్క ఉదుటున పరుగెత్తుకెళ్లి ఆ ఏడుగురినీ ఒక్కొక్కరినీ కౌగలించుకున్నాను. అలా కౌగిలించుకుంటున్నప్పుడు అది నా ఒక్కడి కౌగిలి మాత్రమే కాదు, ఇది చదువుతున్న, వాళ్ల గురించి ఆందోళన పడుతున్న విప్లవాభిమానులందరి, పౌరసమాజంలోని ఆలోచనాపరులందరి తరపున నా కౌగిలి. వారి ఉత్సాహం, స్ఫూర్తి, క్షేమంగా ఉన్నామనే భరోసా బదిలీ అయినది నా ఒక్కడికి మాత్రమే కాదు, అది మీ అందరికీ కూడా.

ఆ వరండాలోనే బెంచీల మీద వారందరినీ కూచోబెట్టి పోలీసులు అడ్డుగా నిలబడి ఉన్నా మేం చుట్టూ నిలబడి, దగ్గరికి వెళ్తూ వస్తూ పది నిమిషాలో పావు గంటో మాట్లాడుకోగలిగాం. అక్కయ్యయితే ఆ కాసేపు మామయ్య పక్కనే బెంచీ మీద కూచోగలిగింది. అక్కడ అలా ఒక సభ జరుగుతున్నదని గుర్తించినందువల్లనో ఏమో ఒక మఫ్టీ దుస్తుల పోలీసు అధికారి వచ్చి వాళ్లను జడ్జి పిలవకుండానే ఎందుకు తీసుకొచ్చారని కోప్పడ్డాడు. అక్కడి నుంచి తీసుకుపొమ్మని ఆదేశించాడు. ఇక అందరినీ వెనక్కి కోర్టు ఆవరణలోని పోలీసు కేంద్రంలోకి తీసుకువెళ్లారు. వాళ్ల పక్కన నడుస్తూ మరొక ఆరేడు నిమిషాలు మాట్లాడగలిగాం. అక్కడ పోలీసు కాంపౌండ్ లో మాట్లాడదానికి అనుమతిస్తారేమోనని అక్కడే తచ్చాడాం. కాని అక్కడ దాదాపు రెండు గంటలు నిలబడ్డా మమ్మల్ని లోపలికి అనుమతించలేదు.

ఈలోగా వాళ్లను కలిసి వచ్చిన ఒక న్యాయవాది వాళ్లు ఆకలిగా ఉన్నారని, తినడానికి ఏమన్నా తెచ్చిపెట్టమని అడుగుతున్నారని అన్నాడు. కోర్టు ఆవరణలో ఉన్న కాంటీన్ వేపు పరుగులు. వండిన పదార్థాలు వద్దు అంటారు గదా, బిస్కట్ల వంటి ప్యాక్డ్ ఫుడ్సే కావాలని ఒక మాట. ఆకలి మీద ఉన్నారు, పావ్ బాజీ వంటివి తెమ్మన్నారు అని మరొక వాదన. చాయలు తప్పనిసరిగా తెమ్మన్నారట. అవన్నీ తీసుకుని పోలీసు ఆవరణ గేటు దగ్గరికి వెళ్లేసరికి అందరినీ అప్పుడే బైటికి తీసుకొస్తున్నారు. జడ్జి పిలిచాడట, అంతకన్నా ముఖ్యం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వచ్చి నిలబడి ఉందట, అందువల్ల తినడానికి కూడ సమయం ఇవ్వకుండా కోర్టులోకి తీసుకురమ్మన్నారని ఆదేశం. మళ్లీ వాళ్ల పక్కనే మరొక ఆరేడు నిమిషాల మాటల నడక.

కోర్టు హాల్లోకి ఆ ఏడుగురినీ తీసుకువెళ్లి నిందితుల బోనులో నిలబెట్టారు. కోర్టులో ఉండగలిగినంతమంది కంటె రెట్టింపు మంది ఉన్నారు. గోల గోల. ఆ గోలలో లాయర్లు ఏం



వరవరరావు

మాట్లాడుతున్నారో, జడ్జి ఏమంటున్నాడో ఏమీ వినబడలేదు. చివరికి తెలిసిందేమిటంటే, మామూలుగా బెయిల్ పిటిషన్ల మీద వాదనలు జరుగుతున్నాయని అన్నారు. ఆ గోల మధ్యలో, ఈ లోగా నిందితులు జైలు వసతుల మీద, అంక్షల మీద వేరు వేరు పిటిషన్ల మీద వాదనలు విన్నారట.

ఇది ఒకపక్క సాగుతుండగానే మన లాయర్లు, కొందరు మిత్రులు నిందితుల బోను దగ్గరికి చేరి మనవాళ్లతో మాట్లాడుతున్నారు. ఆ గోల మధ్య నుంచే బెయిలుపై వాదనలు విన్న జడ్జి, లాయర్లు కూడా నిందితులతో మాట్లాడుకోనివ్వాలని ఆజ్ఞ జారీ చేశారు. చూసి రమ్మంటే కాల్చి వచ్చే రకం పోలీసులు నిరస తెలుపుతున్నట్టు లాయర్లను కూడా అక్కడి నుంచి దూరం జరిపారు. మిస్సిలేనియస్ పిటిషన్ల మీద రేపో ఎల్లుండో ఉత్తర్వులు ఇస్తానని, బెయిల్ వాదనలు మాత్రం జనవరి 22న వింటానని జడ్జి వాయిదా కూడా వేసేశారు.

తమ ఎలక్ట్రానిక్ డివైసెస్ లో దొరికింది అని ప్రాసిక్యూషన్ అంటున్న సమాచారాన్ని ఎక్కువ సాధికారికమైన హాష్ వాల్యూల రూపంలో ఇవ్వాలని, కాని తక్కువ సాధికారికమైన, మార్పులూ చేర్పులూ చేయడానికి అవకాశం ఉన్న క్లోన్ రూపంలో ఇచ్చారని సురేంద్ర జడ్జి దృష్టికి తీసుకొచ్చాడు. వాటిని ఫోరెన్సిక్ నిపుణుడు సర్టిపై చేశాడని జడ్జి జవాబిచ్చాడు. ప్రాసిక్యూషన్ సాక్షిగా ఉండే ఫోరెన్సిక్ నిపుణుడి జవాబుదారీతనం ఏమిటని సురేంద్ర ప్రశ్నించాడు. ఇక జడ్జి ఆ వాదనను కొనసాగించలేదు. ఈ రెండు మూడు మాటలు కూడా వాదనల రూపంలో జరిగినవి కావు. నిందితుల బోను లోపలే ఉన్న సురేంద్రకూ జడ్జికీ జరిగిన సంవాదం. అది అయిపోగానే వారిని తీసుకుపోవడానికి పోలీసులు పిలవడం మొదలుపెట్టారు.

ఆ తర్వాత 'మా కుటుంబాలు వచ్చాయి, మాట్లాడు కోవడానికి అనుమతించాల'ని వివి, అరుణ్ కోరగా జడ్జి మొదట అనంగీకారంగా ఒకటి రెండు గొణుగులు గొణిగి, ఐదు నిమి షాలు అన్నాడు. ఇక్కడి నుంచి వ్యాన్ దగ్గరికి వెళ్లేవరకూ నడుస్తూ మాట్లాడుకోవచ్చుగదా, మీకింకా ఒకటి రెండు నిమిషాలు ఎక్కువే దొరుకుతాయి అని పోలీసులు బయల్దేరదీశారు. అలా మళ్లీ ఆరేడు నిమిషాల మాటల నడక.

పోలీసు కాంపౌండు దగ్గర మమ్మల్ని ఆపేసి వాళ్లను లోపలికి తీసుకుపోతున్నప్పుడు వివిని గట్టిగా కౌగలించుకుని వీడ్కోలు చెపుతుంటే నాకు దుఃఖం ఆగలేదు. ఆయనకూ, మా కుటుంబానికీ అరెస్టులూ, జైలు జీవితమూ, నిర్బంధమూ కొత్తకాదు. అవన్నీ ఉద్యమంలో భాగంగా ఉత్సాహంగా, ఆందోళన లేకుండా స్వీకరించినవే. కాని ఆ వయసంతా అయి పోయింది. ఈ 78 ఏళ్ల వయసులో, ఎరవాడ జైలులో ఒంటరి సెల్ లో నేల మీద గొంగడి మీద ఆ పాడు చలిలో ముడుచుకు పడుకున్న ఆయనను తలచుకుంటేనే నాకు దుఃఖం ఆగ లేదు. పుణెలో చలి ఎక్కువ. హైదరాబాదు కన్న ఆరేడు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత ఉంటుంది. అంతకంటే ఘోరం మధ్యాహ్నం 32-33 డిగ్రీల దాకా పెరిగి కరకరమనే ఎండ కొట్టి, రాత్రికి మాత్రం 10-11 డిగ్రీల వణికించే చలికి చేరి శరీరాన్ని ఇటుకొనసనుంచి అటుకొనకు ఊగిస్తుంది. వివికి అందుకే పెదాలు పూర్తిగా పగిలిపోయి, నల్లబడ్డాయి. ఏదైనా లిప్ బామ్ తెచ్చివ్వమా, రాసుకుంటారా అంటే, "నాకు అలవాటు లేదు గదా, అయినా ఇస్తారో ఇవ్వరో" అన్నారు. గడ్డం బాగా మాసిపోయి ఉంది. గతంలో రెండు సార్లూ సోమవారాలు కలిశాను గనుక గడ్డం పెరిగి లేదు. జైలులో ఆదివారం నాడు మాత్రమే గడ్డం చేసేవాళ్లు వస్తారు. మిగిలిన వారంరోజులూ అలాగే ఉండాలి. ఈసారి కలిసినది శుక్రవారం గనుక ఐదురోజుల గడ్డం పెరిగి ఉంది. జుడిషియల్ కస్టడీలో ఉన్న ఖైదీలు ఆరోగ్యంగా, ప్రాణాలతో ఉండేలా చూసుకునే బాధ్యత రాజ్యానిదే గనుక, వారి దగ్గర ఆత్మహత్యకు ఉపకరించే సాధనాలేవీ ఉండగూడదని బ్రిటిష్ వాళ్లు తయారు చేసిన జైలు నిబంధనలు అలాగే ఉన్నాయి. కనుక ఖైదీలు తమ దగ్గర రేజర్ ఉంచుకోవడానికి వీలులేదు.

అలా ఎండి, పగిలి, నల్లబడిన పెదాలతో, మాసిన గడ్డంతో ఆయనను చూసి కన్నీళ్లతో నా చెంపలు తడిశాయి గాని ఆయన కళ్లలో మెరుపు తగ్గలేదు, చిరునవ్వులో ఉత్సాహం, ఉద్వేగం తగ్గలేదు. మళ్లీ ఈసారి కూడా మిత్రులందరినీ పేరుపేరునా అడిగారు. ఎన్నెన్నో సామాజిక, రాజకీయ సమస్యలను ప్రస్తావించారు. నిర్బంధం గురించి మాట్లాడారు. నోముల సత్యనారాయణ సారు చనిపోయిన వార్త పత్రికల్లో చదివి వెంటనే ఒక వ్యాసం రాసి నాకు ఉత్తరంగా పంపారట. నాకది ఇంకా అందలేదు. సెన్సార్ నిబంధనల వల్ల ఉత్తరాలు చాల ఆలస్యం కావడం సహజమే.

"బాగున్నాను. ముందు సాయిబాబాను గుర్తు చేసుకుని ఆయన కష్టం ముందు ఇదెంత అనుకున్నాను. ఇప్పుడు నన్నూ వర్నన్ నూ ఉంచిన బ్లాక్ ఫాసీ ఘాట్ దగ్గర. దాదాపు పదహారు మంది మరణశిక్ష పడిన ఖైదీలుంటారు. అందులో కొందరు ముస్లింలు. వాళ్ల గాథలూ కష్టాలూ వింటుంటే ఈ అన్యాయవ్యవస్థ మీద రగులుతున్న కోపంలో, వాళ్ల ఇబ్బందుల సహానుభూతిలో నా అసౌకర్యమేమీ కనబడడం లేదు" అన్నారు.

విశాలాంధ్ర

బతుకు

The Life

శుక్రవారం
11 జనవరి 2019

హిమ లతలు!



ఇది...దీనిని గాజుతో తీర్చిదిద్దిన చిత్రం అనుకుంటున్నారా? కానేకాదు... మంచు సృష్టించిన విచిత్రం ఇది. ఇక్కడ తెల్లగా కనిపిస్తున్నదంతా మంచే మరి. మొక్క చుట్టూ అందంగా అల్లుకు పోయిన ఈ హిమ లత భలే చిత్రంగా ఉందిగా. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో శీతవేళ పొద్దుపొద్దునే ఆవిష్కృతమైన దృశ్యం ఇది.

REAL STORY

జీవితం అనూహ్యం...

ఏం జరిగినా ముందుకు సాగిపోవాల్సిందే!

కుటుంబం....మన బంధం, బలం, బలహీనత కూడా అదే. ఇంటి మనుషులు ఎవరికైనా చిన్న కష్టం వస్తేనే తల్లడిల్లిపోతారు. మరి ప్రాణాంతక వ్యాధులు వస్తే. ఆ భాద వర్ణనాతీతం. ఆ వేదన ఊహకదనింది. ఆ రోదన కనిపించనిది. అలాంటి కష్టాలు వెంటవెంటనే వస్తే తట్టుకోవడం ఎవరికైనా కష్టమే. అలాంటి ఓ కుటుంబ గాథే ఇది. ఓ వాస్తవిక జీవిత కథ ఇది. తన తండ్రి, సోదరి స్థితిని చూసి తట్టుకోలేని ఓ అమ్మాయి పడుతున్న వేదన ఇది. ఆమె కథ...ఆమె కుటుంబ గాథ...ఆమె మాటల్లోనే.





ముగ్గురు అక్కాచెల్లెళ్ళం. అమ్మానాన్న. ఉన్నంతలో ఆనందంగానే, హాయిగానే జీవితం గడిచిపోతుండేది. ఆనందాల నెలవైన పొదరిల్లులాంటి మా ఇంట్లోకి ఊహించిన విధంగా వచ్చిపడిన కష్టాలు ఇప్పుడు మా మానసిక బలాన్ని పరీక్షిస్తున్నాయి. మా సోదరికి వచ్చిన జబ్బు మా ఇంటిల్లిపాదినీ కుంగదీసింది. అయినా తట్టుకుని నిలబడే ప్రయత్నం చేస్తూనే ఉన్నాం.

నా సోదరికి భయంకరమైన వ్యాధి సోకింది. ఆ విషయం మా అందరినీ తీవ్ర మనోవేదనలోకి నెట్టేసింది. దురదృష్టమేమంటే దీనికి తోడు మరో కష్టం వెంటాడింది. అదే నాన్న మరోసారి పక్షవాతానికి గురి కావడం. పరిస్థితులు మరింత విషమించాయి. మా ఇల్లు విషాదానికి మారుపేరుగా మారింది. మా అక్క జబ్బు నయం చేయించేందుకు తగినంత డబ్బు లేని కారణంగా నాలుగు నెలల క్రితమే ఆమెని కోల్పోయాం. డబ్బు లేని కారణంగానే నాన్నకు చికిత్స కూడా ఆగిపోయింది.

నాకు బాగా గుర్తు. ఆ రోజున సాయంత్రం వేళ స్కూల్ నుంచి వస్తూనే మా అమ్మ కోసం చాలా ఆతృతగా చూశాను. కారణం ఆ రోజు నా సోదరి వైభవి పుట్టినరోజు. ఆరోజున అమ్మ దానికిష్టమైన వంటలన్నీ చేస్తుంది. కానీ ఆ రోజులు ఇప్పుడు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి, అత్యంత ప్రత్యేకమైన గుర్తులుగా ఉండిపోయాయి. కాలం వెనక్కి తిరిగి అలాంటి అందమైన సంఘటనల దగ్గరే ఆగిపోతే ఎంత బాగుంటుందో కదా!. జీవితం అనూహ్యం. ఎప్పుడూ ఊహించనిది జరిగేదే జీవితం. కానీ అది చెప్పే పాఠం ఒకటి ఉంది. మనకున్న దారి ఒక్కటే...ఏం జరిగినా ముందుకు సాగిపోవడమే...ఇదే జీవితం నేర్పే పాఠం.

డబ్బుతో ఆనందాన్ని కొనలేమని చెబుతారు...కానీ తగినంత డబ్బు ఉంటే మనం ఎప్పటికీ సంతోషంగా ఉండగలం. ఇది నా అనుభవం. నాన్న మొదటిసారి 15 ఏళ్ళ క్రితం పక్షవాతానికి గురయ్యారు. ఆయనకు దాదాపుగా ఏడాది పాటు విశ్రాంతి అవసరమైంది. అసలు మంచం మీద నుంచి కదలలేని పరిస్థితి. ఎలాంటి ఆదాయం లేకుండా ముగ్గురు చిన్నపిల్లలను సాకడానికి మా అమ్మ చాలా యాతన పడింది. ఎలాగోలా సంవత్సరం గడిచింది. నాన్న కోలుకున్నారు. తిరిగి ఉద్యోగానికి వెళ్ళారు. అప్పటివరకూ పడిన కష్టాలన్నింటినీ మర్చిపోయి సంతోషంగా జీవించడం ప్రారంభించాం.

అలాంటి సమయంలో వైభవి అనారోగ్యానికి గురైంది. తొలుత ఏదో చిన్న ఇబ్బందిలే అనుకున్నాం. తీరాచూస్తే అది కాస్తా అతి అరుదైన జెనెటిక్ డిజార్డర్ పోర్ఫీరియా అని తేల్చారు వైద్యులు. ఆ తర్వాత నాన్న మరోసారి పక్షవాతానికి గురయ్యారు. తనకున్న జబ్బు కారణంగా వైభవి చాలా ఇబ్బందిపడిపోయేది. ఆమె వంక చూపినప్పుడల్లా నాకు కన్నీళ్ళు ఆగేవి కావు. ఎప్పుడూ నిస్సహాయంగా, దీనంగా ఆమె వంక చూడడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి.

ఆమె బతకాలంటే అత్యంత ఖరీదైన ఇంజెక్షన్లు ఇవ్వాలి. ఈ ఇంజెక్షన్లు మనదేశంలో దొరకవు. అయినా ఆమెని కాపాడేందుకు నాకు చేతనైనంత చేయాలనుకున్నాను, చేశాను. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరి దగ్గరకీ వెళ్ళి సాయం చేయమని అడిగాను. కానీ హృదయ విదారకరమైన విషయమేమంటే...చాలామంది ముఖం చాటేశారు. వైభవితో పాటు నాన్నకూ చికిత్స అందించేందుకు నేను, అమ్మ చాలా తాపత్రయపడ్డాం. అమ్మ అనేక చోట్లకు వెళ్ళి అప్పులు తీసుకొచ్చింది. ఇంక నేను చదువు మానేసి ఉద్యోగం వెతుక్కోవాలని నిర్ణయించుకున్నాను. ఒక హోటల్‌లో పనిచేయడం మొదలుపెట్టాను. కానీ నాకు వచ్చే జీతం అటు ఇంట్లో కనీస ఖర్చులకు గానీ, మెడికల్ బిల్లులకు కానీ సరిపోయేవి కావు. ఖర్చులు ఎంతగా తగ్గించుకున్నా కనీస అవసరాలు కూడా గడిచేవి కావు.

పరిస్థితులు మరింత దారుణంగా తయ్యారయ్యాయి. ప్రతి రెండు నెలలకు ఒకసారి వైభవిని ఆసుపత్రిలో ఉంచాల్సి వచ్చేది. ఈ ఆసుపత్రి బిల్లులతో పాటు అప్పులు కొండలా పేరుకుపోయాయి. ఇక నా చెల్లెలు షీతల్ చదువు కూడా ఆగిపోయింది. ఫీజులు కట్టలేని పరిస్థితులే కాదు కనీసం రోజూ కాలేజీకి వెళ్ళేందుకు ప్రయాణ ఖర్చులకూ డబ్బులు ఉండేవి కావు.

షీతల్ చదువు ఆపకుండా పూర్తి చేయించేందుకు నేను శాయశక్తులా కృషి చేస్తూనే ఉన్నా. అనేక ట్రస్ట్ ఫౌండేషన్ల సాయాన్ని కోరాం. మా ఇల్లు కూడా తాకట్టులో ఉంది. నాన్న ఇంకా పనిచేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి సమయంలో మా కజిన్ సాయం తీసుకున్నా. మాకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన వాళ్ళల్లో మా కజిన్ ఒకరు. నాన్నకు వచ్చే నామమాత్రపు జీతం ఏ మాత్రం అక్కరకొచ్చేది కాదు. దాచిన డబ్బు అంటూ ఏమీ లేదు. అంతా ఖర్చు అయిపోయింది. వాస్తవానికి వైభవి చికిత్స కోసం తీసుకున్న అప్పులే తీర్చలేని పరిస్థితి. అవే కొండంత పేరుకుపోయి ఉన్నాయి. మరోపక్క డబ్బు లేని కారణంగానే నాన్నకు ఫిజియోథెరపీ కూడా ఆగిపోయింది.

వైభవిని దూరం చేసుకుని నాలుగు నెలలు అయ్యింది. ప్రతి సందర్భంలోనూ ఆమె గుర్తుకొస్తూనే ఉంటుంది. ఆమెను మిస్సవుతూనే ఉన్నాం. నా ప్రపంచం అంతా ఆమె చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. ఆమె జీవితాన్ని కాపాడగలననుకున్నా. ఆ పని చేయలేకపోయినందుకు నేను చాలా కలత చెందా. విషాదంలో మునిగిపోయా. వైభవిని కోల్పోవడం మా కుటుంబంలోని అందరికీ పెను విషాదాన్ని మిగిల్చింది.

నాకు ఇప్పటికీ గుర్తే. భరించలేని నొప్పితో బాధపడుతూ ఒకరోజు రాత్రంతా అలాగే చెయ్యి పట్టుకుని ఉండిపోయింది. చివరకు ఆ నొప్పిని భరించలేక నన్ను కొట్టింది కూడా. ఆ తర్వాత గట్టిగా ఆలింగనం చేసుకుని బాధపడింది. ఆమె ఎంత నిస్సహాయస్థితిలో అలా చేసిందో నేను అర్థం చేసుకున్నాను. ఆమె నొప్పి తీవ్రత మనం ఊహించని స్థాయిలో ఉంది.

ఇప్పుడు నా తండ్రి మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. కానీ ఆయన కళ్ళు ఎన్నో చెబుతున్నాయి. ఒకసారి ఆయన కూడా నా చేతులు పట్టుకుని...చేతి సంజ్ఞల ద్వారానే క్షమాపణ అడిగారు. ఆయన అలా చేయడం నన్ను చాలా భావోద్వేగానికి గురి చేసింది. కొన్ని గాయాలు చాలా తీవ్రంగా, చాలా లోతుగా ఉంటాయి. ఎప్పటికీ మానవు. నా కుటుంబం మామూలుగా ఉండేలా చేసేందుకు నేను చాలా ప్రయత్నిస్తున్నా. వాళ్ళముందు నా కన్నీళ్ళు కనిపించకుండా జాగ్రత్తపడుతున్నా. తట్టుకోలేనంత భావోద్వేగానికి గురైన సందర్భంలో కూడా రాత్రిపూట ఇంట్లో అందరూ నిద్రపోయిన తర్వాతే ఏడుస్తున్నా. గుండె పగిలేంత నా ఆవేదనను అలా బయటకు పంపిస్తున్నా. నా సోదరిని కాపాడుకోలేకపోవడం ఒక ఓటమిగా, తీరని వైఫల్యంగా నేను ఇప్పటికీ బాధపడుతూనే ఉన్నా. అది నాకు ఎప్పటికీ మానని గాయమే.

– ఒక యువతి

కొవ్వు వీటివల్లే!





మీకు కొవ్వు సమస్యలు ఉన్నాయా? అయితే ఆందోళనపడాల్సిన విషయమే. అయితే భయపడాల్సిన అవసరం లేదు. ఈ సమస్యతో బాధపడుతున్నవారు మీరొక్కరే కాదు. మన శరీరంలో కొలెస్ట్రాల్ పెరగడానికి అత్యధికంగా కొవ్వులు ఉన్న ఆహారం తీసుకోవడం ఒక్కటే కారణం కాదు. కొవ్వులు పెరగడానికి చాలా కారణాలు ఉన్నాయి. మీరు తినే తిండితో పాటు మీ కుటుంబ చరిత్ర, వంశ చరిత్ర కూడా ఇందుకు కారణం కావచ్చు. కొలెస్ట్రాల్ పెరగడానికి కారణాలు ఇవీ.

ఆహారం

- శాచురేటెడ్ కొవ్వులు ఎక్కువగా ఉండే బీఫ్, పోర్క్, పాలు, గుడ్లు, వెన్న, జున్ను లేదా ప్యాకింగ్ చేసిన ఆహారాలు ఎక్కువగా తీసుకుంటే కొవ్వులు పెరుగుతాయి. కొబ్బరినూనె, పామాయిల్, కోకా బటర్ లాంటివి తీసుకోడం వల్ల కూడా కొలెస్ట్రాల్ స్థాయిలు బాగా పెరుగుతాయి.

బరువు

- అధిక బరువు రక్తంలో కొవ్వుల స్థాయిలను పెంచుతుంది. మన శరీరం అదనపు కొవ్వులను ట్రైగ్లిజరైడ్స్ రూపంలో నిల్వ చేస్తుంది. ఈ ట్రైగిజరైడ్స్ మంచి కొవ్వులైన హెచ్‌డిఎల్‌ను తగ్గించేస్తాయి. బరువు తగ్గడం ద్వారా మంచి కొవ్వులను మెరుగుపర్చుకోవచ్చు.

చురుకుదనం స్థాయిలు

- ఎక్కువ కదలికలు లేకుండా మందకొడిగా, బద్దకంగా ఉండేవారిలోనూ కొలెస్ట్రాల్ ముప్పు ఎక్కువే ఉంటుంది. శరీర కదలికలు, చురుకుదనం సరైన స్థాయిలో లేకపోతే చెడు కొలెస్ట్రాల్ పెరిగిపోతుంది. మంచి కొవ్వులు తరిగిపోతాయి. అందుకే క్రమం తప్పని వ్యాయామం ఉండాలి. రక్తంలో ఉండే చెడు కొవ్వులను వ్యాయామం సహజంగా తగ్గించేస్తుంది. మంచి కొవ్వులనూ పెంచుతుంది.

వయస్సు

- కొవ్వులు అత్యధికంగా పేరుకుపోవడమనేది వయస్సుని బట్టి కూడా ఉంటుంది. పురుషుల్లో 45 ఏళ్ళు దాటిన తర్వాత, మహిళల్లో 55 ఏళ్ళు దాటిన తర్వాత ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది.

లింగభేదం

- అధిక కొవ్వుల ముప్పు మహిళలతో పోలిస్తే పురుషుల్లోనే ఎక్కువ. మహిళల్లో మెనోపాజ్ దశకు వచ్చేవరకూ కొలెస్ట్రాల్ స్థాయిలు తక్కువగానే ఉంటాయి. మెనోపాజ్ తర్వాత మహిళల్లోనూ పురుషుల్లో మాదిరిగానే కొలెస్ట్రాల్ పెరిగిపోతుంది.

కుటుంబ చరిత్ర

- మీ కుటుంబం మీకు ఒక రూపాన్ని మాత్రమే కాదు ఆరోగ్యాన్నీ ఇస్తుంది. అనారోగ్యాలకూ కారణమవుతుంది. అధిక కొవ్వుల సమస్య మీ కుటుంబంలో ఎవరికైనా ఉంటే అది మీమీదా ప్రభావం చూపించవచ్చు. కొవ్వులే కాదు కొవ్వు సంబంధిత సమస్యలు ఉన్నా అవి మీమీద ప్రభావం చూపిస్తాయి.

ధూమపానం

- స్మోకింగ్ ఏ రకంగానూ ఆరోగ్యానికి మంచిది కాదు. ఇది గుండె ధమనుల గోడలను దెబ్బతీస్తుంది. మంచి కొవ్వులను తగ్గించేస్తుంది. ధూమపానం సమస్య నుంచి బయటపడితే మంచి కొవ్వులూ పెరుగుతాయి.



వేపను ఉపయోగించండిలా



- కప్పు వేపాకులు తీసుకుని నీళ్ళల్లో వేసి మరిగించండి. అవి రంగు మారేవరకూ, మెత్తగా అయ్యేవరకూ ఉడికించండి. తర్వాత ఆ నీటిని వడకట్టి చల్లారనివ్వండి. ఆ నీటిని ఒక బాటిల్‌లో పోసి నిల్వ చేసుకోండి. దీనిని కొద్దికొద్దిగా రోజూ మీరు స్నానం చేసే నీటిలో వేసుకోండి. ఇలా చేయడం వల్ల మొటిమలు రావు. చర్మానికి ఎలాంటి ఇన్ఫెక్షన్ సోకదు. శరీరం దుర్వాసన రాదు.
- మీకు కావలసినన్ని వేపాకులు తీసుకుని అందులో కొద్దిగా నీళ్ళు పోసి మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్‌లా చేయండి. దీనిని ఫేస్‌ప్యాక్‌లా వేసుకుంటే మొటిమలు తగ్గిపోతాయి. వేపాకులు మరిగించిన నీళ్ళు స్కిన్ టోనర్‌గానూ ఉపయోగపడతాయి. దీనిని కాలిన గాయాల మీద రాసుకుంటే త్వరగా మానిపోతాయి. చర్మం ఉడికిపోయిన లేదా కమిలిపోయిన ప్రాంతంలో రాసుకుంటే ఇన్ఫెక్షన్లు, అలర్జీలు రాకుండా నియంత్రిస్తుంది.
- వేపాకులు వేసి ఉడికంచిన నీటిని జుట్టుకూ ఉపయోగించుకోవచ్చు. కానీ ఈ నీటిని చల్లారిన తర్వాతే వాడాలి. ఈ నీటిని తల మీద నుంచి పోసుకుంటే పేలు, చుండ్రు, మాడు పొడిబారడం, జుట్టు ఊడిపోవడం, జుట్టు త్వరగా చిక్కుబడిపోవడం లాంటి సమస్యలు తీసరిపోతాయి. జుట్టు మృదువుగానూ, నునుపుగానూ తయారవుతుంది.
- వేప ఎలాంటి క్రిమికీటకాలనైనా తరిమేస్తుంది. వేపాకుల ముద్దలో తడిపిన లేదా వేపాకులు మరిగించిన నీళ్ళల్లో ముంచిన చిన్న దూది ఉండను మీ కిటికీ సమీపంలో ఉంచండి. అక్కడ నుంచి ఎలాంటి క్రిమికీటకాలూ మీ ఇంట్లోకి రావు. దోమలు లేదా ఇంకేమైనా సూక్ష్మజీవులు మిమ్మల్ని వేధిస్తుంటే వేపాకుల పొగ వేయండి చాలు. అవి ఇట్టే మాయమైపోతాయి. దోమలపై పోరాడేందుకు మనకున్న సహజసిద్ధమైన ఆయుధం ఈ వేపాకుల పొగ.





ఒంటికీ, మోముకీ ఒకటే పూత

బాగా పండిన బొప్పాయి గుజ్జు, రెండు వంతుల తేనె, రెండు వంతుల పెరుగు, రెండు వంతుల ఎండిన కమలా, నిమ్మ తొక్కలతో చేసిన పొడి, మూడు వంతుల ఓట్ మీల్ తీసుకోండి. ఇవన్నీ బాగా కలిపితే మంచి పూత రెడీ అయినట్టే. దీనిని మోముకే కాదు శరీరం మొత్తానికీ పట్టించేయవచ్చు. దీనిని బాగా పట్టించి ఆరిన తర్వాత స్నానం చేసేయడమే. ఈ పూతను కనీసం అరగంట ఉంచితే ఫలితం కనిపిస్తుంది.

జలుబా...

శీతాకాలం వచ్చిందిగా. మారిన వాతావరణం కారణంగా ఇట్టే జలుబు వచ్చేస్తూ ఉంటుంది. ఎప్పుడూ జలుబు అంటే ఏంటో తెలియనివాళ్ళు కూడా ఈ కాలంలో దీనిబారిన పడుతుంటారు. మరి మీరూ ఇలాగే పడిశంతో బాధపడుతున్నారా? అయితే ఇలా చేసి చూడండి. జలుబుని తగ్గించడానికి సులువైన మార్గాలు చాలానే ఉన్నాయి.

- నీలగిరి (జామాయిల్) ఆకులు వేడి నీళ్ళల్లో వేసి ఆవిరి పట్టండి. జలుబు ఇట్టే తగ్గిపోతుంది.
- జలుబు తగ్గడానికి మరో సులువైన మార్గం ...చిటికెడు పసుపును వేడి పెనంపై వేసి ఆ పొగను పీల్చండి.
- పసుపుపొడిని కాగే నీటిలో వేసి ఆవిరి పట్టినా ఉపశమనం ఉంటుంది.





- మిరియాల పొడి కషాయం తాగినా, మిరియాల పొడిని తేనెలో కలిపి తీసుకున్నా జలుబు తగ్గుముఖం పడుతుంది
- వస గంధం ముక్కుకు రాసుకున్నా జలుబు తగ్గుతుంది.



అన్నంలో ఇలా...

- అన్నం ఉడికేటప్పుడు అందులో రెండు, మూడు చుక్కల నిమ్మరసం పిండితే అన్నం తెల్లగా మల్లెపువ్వులా ఉంటుంది
- అన్నం ఉడికేటప్పుడు కొంచెం నూనె వేస్తే అన్నం ముద్దకాకుండా పొడిపొడిగా వస్తుంది.
- రాత్రిపూట అన్నంలో మజ్జిగ పోసి నానబెట్టండి. ఉదయాన్నే ఇందులో ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు కూడా వేసి తాలింపు వేయండి. టిఫిన్ బదులు దీనిని తింటే దేహం పుష్టిగా తయారవుతుంది. ఏ వయస్సువారైనా ఇది తినవచ్చు. చిక్కి శుష్కించిపోతున్నవారికి ఇది మంచి ఆహారం. చదువుకునే పిల్లలకు తప్పకుండా దీనిని పెట్టాలి. గర్భవతులకు చలవ చేస్తుంది. ఈ మజ్జిగ అన్నం జీర్ణశక్తిని పెంచుతుంది. ఆయుష్షును పెంచుతుంది. శరీరానికి కాంతినిస్తుంది.

నేను - సుడిగుండం

(నవల) 12

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

రెండు రోజుల తర్వాత నాకు సుధాకర్ - వీరూలు కనిపించారు. నన్ను చూడగానే ముఖం పక్కకి తిప్పుకుని వెళ్లిపోయారు. ఈ పరిణామం ఏంటో నాకు అర్థం కాలేదు. ఇందులో అమిత పాత్ర వుందా, నిరంజన్ పాత్ర వుందా అనే అనుమానం వచ్చింది. అయితే మోరల్ గానే కాకుండా, ఫిజికల్‌గా కూడా నా వెనక బలం వుందనిపించింది.

ఆ తర్వాత నిరంజన్ నాకు కొన్ని పుస్తకాలు యిచ్చాడు. నేను ఇంతకు ముందు పాపులర్ నవలలు చదివాను. కవిత్వం చాలా తక్కువ. ఎందుకో నాకు కవిత్వం నచ్చేది కాదు. అలాగే విజయం ఎలా సాధించాలి అనే పుస్తకాలూ చదివాను.

ఇప్పుడు నిరంజన్ యిచ్చిన పుస్తకాలు వేరు. అందులో కొన్ని చదువుతుంటే సమాజం ఇంత భయంకరంగా వుందా అనిపించింది. జయదేవ్ గారు కూడా....

"మనం అన్ని రకాల పుస్తకాలు చదవాలి. అవన్నీ కొందరి ఆదేశాలు, ఆశలు, సిద్ధాంతాలు. అవన్నీ ఆకాశం నుండి రావటం లేదు. పెయిన్ నుండి, మెమరీ నుండి, చరిత్ర నుండి వస్తున్నాయి. అయితే మనం యవ్వన ఉద్రేకంలో కొట్టుకుపోకూడదు. వాక్యాలు మనల్ని తీవ్రంగా కుదిపేస్తుంటాయి. అయినా మనకంటూ ఓ ఆలోచన వుండాలి. జీవితాన్ని వాస్తవాన్ని జరుగుతున్న పరిణామాల్ని మనం అధ్యయనం చేయకపోతే ఏదో కొసకు కొట్టుకుపోతాం" అన్నారు.

అప్పుడు అనిపించింది. మనకంటూ ఓ శ్రేయోభిలాషి వుండాలి. మనం చేస్తున్న పనుల్ని నిర్మమకారంగా విమర్శించాలి. అది మనం స్వీకరించాలి. ఇప్పటివరకు నరసయ్య మావయ్య, అమ్మ నా శ్రేయోభిలాషులు. వాళ్లు నన్ను విమర్శించే అవకాశాలు తక్కువ. ఇప్పుడు నా మార్గంలోకి కొత్తవారు వస్తున్నారు.

జయదేవ్, అమిత, నిరంజన్... ఇంకా ఈ లిస్ట్ పెరిగిపోతూంది.

****

మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం అవుతాయనగా ఓ సంఘటన మొత్తం క్యాంపస్‌ని కుదిపేసింది.

హరిత అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థుల్లో చాలామంది కదిలిపోయారు. గుంపులు గుంపులుగా చేరుకున్నారు హాస్టల్ దగ్గరికి. అక్కడ పోలీసులున్నారు. ఆ అమ్మాయి ప్రకాశం జిల్లా నుండి వచ్చి చదువుకుంటోంది.

హరిత ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలియదు. అందుకు కారణం లెక్చరర్లు తిట్టటమా! ఇంకేమయినా కారణాలా! తను ఓ ఉత్తరం రాసి చనిపోయిందంటు న్నారు. రకరకాలుగా వూహించుకుంటున్నారు.

లలిత, అమిత, నిరంజన్, నేను అందరం వున్నాం. సుధాకర్, వీరూల బృందం కనిపించలేదు. యూనివర్సిటీలో 'రాగింగ్' సమస్య లేదా అంటే వుంది. అయితే అదంతా కొత్తలో. ఆమె లేఖలో ఏముందో పోలీసులకు తెలుసు. వాళ్లు దర్యాప్తు చేస్తున్నాం అన్నారు. హరిత ఫ్యాన్ కి ఉరేసుకుంది. ఆ సమయంలో ఎవరూ లేకుండా చూసుకుంది.

నాకు దుఃఖం వస్తున్నా నిగ్రహించుకుంటున్నాను. ఎవరి ముఖంలోనూ కాంతి లేదు. చిన్నప్పుడు నేను అమ్మా, మావయ్య చనిపోతే ఆత్మహత్య చేసుకోవాలనుకోవటం గుర్తొచ్చింది. హరిత తల్లిదండ్రులు వచ్చారు. వారి దుఃఖానికి అంతు లేదు. పోస్ట్ మార్టమ్ అయిపోయాక శవాన్ని తమ ఊరికి తీసుకుపోయారు.

****

హరిత మరణానికి సంతాపం తెలియచేయటానికి నిరంజన్ సమావేశం ఏర్పాటు చేసాడు. ఆడపిల్లలూ, మగవాళ్లు బాగానే వచ్చారు. నిరంజన్ మాట్లాడాడు.

"ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన. హరితకు ఎన్ని సమస్యలున్నా, ఇలా సూట్ సైడ్ చేసుకోవటం మాత్రం చేయాల్సింది కాదు. ఇలాంటివి ఇక ముందు జరగకూడదు అని కోరుకుందాం" అన్నాడు.

అమిత, లలిత, మరికొందరు మాట్లాడారు. నన్ను కూడా మాట్లాడమన్నారు. ఇప్పటివరకూ నేను పదిమంది మధ్య మాట్లాడలేదు అందుకే ఒప్పుకోలేదు.

ఆ తర్వాత జయదేవ్‌గారితో నేనూ, లలితా, అమితా, నిరంజన్ కూర్చున్నాం. హరిత ఉత్తరంలో అమ్మా - నాన్నల్ని క్షమించమని రాసింది తప్ప ఎవరి పేరూ రాయలేదంట.

అయితే ఇది ప్రేమ వ్యవహారం అని, శవ పరీక్షలో తను ప్రెగ్నెంట్ అని తెలిసిందని పుకార్లు వచ్చాయి.

"ప్రపంచీకరణ మొదలయింది. దాని వికృత పరిణామాలు ముందు ముందు ఇంకా దారుణంగా వుంటాయి" అన్నారు జయదేవ్.

ప్రపంచీకరణ గురించి నాకు తెలియదు. హరిత ప్రేమ విఫలం కావటానికి, దానికి సంబంధం ఏమిటో నాకు అర్థం కాలేదు. ఇంతకుముందు కూడా ఇలాంటివి జరిగాయి.

"అమాయకులైన ఆడపిల్లలు మోసపోయారంటే అర్థం చేసుకోవచ్చు. చదువుకుంటున్న అమ్మాయి మోసపోవటం ఏంటి? అందులోనూ ప్రెగ్నెంట్ అయిందనటం నిజం అయితే, హాస్టల్లో వుంటున్న అమ్మాయి బయటకు వెళ్లే సాహసం ఎలా చేయగలిగింది" అంది లలిత.



అప్పటికే రకరకాల సాహిత్యం వస్తోంది. అందులో 'ఫ్రీ సెక్స్' గురించి రాస్తున్నారు. ఇలాంటి ప్రభావాలు పడుతున్నాయి. డబ్బులు వస్తాయంటే ఎలాంటి నీచమైన రాతలు రాయటానికయినా రచయితలు కొందరు తయారవుతున్నారు. మనం ఇలాంటివారి మీద కూడా యుద్ధం చేయాలని నిరంజన్ అన్నాడు.

మొత్తం రాష్ట్రంలోనే ఈ ఆత్మహత్య మీద చర్చ జరిగింది. అమిత మాట్లాడలేదు. అందరి మాటలూ వింటోంది. మరికొన్ని ఆత్మహత్యల విషయం మాట్లాడుకున్నాం.

ఎప్పుడయితే ప్రైవేట్ యాజమాన్యంలో కార్పొరేట్ స్కూళ్లు, కాలేజిలు ప్రారంభం అయ్యాయో విద్యావిధానం మారిపోయింది. ఇప్పుడు చిన్నప్పటి నుంచి వారికి సిలబస్ తప్ప, ఇంకేది పనికి రాదు. ఆటలు లేవు, పాటలు లేవు. సమయం వుండదు.

"ప్రపంచీకరణ అంటే కేవలం పెట్టుబడులు ప్రవహించటం కాదు. మానవ సంబంధాలను కలుషితం చెయ్యటం. అప్పుడే వారు తమ ఉత్పత్తులనీ మార్కెట్ చేసుకుంటారు. వారు కుటుంబాలను వదలరు. పడక గదులనీ వదలరు. అసలు ఉదయం లేచిన దగ్గర్నుండి రాత్రి నిద్రపోయేవరకూ అన్ని రంగాలూ కలుషితం చేస్తారు. మనం ఇంకొకరికి చెప్పేముందు ఈ అంటువ్యాధి మనకు పాకకుండా చూసుకోవాలి' అన్నారు జయదేవ్,

****

హరిత మరణ ప్రభావం నుండి మెల్లగా కోలుకున్నాను. మొదట్లో నాకు చదువు మీద తప్ప ఇంకో దృష్టి లేదు. పుస్తకాలు కూడా అరుదుగా చదివేవాడ్ని. ఇంతకు ముందు నాకు మంచి పుస్తకాలు చదవటం కుదిరేది కాదు. అవి దొరకకపోవటం ఓ సమస్య అయితే ఊహా లోకాల్లో విహరించే వారికి ముందు ప్రాధాన్యం యిచ్చాను.

విశాఖ రావటంతో ఆ ప్రభావం నుండి బయటపడ్డాను. ఒక్కొక్కరూ పరిచయం అవుతున్నకొద్దీ నేను చదువుకునే సమయం తగ్గుతూ వస్తోంది. లేబరేటరీకి వెళ్లటం అనేది తప్పనిసరి. అయితే ఇందువల్ల నాకు మంచి కూడా జరిగింది.

సామాజిక విషయాలు, సైన్స్ ఆవిష్కరణలను కలిపి చూడటం వలన నాకు పాఠాలు సులభంగా అర్థం అవుతున్నాయి. ప్రకృతిలోని అంశాలు నన్ను ఆశ్చర్యానికి గురి చేసినట్లుగానే సామాజిక అంశాలూ చేస్తున్నాయి. వీటన్నింటిలో ఓ క్రమం వుంది. దేనికది విడిగా వుంటుంది. ప్రత్యేక అస్తిత్వం కలిగి వుంటుంది. అయితే మిగతా అంశాలతో సంబంధం వుంటుంది. మొక్కలూ, జంతుజాలం, మనిషి జరిపే ప్రయాణంలో అంతఃసూత్రం వుంది. ఇది గుర్తించటానికి వీళ్లందరూ సహకరిస్తున్నారు. లేకపోతే ఈ సైన్స్ పాఠాలను అర్థం చేసుకోవటం అంత సులభం అయ్యేది కాదు. అంతేకాదు. చిన్నప్పటి నుంచి నేను తెలుగులో చదువుకున్నాను. ఇంటర్ మీడియట్లోనూ తెలుగే. ఇక్కడ మాత్రం ఇంగ్లీష్ మీడియం.

మొదట్లో నేను చాలా యిబ్బంది పడ్డాను. ఇప్పుడు మాత్రం అలా కాదు ఆంగ్లంలో మాట్లాడగలను. అయితే నేను పండితుడ్ని కాదు. భాష ఎప్పుడూ మహా సముద్రమే. విశాఖ నా తెలుగు భాషని కూడా మార్చింది.

అలా పరీక్షలు బాగానే రాయగలిగాను.

ఇంటికి బయలుదేరేముందు అమిత అడిగింది. "ఇప్పటివరకూ నువ్వు మా ఇంటికి రాలేదు రామూ"

"చూస్తున్నావుగా అమితా.... వస్తాను. ఏదొక రోజు వస్తాను" అన్నాను.

"నువ్వు మా ఇంటికి వస్తే నేనూ మీ ఇంటికి రావాలనుకుంటున్నాను" అంది.

"మాది పల్లెటూరు అమితా... మా ఇల్లు చాలా చిన్నది. అక్కడ నీకు ఆహ్లాదం కలిగించేది ఏదీ వుండదు"

"అంటే నన్ను మీ ఇంటికి పిలవనంటావు" "అలా అని కాదు..." అన్నాను.

"ఇంకా నయం. మీ ఊర్లో మనుషులు వుండటం లేదు అనలేదు. అసలు జీవితం అక్కడే వుంది. సమస్యలు అక్కడే వున్నాయి. అంతే కాదు మన రూట్స్ అక్కడున్నాయి"

"నీకు సరయిన మర్యాదలు చేయలేననీ అలా అన్నాను"

"మర్యాదలంటే ఏంటి రామూ!"

నేను మాట్లాడలేకపోయాను.

"నాకు పరిచయం అయిన దగ్గర్నుండి నిన్ను చూస్తున్నాను. నీ దగ్గర డబ్బు లేదనో, ఎవరైనా ఏదయినా అనుకుంటారనో బిడియం ఉంది. నువ్వు ఇంట్రావర్ట్ వి కూడా. ఇలాంటి వాటి నుండి నువ్వు బయటకి రావాలి"

"తప్పకుండా అమితా... నువ్వు మా ఇంటికి రా. నాతో వస్తావా?" అన్నాను. "వస్తాను. ఏదొక రోజు వస్తాను. నువ్వయితే తొందరగా వచ్చేయ్" అంది.

(ఇంకా ఉంది)

వినోద రంగంలో కొలువులు అనేకం





సమాజంలో ప్రతి ఒక్కరూ వారమంతా తీరికలేని పనుల కారణంగా ఒత్తిడితో గడుపుతుంటారు. ఈ ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం వినోదాన్ని ఆశ్రయిస్తారు. సినిమాలు, టీవీ సీరియల్స్, వీడియోగేమ్స్ వంటివాటితో రీఛార్జ్ అవుతారు. ఈ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం ఇప్పుడు యువతకు ఉపాధి వేదికగా మారుతోంది. వినోద రంగం రోజురోజుకూ విస్తరిస్తూ లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఉపాధి మార్గాలు.. అవసరమైన అర్హతలు, నైపుణ్యాల గురించి తెలుసుకుందాం...

ఆయా వయసుల వారు తమ అభిరుచికి అనుగుణంగా పలు రకాలుగా వినోదం పొందుతున్నారు. వీడియో గేమ్స్, సినిమాలు, టీవీ సీరియల్స్, యూ ట్యూబ్ ఛానెల్స్‌ను వీక్షిస్తూ ఆహ్లాదం పొందుతున్నారు. దీంతో ఎంటర్ టైన్‌మెంట్ రంగం.. ఏటా 11 శాతం నుంచి 12 శాతం వృద్ధి సాధిస్తోంది. ప్రస్తుతం మన దేశ వినోద రంగం దాదాపు నాలుగు బిలియన్ డాలర్లకు చేరుకుందని అంచనా. దేశవ్యాప్తంగా లక్షల మందికి ఉపాధి వేదికగా ఎంటర్ టైన్‌మెంట్ రంగం నిలుస్తోంది. డెలాయిట్, కేపీఎంజీ తదితర సంస్థల అంచనాల ప్రకారం 2020 నాటికి భారత ఎంటర్‌టైన్‌మెంట్ రంగం దాదాపు అయిదు బిలియన్ డాలర్లకు చేరుకోనుంది. దీంతో ప్రస్తుతమున్న ఉద్యోగాలకు అదనంగా మరో లక్ష ఉద్యోగాలు ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో లభించనున్నాయి. ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఫిల్మ్ ఇండస్ట్రీ, యానిమేషన్ రంగం ఉద్యోగావకాశాలను కల్పించడంలో ముందుంటున్నాయి.

యానిమేషన్ :

యానిమేషన్ అంటే.. మనుషులు, వస్తువులు, జంతువులు, పక్షులు వంటి వాటి ఆకారాలను కార్టూన్స్/చిత్రాల రూపంలో సహజ రీతిలో కనిపించేలా రూపొందించి... వాటి హావభావాలను కంప్యూటర్ ద్వారా పలికించడమే. డ్రాయింగ్స్, లేదా జంతువుల, లేదా మనుషుల చిత్రాలను కంప్యూటర్ ద్వారా కదిలిస్తూ.. గేమ్స్, సినిమాలు, కార్టూన్‌లను రూపొందించడాన్నే యానిమేషన్ అంటారు. మనం రోజూ చూసే కార్టూన్ నెట్‌వర్క్, వీడియో గేమ్స్ ఇవన్నీ యానిమేషన్ కోవకు చెందినవే. ప్రేక్షకులను ఆకట్టుకునేలా వీటిని రూపొందించేందుకు నిపుణుల అవసరం ఏర్పడుతోంది.

జూనియర్ యానిమేటర్ :

యానిమేషన్ రంగంలో ఎంట్రీ లెవల్ ఉద్యోగంగా జూనియర్ యానిమేటర్‌ను పేర్కొనొచ్చు. ఈ ఉద్యోగం అందుకోవాలంటే.. సాంకేతిక అర్హతలు తప్పనిసరి. కంప్యూటర్ డిజైన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన. సీ++, జావా ప్రోగ్రామింగ్ నాలెడ్జ్ ఉంటే అదనపు అర్హత. దాంతోపాటు ఫొటోగ్రఫీ, లైటింగ్ గురించి కూడా తెలిసుండాలి. 3-డి డిజైన్, వర్చువల్ డిజైన్ వంటి అంశాల్లోనూ నైపుణ్యం కావాలి. ఈ అర్హతలతో ఉద్యోగం లభించిన వారు.. ఒక కాన్సెప్ట్‌కు సంబంధించి ఐడియాను సృష్టించడం, దానికి తుది రూపం ఇచ్చే క్రమంలో ప్రీ పొడక్షన్, ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జూనియర్ యానిమేటర్స్‌కు రూ.10 వేల నుంచి రూ.15వేల వేతనం లభిస్తోంది. ఇలా.. రెండు, మూడేళ్ల అనుభవం, మెరుగైన పనితీరు కనబరిస్తే సీనియర్ యానిమేటర్స్, యానిమేషన్ డైరెక్టర్ స్థాయికి చేరుకోవచ్చు.

యానిమేషన్ కోర్సులు..

జాతీయస్థాయిలో ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ 2డీ, 3డీ యానిమేషన్; అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ మల్టీమీడియా; సర్టిఫికెట్ ఇన్ గ్రాఫిక్ డిజైనింగ్; సర్టిఫికెట్ ఇన్ వెబ్ డిజైనింగ్; సర్టిఫికెట్ ఇన్ 3డీ యానిమేషన్; సర్టిఫికెట్ ఇన్ విజువల్ ఎఫెక్ట్స్; సర్టిఫికెట్ ఇన్ వీడియో ఎడిటింగ్; సర్టిఫికెట్ ఇన్ ఫ్లాష్ అడ్వాన్స్ స్క్రిప్టింగ్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పలు సెట్విన్, ఎన్ఎస్‌డీసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు కూడా యానిమేషన్ రంగానికి సంబంధించి కోర్సులు అందిస్తున్నాయి.

మరెన్నో ఉద్యోగాలు..

యానిమేషన్ రంగంలో యానిమేటర్స్ మాత్రమే కాకుండా.. మరెన్నో ఉద్యోగాలు లభిస్తున్నాయి. అవి.. కంటెంట్ డెవలపర్స్; మోడలర్స్; స్టోరీ బోర్డ్ ఆర్టిస్ట్స్; క్యారెక్టర్ యానిమేటర్స్; లే అవుట్ ఆర్టిస్ట్స్; ఇమేజ్ ఎడిటర్స్; కంపోజిటర్స్; విజువలైజర్స్; ఆడియో, వీడియో స్పెషలిస్ట్ వంటి వాటిని ముఖ్యమైన హోదాలుగా పేర్కొనవచ్చు.

కొన్ని యానిమేషన్ ఇన్‌స్టిట్యూట్‌లు..

ఫ్రేమ్‌బాక్స్ :
వెబ్‌సైట్ : http://www.frameboxx.in/html

మాయా అకాడమీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సినిమేటిక్స్.
వెబ్‌సైట్ : http://www.maacindia.com

మణిపాల్ యూనివర్సిటీ
వెబ్‌సైట్ : http://www.manipal.edu

సినీ పరిశ్రమ :

ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో మరో ప్రధాన విభాగం.. సినీ పరిశ్రమ. దేశవ్యాప్తంగా ఏటా వందల సంఖ్యలో సినిమాల నిర్మాణం చేపడుతూ.. లక్షల మందికి ఉపాధి అవకాశాలకు వేదికగా నిలుస్తోంది. సినీ పరిశ్రమలో లభించే ఉద్యోగాల వివరాలు..

డైరెక్టర్ :

సినిమాను ప్రేక్షకులు ఆదరించే విధంగా రూపొందించడం.. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం డైరెక్టర్ బాధ్యత. అందుకే కెప్టెన్ ఆఫ్ ది షిప్‌గా డైరెక్టర్‌ను పిలుస్తారు. డైరెక్టర్‌గా రాణించాలంటే.. సృజనాత్మకత తప్పనిసరి. అదే విధంగా డైరెక్షన్ అంటే కేవలం సినిమాలే కాకుండా.. యాడ్ కంపెనీలు, టీవీ ఛానళ్లు కూడా ఉపాధి వేదికలే. కెరీర్ పరంగా ప్రారంభంలో అసిస్టెంట్ డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్, కో-డైరెక్టర్‌గా పనిచేస్తూ.. పట్టు సాధిస్తే కొద్ది కాలంలోనే డైరెక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించవచ్చు. డైరెక్టర్‌గా రాణించడానికి ఇప్పుడు బ్యాచిలర్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్; మాస్టర్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, పీజీ డిప్లొమా ఇన్ డైరెక్షన్ అండ్ స్క్రీన్ రైటింగ్ వంటి కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి.

ఎడిటింగ్ :

ఒక సినిమా, డాక్యుమెంటరీ ఫిల్మ్, సీరియల్.. ఇలా ఏదైనా సక్సెస్ సాధించి ప్రేక్షకాదరణ పొందడంలో ఎడిటింగ్‌ది కీలక పాత్ర. వాస్తవానికి ఎడిటర్ విధులు పోస్ట్ ప్రొడక్షన్ స్థాయిలో ప్రారంభమవుతాయి. అప్పటికే చిత్రీకరించిన ఫిల్మ్‌ను పరిశీలించి అందులోంచి అనవసరమైన సన్నివేశాలను తొలగించడం, ఆయా సన్నివేశాల మధ్య లింక్ ఉండేలా ఆసక్తి కరంగా రూపొందించడం ముఖ్య విధులుగా చెప్పవచ్చు. ఎడిటింగ్ కోర్సుల్లో చేరేందుకు కనీసం ఇంటర్మీడియెట్ పూర్తిచేసి ఉండాలి. వేతనాల పరంగా ఎడిటర్‌కు సినిమా ప్రొడక్షన్ హౌస్‌స్థాయిని బట్టి రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు సంపాదించే అవకాశముంది.

స్క్రిప్ట్ రైటర్ :

రచయిత ఇచ్చిన కథకు అనుగుణంగా... ఆయా పాత్రలు, సన్నివేశాలను పరిగణనలోకి తీసుకుంటూ స్క్రిప్ట్ రూపొందించడం స్క్రిప్ట్ రైటర్స్ ముఖ్యమైన విధి. వీరికి అవకాశాలు బాగానే లభిస్తున్నాయి. వేతనాల పరంగా.. సినిమా స్థాయి, కథకు అనుగుణంగా.. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదించే అవకాశముంది. టీవీ సీరియల్స్ విషయంలో ఎపిసోడ్స్ వారీగా ఒక్కో ఎపిసోడ్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేలు సంపాదించవచ్చు.



గ్రాఫిక్ డిజైనర్స్ :

ప్రస్తుతం గ్రాఫిక్స్ లేని సినిమాలను ఊహించడం కష్టమే. గ్రాఫిక్ డిజైనర్లకు డిమాండ్ పెరుగుతోంది. వాస్తవానికి సాంకేతికంగా వీఎఫ్ఎక్స్ (విజువల్ గ్రాఫిక్ డిజైనింగ్)గా దీన్ని పిలుస్తారు. ఇందులో నైపుణ్యం పొందితే గ్రాఫిక్ డిజైనర్లుగా నెలకు రూ.50 వేల వరకు వేతనం అందుకోవచ్చు. వీటికి సంబంధించి ఇప్పుడు పలు సంస్థలు శిక్షణనిస్తున్నాయి.

మ్యూజిక్ ఆర్టిస్ట్స్ :

ఓ సన్నివేశానికి అనుగుణంగా మ్యూజిక్ రూపొందించడం, బ్యాక్ డ్రాప్ మ్యూజిక్ అందించడం వంటివి మ్యూజిక్ ఆర్టిస్ట్ ప్రధాన బాధ్యతలు. ఇందులో రాణించాలంటే.. ఆసక్తితోపాటు నైపుణ్యం, ప్రతిభ చాలా అవసరం. మ్యూజికల్ నైపుణ్యాలు పొందేందుకు కూడా అకడమిక్‌గా పలు యూనివర్సిటీలు లిబరల్ అండ్ థియేటర్ ఆర్ట్స్ విభాగంలో ప్రోగ్రామ్స్‌ను అందిస్తున్నాయి.

ఒక సినిమా రూపొందించాలంటే కనీసం నాలుగు వందల నుంచి అయిదు వందల మంది వరకు టెక్నీషియన్ల అవసరం ఏర్పడుతోంది. మేకప్ ఆర్టిస్ట్స్, ప్రొడక్షన్ మేనేజర్స్, సౌండ్ ఇంజనీర్స్, లైటింగ్ బాయ్స్ వంటి వాటిలో మేకప్‌మ్యాన్ మొదలు లైటింగ్ బాయ్ వరకు.. 24 ఫ్రేమ్స్‌కు సంబంధించిన ఉద్యోగాలు పుష్కలమని చెప్పవచ్చు. ఇన్‌స్టిట్యూట్‌లు, కోర్సులు అందుబాటులో ఉన్నప్పటికీ... సినీ నిర్మాణ సంస్థలు ఆ సర్టిఫికెట్ల ఆధారంగా అవకాశాలు ఇవ్వడం అరుదు. అవకాశాల కోసం ఆయా ప్రాంతాల్లో స్వీయ అన్వేషణ సాగించడమే సాధనం. గ్రాఫిక్స్ డిజైనింగ్, యానిమేషన్ వంటి విభాగాల్లో మాత్రం ఆయా శిక్షణ సంస్థల ద్వారా నేరుగా ఉద్యోగం పొందే అవకాశముంది.

కోర్సులందిస్తున్న కొన్ని విద్యా సంస్థలు...

ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా-పుణె.
వెబ్‌సైట్ : www.ftiindia.com

సత్యజిత్‌రే ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్-కోల్‌కతా.
వెబ్‌సైట్ : www.srfti.ac.in

సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆర్ట్ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్- న్యూఢిల్లీ
వెబ్‌సైట్ : www.craftfilmschool.com

ఏషియన్ అకాడమీ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్- నోయిడా
వెబ్‌సైట్ : www.aaft.com

రామానాయుడు ఫిల్మ్ స్కూల్- హైదరాబాద్
వెబ్‌సైట్ : www.ramanaidufilmschool.net

అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా
వెబ్‌సైట్ : www.aisfm.edu.in

శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం- హైదరాబాద్
వెబ్‌సైట్ : teluguuniversity.ac.in

వీటితోపాటు.. అన్ని ప్రముఖ యూనివర్సిటీలు థియేటర్ ఆర్ట్స్ విభాగం పరిధిలో మ్యూజిక్, డైరెక్షన్, ఎడిటింగ్ వంటి కోర్సులను అందిస్తున్నాయి.

'నెస్ట్'తో ఇంటిగ్రేటెడ్ పీజీ

ఐదేళ్ల కోర్సు.. రూ.5 వేలు స్టయిపెండ్

బేసిక్ సైన్స్ సబ్జెక్టుల్లో కెరీర్‌ను ఎంచుకోవాలనుకునేవారు ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ చదవటం ప్రయోజనకరం. ఈ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష- నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్). దీనికి సంబంధించి ప్రకటన ఇటీవలే విడుదలైంది. దీనిలో అర్హత సాధిస్తే ప్రతిష్ఠాత్మకమైన నైసర్, ముంబయి యూనివర్సిటీల్లో కోర్సులను అభ్యసించే అవకాశం కలుగుతుంది. అంతే కాదు, విద్యాభ్యాసంతో పాటు నెలనెలా స్టైపెండ్ అందుకునే వీలూ ఉంటుంది.

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తిచేసినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. మాస్టర్స్ డిగ్రీ, ఆపై పీహెచ్‌డీ పూర్తిచేస్తే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో శాస్త్రవేత్తలుగా స్థిరపడవచ్చు. విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా అర్హత సాధించవచ్చు. బేసిక్ సైన్సెస్‌లో మాస్టర్స్ చేస్తే అధ్యాపకులుగా స్థిరపడవచ్చు. భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైసర్)లోనూ, ముంబయి యూనివర్సిటీ- అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్స్‌లోనూ అత్యాధునిక పరిశోధక ప్రయోగశాలలు, కంప్యుటేషనల్ సౌకర్యాలున్నాయి. ప్రముఖ శాస్త్రవేత్తలతో విద్యాబోధన నిర్వహిస్తారు. ఈ సంస్థలు బయాలజీ, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, ఫిజిక్స్ మొదలైన సబ్జెక్టుల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో అర్హత సాధించినవారు భారత ప్రభుత్వం నెలకు రూ.5000 చొప్పున అందించే ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్, సమ్మర్ ప్రాజెక్టు కోసం ఏడాదికి అందించే రూ.20,000 పొందటానికి అర్హులు.

నెస్ట్- ప్రవేశపరీక్షకు మన తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ లేదా 10+2ను 2017 లేదా 2018లో పూర్తిచేసిన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ విద్యార్థులు, 2019 పరీక్షలు రాస్తున్న ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ విద్యార్థులు అర్హులు. జనరల్ కేటగిరీ, ఓబీసీ విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో 60% మార్కులుండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడీ విద్యార్థులు 55% మార్కులు సాధించివుండాలి.

ఏ సబ్జెక్టులో ఏవి ముఖ్యం?

గత ప్రశ్నపత్రాలను బట్టి సంబంధిత సబ్జెక్టులో ఎక్కువ దృష్టి సారించాల్సినవి-

బయాలజీ : జనరల్ బయాలజీ, సెల్ బయాలజీ, జెనెటిక్స్, ఎకాలజీ అండ్ ఇవల్యూషన్, బయోటెక్నాలజీ, యానిమల్ ఫిజియాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, డీఎన్ఏ ధర్మాలు, ఆర్‌డీఎన్ఏ టెక్నాలజీ, ట్రాన్స్‌లేషన్, ట్రాన్స్‌క్రిప్షన్ మొదలైనవి.

కెమిస్ట్రీ : ఆర్గానిక్ కెమిస్ట్రీలో జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్‌డ్ రియాక్షన్స్, ఏరోమ్యాటిసిటీ, కార్బోహైడ్రేట్స్, అమైనో యాసిడ్స్, పాలిమర్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో మోల్ కాన్సెప్ట్, సొల్యూషన్స్, సాలిడ్ స్టేట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత అంశాలు. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎస్, పి బ్లాక్ మూలకాలు, డి, ఎఫ్ బ్లాక్ మూలకాలు, మెటలర్జీ మొదలైనవి.

ఫిజిక్స్ : జనరల్ ఫిజిక్స్, ఆప్టిక్స్, మోడరన్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ, మాగ్నటిజమ్, మెకానిక్స్.

మేథమేటిక్స్ : కాల్‌క్యులస్, త్రికోణమితి, కోర్డినేట్ జామెట్రీ, ఆల్జీబ్రా, వెక్టర్స్.

అభ్యర్థులు బట్టీ ధోరణిలో కాకుండా సబ్జెక్టును అవగాహన చేసుకుని విభిన్న అంశాలను అన్వయించగలిగితే నెస్ట్‌లో స్కోరు సాధ్యమవుతుంది. గత ప్రశ్నపత్రాలు (2007-18) వెబ్‌సైట్ (www.nestexam.in) లో ఉన్నాయి.

ప్రవేశపరీక్ష ఎలా?

ఇది ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ప్రశ్నలన్నీ ఆంగ్లమాధ్యమంలో ఉంటాయి. సమయం 3.30 గంటలు.

సెక్షన్-1 : జనరల్ సెక్షన్. ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ అందరికీ ఉంటుంది. నెగెటివ్ మార్కులుండవు. 30 మార్కుల వెయిటేజీ.

సెక్షన్-2 నుంచి సెక్షన్-5: వీటిలో బయాలజీ, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించి ప్రశ్నలుంటాయి. అన్ని సెక్షన్లలోని ప్రశ్నలకు సమాధానం రాసే వీలు విద్యార్థులకు ఉంటుంది. ప్రతి సెక్షన్‌కూ 50 మార్కుల వెయిటేజీ. ఈ సెక్షన్లలో ఎక్కువ మార్కులు సాధించిన మూడింటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఈ విభాగాలకు నెగెటివ్ మార్కింగ్ ఉంది. కొన్ని ప్రశ్నలకు ఒకటికన్నా ఎక్కువ సమాధానాలుంటాయి.

జేఈఈ అడ్వాన్స్‌డ్ స్థాయిలో...

ప్రవేశపరీక్ష నైసర్ స్థాయిలో విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉంటుంది. ప్రశ్నలు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఉంటాయి. అందుకని మొదట సిలబస్, పరీక్ష విధానాలపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలి. ప్రాథమిక అంశాలతో సన్నద్ధత ప్రారంభించాలి. అందుకు తెలుగు అకాడమీ, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు మేలు. ఆపై టాపిక్‌లవారీగా రిఫరెన్స్ పుస్తకాల ద్వారా అధ్యయనం చేయాలి. ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నవారు ఇప్పటినుంచే ప్రతిరోజూ 5-6 గంటలు కష్టపడి చదవాలి. వీలైనన్నిసార్లు సిలబస్‌ను పునశ్చరణ (రివిజన్) చేయాలి. మాదిరి ప్రశ్నల సాధన, కంప్యూటర్ ఆధారిత నమూనా ప్రశ్నపత్రాలను ప్రయత్నించాలి.

వెబ్‌సైట్ : www.nestexam.in

విశాలాంధ్ర బిజినెస్

-106.41 ▼ సెన్సెక్స్	-33.55 ▼ నిఫ్టీ	30 ▲ బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	300 ▲ వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
36,106.50	10,821.60	30,050 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	30,750 / ప్రొద్దుటూరు 30,750 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	40,300 (కిలో (రూపాయల్లో))	41,500 / ప్రొద్దుటూరు 42,049 (కిలో (రూపాయల్లో))	70.41

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటామోటార్స్	185.75	1.48
టైటన్ కంపెనీ	966.70	1.44
ఐషర్ మోటార్స్	20,556.10	1.31
యూపీఎల్	780.00	1.09
ఎన్టీపీసీ	149.55	1.06

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
హెచ్‌పీసీఎల్	232.90	-2.55
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,565.90	-2.24
భారతీ ఎయిర్‌టెల్	285.05	-1.83
గ్రాసిం	837.45	-1.81
ఐఓసీ	131.80	-1.59

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	70.46	70.41
యూరో	80.67	81.21
పౌండ్	89.68	89.71
ఆస్ట్రేలియా డాలర్	50.48	50.61
సింగపూర్ డాలర్	51.96	52.11

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,750	32,887
చెన్నై	30,750	32,887
బెంగళూరు	30,200	32,299
ముంబై	31,280	33,454
విజయవాడ	-	33,000
విశాఖపట్నం	30,750	32,170
ప్రొద్దుటూరు	30,750	31,290

ముడి చమురు	61.44

నష్టాలో సెన్సెక్స్

ముంబై: లాభాల్లో నమోదైన మార్కెట్లు నాలుగో రోజు నష్టాల్లో ముగిసాయి. ప్రారంభంలో ఫ్లాట్‌గా ప్రారంభమైన మార్కెట్లు ఆద్యంతం అదే బాటలో కొనసాగాయి. ఆయిల్, బ్యాంకింగ్,ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల షేర్లు నష్టాల్లోనమోదవడం, డిసెంబరు త్రైమాసిక ఫలితాల కోసం మదుపరులు వేచిచూడడంతో మార్కెట్లు నష్టాల్లో నమోదైనట్లు తెలుస్తోంది. రూపాయి బలహీనపడటంకూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్ల మ్యూట్ సెంటిమెంట్, ముడి చమురు ధరల పెరుగుదల స్థానిక స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. బిఎస్ఇ సెన్సెక్స్ 106.41 పాయింట్లతో 0.29శాతంతో 36,106 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.55పాయింట్లతో 0.31శాతంతో 10,821 పాయింట్ల వద్ద నమోదైంది. బిఎస్ఇ మిడ్‌కాప్, స్మాల్ కాప్ సూచీలు 0.5శాతం, 0.2శాతం పెరిగాయి. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో కన్సూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, యుటిలిటీస్, క్యాపిటల్ గూడ్స్ లాభాల్లో నమోదుకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకెక్స్, ఎనర్జీ, ఫైనాన్స్ నష్టాల్లో నమోదయ్యాయి. టాటామోటార్స్, ఎన్‌టిపిసి, టైటాన్, బజాజ్‌ఆటో, ఐషర్ మోటార్స్, ఎమ్ అండ్ ఎమ్, ఇన్ఫోసిస్ మేజర్ గెయినర్స్ కాగా ఇండస్ ఇండ్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, ఓఎన్‌జీసీ, మారుతి సుజికి, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌పిసిఎల్ టాప్ లూజర్స్‌గా ఉన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో యూరోపియన్ స్టాక్స్ నష్టాల్లో నమోదుకాగా యుఎస్ ఫ్యూచర్స్,ఆసియ షేర్లు, జపానీస్ మార్కెట్లు అదేబాటలో కొనసాగాయి. యుఎస్ ఆయిల్, బ్రెంట్ క్రూడ్ ధరలు 1శాతం పైగానష్టపోయాయి. యెన్,ట్రజరీస్ లాభాల్లో నమోదయ్యాయి. సౌత్‌కొరియా,హాంగ్‌కాంగ్ షేర్లు నష్టాల్లో ముగిసాయి.షాంఘై షేర్లు ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఆగస్టునుండి ఆఫ్‌షోర్ యువాన్ షేర్లు నిర్దిష్టంగా ముగిసాయి. జపాన్ టాపిక్స్ ఇండెక్స్ 1.2శాతం నష్టాల్లో ముగిసింది. ఆసియా పసిఫిక్ ఇండెక్స్ 0.5శాతం నష్టపోయింది. ఎస్‌అండ్‌పి ఫ్యూచర్స్ 0.5శాతం నష్టపోయింది.

విమాన ప్రయాణికులకు ఉచిత బీమా



న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులకు ఉచితంగా ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను అందిస్తున్నట్లు భారతీయ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) బుధవారం ప్రకటించింది. ఐఆర్‌సీటీసీ ద్వారా విమాన టికెట్లు బుక్ చేసుకునే వారికి ఉచితంగా రూ.50లక్షల మేర ప్రయాణబీమా కల్పిస్తామని ప్రకటనలో పేర్కొంది. దేశీయ, అంతర్జాతీయ విమానాల్లో టికెట్లు బుక్ చేసుకునే వారికి ఈ సదుపాయం వర్తించనుంది. ప్రయాణికులు ప్రమాదవశాత్తూ చనిపోవడం లేదా శాశ్వతంగా అంగవైకల్యానికి గురైతే వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడం కోసం ఈ బీమా ఇవ్వనున్నట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది. ఐఆర్‌సీటీసీతో కలిసి భారతీ ఏఎక్స్‌ఏ జనరల్ ఇన్సూరెన్స్ సంయుక్తంగా ఈ బీమా కల్పించనున్నాయి. ఈ బీమా వన్ వే లేదా రౌండ్ ట్రిప్ చేసే ప్రయాణికులకు వర్తిస్తుంది. బీమా ప్రీమియంను ప్రయాణికుల తరఫున ఐఆర్‌సీటీసీ చెల్లిస్తోంది.

• ట్రంప్ వైఖరిపై..

పెట్టుబడిదారుల్లో చీలిక

రిక్ నగిన్



అమెరికా గుత్తాధిపత్య పెట్టుబడిదారీ పాలక వర్గం చీలికలో గత డిసెంబరులో రక్షణమంత్రి జిమ్ మాటిస్ రాజీనామా ఒక గుణాత్మకమైన నూతన దశకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇప్పుడు వారి విదేశీ, స్వదేశీ విధానాలను ప్రాథమికంగా విభేదిస్తున్న రెండు విశిష్ట గ్రూపులున్నాయి.మొదటిది, ట్రంప్ అనుకూలవర్గం. వారి విదేశాంగ విధానం ఒంటరితత్వం. నాటో నుండి, సిరియా, ఆఫ్ఘనిస్థాన్, ఉక్రెయిన్, సాధ్యమైతే కొరియాలో అపరిష్కృత యుద్ధం నుండి అమెరికా సామ్రాజ్యవాదం ఉపసంహరించుకోవాలని వారు కోరుతున్నారు. ట్రంప్ దేశీయ విధానం క్షుణ్ణంగా ప్రజాస్వామ్య వ్యతిరేక, జాత్యహంకార, అవినీతిలో కూరుకుపోయి, ఫాసిజం దిశగా పయనించేది. శిలాజ ఇంధనం పరిశ్రమ, పర్యావరణం పట్ల నిర్లక్ష్యంతో కూడినది. రెండవది, డెమోక్రటిక్ పార్టీ నాయకత్వం మట్టిస్, లేట్‌సెన్ వంటి సంప్రదాయక రిపబ్లికన్‌లతో సహా ట్రంప్ వ్యతిరేక గ్రూపు. జాన్ మెక్కెయిన్, రాబర్ట్ ముల్లర్‌లకు విరుద్ధాభిప్రాయాలు న్నాయి. వారి విదేశాంగ విధానం జోక్యం దారీతనంతో కూడినది. దాన్ని పరిరక్షించే లక్ష్యం. సాధ్యమైతే, అమెరికా సామ్రాజ్యవాదం, దాని ప్రచ్ఛన్నయుద్ధ మిత్రులతో ప్రపంచ ఆధిపత్యాన్ని విస్తరించాలని కోరుకునేది. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నది వారి స్వదేశీ విధానం. ఈ రెండు వర్గాల ఘర్షణ ఫలితం అనిశ్చితం. బడా వాణిజ్య సంస్థల్లోని ఫాసిస్టు శక్తులు, అమెరికా కాంగ్రెస్ లోని అనేక మంది రిపబ్లికన్లు, సెనేట్‌లోని కొద్దిమంది బేషరతు మద్దతు ట్రంప్‌కుంది. మతపరమైన హక్కుతో సహా పునాది ఓటర్ల జీఓపీలోని ఒక గణనీయ వర్గం మద్దతు కూడా ట్రంప్‌కుంది. ట్రంప్ వ్యతిరేక సంకీర్ణానికి విస్తృత మద్దతుంది. అయితే అది వైట్ హౌస్‌ను నియంత్రించలేదు. పాలకవర్గంలోని ఈ చీలికపట్ల కమ్యూనిస్టులతో సహా సాధారణ శ్రామికవర్గం, పెరుగుతున్న ప్రగతిశీల వర్గం, పునాది ఉద్యమాల వైఖరి ఏవిధంగా ఉంటుందన్నది ప్రశ్నార్థకం. ప్రజాస్వామ్యం, శాంతి కొరకు మనం ధృడంగా నిలబడాలన్న అమెరికన్ల వైఖరి సుస్పష్టం. మరోవిధంగా చెప్పాలంటే గుత్తాధిపత్య పెట్టుబడిదారీ వర్గం రెండు గ్రూపులకూ వ్యతిరేకంగా అమెరికన్లు స్వతంత్రంగా ఉండాలి. ట్రంప్ స్వదేశీ ఫాసిస్టు మార్గపు విధానాలను, ట్రంప్ వ్యతిరేక సంకీర్ణం జోక్యందారీ, ప్రభుత్వ మార్పు విధానాలను అమెరికన్లు వ్యతిరేకించాలి. కోటీశ్వరుల ఆధిపత్యంలో కాక శ్రామికవర్గ నియంత్రణ కింద సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ కోరుకుంటున్నది. అదేవిధంగా ప్రపంచ దేశాల మధ్య కేవలం శాంతి మాత్రమే కాకుండా శ్రామికవర్గ అంతర్జాతీయతను కమ్యూనిస్టు పార్టీ కాంక్షిస్తున్నది. సోషలిజం నిర్మాణానికై పోరాడుతున్న ప్రజలు, దేశాలకు సంఘీభావంగా నిలబడాలని కమ్యూనిస్టు పార్టీ కోరుకొంటున్నది. ఆ ప్రయత్నాల దిశగా అమెరికా సామ్రాజ్యవాద శత్రుత్వ విధానాలకు చరమగీతం పాడాలని కూడా కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయపడుతున్నది. దీనికి సంబంధించి విదేశీ జోక్యం నుండి ఉపసంహరించాలన్న ట్రంప్ విధానాలను అమెరికా కమ్యూనిస్టు పార్టీ స్వాగతిస్తున్నది. అమెరికా రాజకీయ పరిస్థితి అస్థిరంగా వుంది. నిజమైన చరిత్ర నిర్మాతలయిన అమెరికా ప్రజల్లో ప్రతిఘటన ఉద్యమాలు పెరుగుతున్నాయి. ప్రగతిశీల శక్తుల నిర్మాణానికి, శాంతి, ప్రజాస్వామ్యం, పర్యావరణ పరిరక్షణ, సోషలిజం వ్యాప్తి చెందడానికి శాయశక్తులా కృషి చేయాలి.

విజ్ఞానం

తీవ్ర నిర్లక్ష్యానికి గురైన

పిల్లల భవిష్యత్తు ప్రమాదమే...



బాల్యంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైనవారు యుక్తవయసులో ఆత్మహత్యకు ప్రేరేపితమవుతున్నట్లు మాంచెస్టర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ వేల్స్ మానసిక శాస్త్రవేత్తలు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన 68 అధ్యయనాల్లో 18ఏళ్ల వయసువారిని 2,62,000 మందిపై చేసిన అధ్యయనంలో చిన్నతనంలో నిర్లక్ష్యానికి గురైనవారిలో యుక్తవయసులో రెండులేక మూడు రెట్లమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తేలింది. మరింత ఎక్కువగా హింసకు గురైనవారు ఐదురెట్లు ఆత్మహత్యలకు గురైనట్లు తెలుస్తోంది. యుక్తవయస్కుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు చిన్నతనంలో వివిధరకాల హింసకు గురైనట్లు తెలుస్తోంది.

లిథియం-అయాన్ బ్యాటరీలే చౌక



2050 నాటికి సోలార్ లేక గాలి ద్వారా లభ్యమయ్యే విద్యుత్తును లిథియం -అయాన్ ఆధారిత బ్యాటరీల్లో నిల్వ చేయడం భవిష్యత్తులో చౌకైన విద్యుత్తు నిల్వలుగా మారనున్నాయని ఇంపీరియల్ కాలేజి లండన్ తాజాగా వెల్లడించింది. ఈ కాలేజి అధ్యయన బృందం హైడ్రోఎలక్ట్రిసిటీ విధానం ద్వారా అతి పెద్ద ఎత్తులో నిల్వచేసే విధానంతోపాటు వివిధరాకాల సాంకేతిక విధానాలతో విద్యుత్తును నిల్వచేసేందుకు అయిన ఖర్చుపై అంచనావేయగా, ఈ విషయం వెల్లడైంది. వీటిని నిల్వచేసే ఎనర్జీ గ్రిడ్‌లు ఎటువంటి అవాంతరాలు రాకుండా వినియోగదారులకు సౌలభ్యంగా ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం అమలులో ఉన్న అత్యంత చౌకైన హైడ్రోఎలక్ట్రిసిటీ విధానం ద్వారా స్టోర్ చేయడమే.. లిథియం-అయాన్ సాంకేతికత ద్వారా ఖర్చులో కూడా రానున్న రెండు దశాబ్దాలకాలంలో మరింత తగ్గుదల ఉన్నట్లు గ్రాంథమ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ ది సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ పాలసీ ఎట్ ఇంపీరియల్ అధ్యయనకారుడు ఆలివర్ స్మిమిడ్ తెలిపారు.

ప్లేస్టోర్ నుంచి 85 యాప్స్ తొలగింపు



ముంబై: మొబైల్‌లో డేటా భద్రతకు హాని కలిగించే 85 యాప్‌లను గూగుల్ తమ ప్లేస్టోర్ నుంచి తొలగించింది. గేమ్, టీవీ, రిమోట్ కంట్రోల్ సిమ్యులేటర్ కేటగిరీలో ఉండే యాడ్‌వేర్ (Adware) ఫ్యామిలీకి చెందిన ఈ యాప్‌ల వల్ల డేటా భద్రతకు భంగం కలుగుతుందని ఇటీవల కొన్ని అధ్యయనాల్లో తేలింది. దీంతో ఈ యాప్‌లను గూగుల్ తొలగించింది.'ఈ యాడ్‌వేర్ ద్వారా మొబైల్‌లో ప్రకటనలు ఫుల్ స్క్రీన్‌లో కన్పిస్తాయి. ఆ సమయంలో ఈ యాప్‌లు ప్రకటన కింద దాగి మొబైల్ బ్యాక్‌గ్రౌండ్‌లో పనిచేస్తాయి. వీటి వల్ల ఫోన్ డేటా భద్రతకు భంగం కలుగుతుంది' అని ట్రెండ్ మైక్రో ఇటీవల తన బ్లాగ్‌లో పేర్కొంది. ఈ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్‌లో 90లక్షల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపింది. గూగుల్ తొలగించిన 85 యాప్‌లలో 'Easy Universal TV Remote' యాప్ ఒకటి. దీన్ని అత్యధికంగా 50 లక్షల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిసింది. ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఓపెన్ చేసిన తర్వాత డిస్‌ప్లే పైన ఫుల్ స్క్రీన్ పాప్-అప్ బాక్స్ వస్తుంది. దానిపై Continue అనే బటన్‌ను నొక్కితే మళ్లీ యాడ్‌తో కొత్త పేజీ వస్తుంది. అలా చాలా సార్లు Continue బటన్ వచ్చిన తర్వాత యాప్ క్రాష్ అవుతుంది. అయితే మనం ఈ యాడ్‌లను చూస్తున్న సమయంలో సదరు యాప్ బ్యాక్‌గ్రౌండ్‌లో పనిచేస్తూ ఉంటుంది. మొబైల్ స్క్రీన్ అన్‌లాకింగ్ యాక్షన్‌ను తస్కరించి మనం ఫోన్‌ను లాక్ చేసిన ప్రతిసారీ ప్రకటనలు చూపిస్తూ ఉంటుంది. వీటి వల్ల మొబైల్ డేటాకు ప్రమాదమని అధ్యయనాలు చెప్పడంతో గూగుల్ వీటిని తొలగించింది. ఈ జాబితాలో స్పోర్ట్ టీవీ, టీవీ రిమోట్, ఏసీ రిమోట్, లవ్ స్టికర్, రిమోట్ కంట్రోల్, పార్కింగ్ గేమ్, వరల్డ్ టీవీ తదితర 85 యాప్‌లు ఉన్నాయి.

యూసీ బ్రౌజర్ కొత్త వర్షన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: థర్డ్ పార్టీ మొబైల్ యూసీ బ్రౌజర్ తాజాగా తన సరికొత్త వర్షన్‌ను ఆవిష్కరించింది. 12.9.7 పేరిట విడుదలైన ఈ వర్షన్ మరింత వేగంగా పనిచేస్తుందని, మరింత కంటెంట్‌ను అందిస్తుందని సంస్థ భారత జనరల్ మేనేజర్ డామన్ జి వెల్లడించారు. ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ కంపనీగా తమ సంస్థ మార్కెట్ అత్యంత కీలకమని, ఈ అప్‌డేట్ భారత కస్టమర్లకు డేటాను మరింత ఆదా చేస్తుందన్నారు.

స్టార్టప్.. ప్యాకప్..!

- 82 శాతం కంపెనీలు ప్రయోజనాలకు దూరం
- పన్ను మినహాయింపు ఉన్నా ఐటీ నుంచి నోటీసులు
- మూసివేతే శరణ్యమంటున్న యాజమాన్యాలు



న్యూఢిల్లీ: కేంద్రం ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన స్టార్టప్ పథకం ప్యాకప్ దిశగా పయనిస్తోంది. 'స్టార్టప్ కంపెనీలు నెలకొల్పండి. దానికి కావాల్సిన తోడ్పాటును మేమందిస్తాం. అన్ని రకాల ప్రయోజనాలను చేకూరుస్తాం' అని మోడీ సర్కారు ఇచ్చిన మాటలు.. చేతల్లోకొచ్చేసరికి చతికిలబడ్డాయి. స్టార్టప్ పథకాన్ని 2016 జనవరిలో ప్రారంభించినా.. 82 శాతం కంపెనీలకు ఇప్పటివరకు ప్రయోజనాలు అందకపోవడం గమనార్హం. మోడీ సర్కారు తీరుతో దివాళా తీశామని, స్టార్టప్ కంపెనీలను మూసివేయడం తప్ప మరో గత్యంతరం లేదని 24 శాతం మంది యజమానులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సోషల్ మీడియా కేంద్రంగా పనిచేస్తున్న 'లోకల్ సర్కిల్స్' సర్వేలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. లోకల్ సర్వీస్.. దాదాపు 15 వేల స్టార్టప్ కంపెనీలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలపై సర్వే నిర్వహించింది. స్టార్టప్ కంపెనీలను ప్రారంభించే వారికి అనేక ప్రయోజనాలను కేంద్రం ప్రకటించింది. ఇంక్యుబేషన్ సదుపాయంతో పాటు నిధులు, పన్ను మినహాయింపు కల్పించనున్నట్టు వెల్లడించింది. కాగా.. 82 శాతం కంపెనీలకు ఇప్పటికీ ఎలాంటి ప్రయోజనాలు అందకపోవడంతో పాటు 32శాతం పరిశ్రమలకు ఆదాయపు పన్నుశాఖ నుంచి నోటీసులు రావడం గమనార్హం. బకాయి పడ్డ పన్ను చెల్లించాల్సిందేనని సదరు కంపెనీలకు ఐటీ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై స్టార్టప్ కంపెనీల యాజమాన్యాలు తీవ్ర వ్యతిరేకత తెలపడంతో కేంద్రం కొన్ని చర్యలు చేపట్టింది. కంపెనీలు బకాయి పడ్డ పన్నులను బలవంతంగా వసూలు చేసే చర్యలు చేపట్టవద్దని ఐటీ శాఖను కేంద్రం డిసెంబర్ 24న ఆదేశించింది. కేంద్రం ఆదేశాలిచ్చినా కొన్ని కంపెనీలకు ఐటీ నుంచి నోటీ సులు అందడంపై సదరు యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా యి. స్టార్టప్ విధానం దివాలా తీయడంతో 24 శాతం కంపెనీలను మూసివేస్తామని యాజమాన్యాలు ప్రకటించాయి. అంతేకాక.. 5 శాతం కంపెనీలను అమ్మేయనున్నట్టు యజమానులు సూచనప్రాయంగా తెలిపారు.

మార్కెట్లో డుబుయిస్ కొత్త ప్రొడక్టులు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఎక్స్‌కాలిబర్ స్పైడర్ అల్టిమేట్ కార్బన్ పేరిట ప్రపంచ మార్కెట్‌లో రోజర్ డుబుయిస్ మరో కొత్త చేతి గడియారాన్ని విడుదల చేసింది. వినూత్న సాంకేతికత, ఆధునికత దీని సొంతమని సంస్థ నేడొక ప్రకటనలో వెల్లడించింది. ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలతో వీటిని తయారు చేశామని వెల్లడించింది.

మారుతీ కార్ల ధరలు పెంపు



న్యూఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ బుధవారం కార్ల ధరల పెంపుపై ప్రకటన చేసింది. కొన్ని మోడల్ కార్ల ధరలు రూ.10 వేల దాకా పెంచుతున్నట్లు వెల్లడించింది. పెరిగిన ధరలు ఈరోజు నుంచే అమలవుతాయని తెలిపింది. ముడి సరకు, విదేశీ మారకం రేట్లు పెరిగిన కారణంగా ధరలు పెంచాల్సి వచ్చినట్లు వెల్లడించింది. జనవరి 10 నుంచి ధరలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. అయితే, ఏయే మోడల్ కార్లపై ధరలు పెరుగుతాయనేది మారుతీ వెల్లడించలేదు. ఆల్టో 800 నుంచి ప్రీమియం ఎస్-క్రాస్ మోడల్స్ ధరలు రూ.2.53 లక్షల నుంచి రూ.11.45 లక్షల (ఎక్స్-షోరూం దిల్లీ) దాకా ఉన్నాయి.

అమెజాన్ అలెక్సాలో 'రియల్' సమాచారం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సింగపూర్‌కు చెందిన డిజిటల్ రియల్ ఎస్టేట్ కంపెనీ ఎలేరా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, హౌసింగ్ డాట్ కామ్. ప్రాప్ టైగర్ డాట్ కామ్, మకాన్ డాట్ కామ్ రియల్ ఎస్టేట్ సమాచారాన్ని అందించేందుకు అమెజాన్ అలెక్సాను వేదికగా ఎంచుకున్నాయి. ఈ నూతన వేదికతో ఇకపై వినియోగదారులు అత్యంత సులభంగా హౌసింగ్ న్యూస్, ప్రాప్ గైడ్, మకాన్ ఐక్యూ రెస్పెక్టివిటీ మొదలైన సమాచారాన్ని తెలుసుకోవచ్చునని సీపీటీఓ గ్రూప్ ప్రతినిధి రవి భూషణ్ తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిస్తూ ఎప్పటికప్పుడు వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తుంటామని అన్నారు.

ఘనంగా 'డాక్టర్ అగర్వాల్స్' వార్షికోత్సవం...!



గుంటూరు: వైద్య నగరం గుంటూరులో గురువారం డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో టాలీవుడ్ నటి రెజీనా కస్సాండ్రా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంటెర్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లకు ఫిబ్రవరి 28 వరకూ ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఆసుపత్రిలో ఇప్పుడు ఈహెచ్‌ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ, ఈఎస్ఐ తదితర నగదు రహిత సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈ వేడుక సందర్భంగా ఉచితంగా 25 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు, గుంటూరు పరిసర గ్రామాల్లో 100 కంటి పరీక్ష శిబిరాలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సర్జన్ డాక్టర్ మేఘనా కూరపాటి మాట్లాడుతూ, నాణ్యమైన కంటి సంరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. ఆప్తమాలజిస్ట్ డాక్టర్ టీవీ సులోచనా రాణి మాట్లాడుతూ, విస్తృత శ్రేణి సేవలతో అత్యుత్తమ సంరక్షణను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

31 నుంచి జాతీయ ఆక్వా ఎక్స్‌పో


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆక్వా ఎక్స్ ఇండియా-2019 జాతీయ ఎక్స్‌పోకు హైదరాబాద్ మరోసారి వేదికైంది. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు మూడు రోజులపాటు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ ఎక్స్‌పో జరగ నుంది. 60 వేల మందికి పైగా హాజరు కానున్న ఈ ఎక్స్‌పోలో 100 దేశాలకుపైగా ప్రతినిధులు, 300 మంది ఎగ్జిబిటర్లు పాల్గొనున్నారు. ఈ ఎక్స్‌పోకు సంబంధించిన బ్రోచర్‌ను హైదరా బాద్‌లో విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఫిషరీస్ హబ్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని మత్స్య శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా చెప్పారు. అందుకే హైదరా బాద్‌లో ఆక్వా ఎక్స్‌పోను ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ ఫిషరీస్ రైతులు ఈ ఎక్స్‌పోలో పాల్గొనాలని, ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఫిషరీస్‌కు సంబంధించిన పరిజ్ఞానాన్ని జాతీయ ఎక్స్‌పోలో ప్రదర్శించనున్నారని వివరించారు. ఆక్వాక్స్ ఇండియా ప్రదర్శనలో అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొనే రైతుల అనుభవాలు మన రైతులు తెలుసుకొని మరింత రాణించాలని ఫిషరీస్ శాఖ కమిషనర్ సువర్ణ సూచించారు. సదస్సులో చేప పిల్లల ఉత్పత్తి, బ్రీడ్ ఎంపికపై, కొత్తగా ఈ ఫీల్డ్‌లోకి రావాలనుకునే యువతకు శిక్షణ ఇవ్వనున్నామని ఇండియా ఫిషరీస్ సొసైటీ చైర్మన్ రామచంద్ర రాజు తెలిపారు.

తెలంగాణ విద్యార్థులకు ఎస్తోనియాలో చదువు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం తెలంగాణ విద్యార్థులకు దక్కబోతుంది. ప్రపంచం లోనే టాప్ వర్సిటీల్లో సైబర్ సెక్యూరిటీ, ఐటీ విద్యను చదివే అవకాశం కలగ బోతుంది. ఈ మేరకు తెలంగాణ ఉన్నత విద్యామండలితో కలిసి పనిచేసేందుకు ఉత్తర ఐరోపాలోని ఎస్తోనియా దేశం ముందుకు వచ్చింది. త్వరలోనే ఇరు ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదరనుంది. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డితో ఎస్తోనియా రాయబారి రహియో క్రుప్వ్ భేటీ అయ్యారు. గతంలోనే కేటీఆర్‌ను కలిసిన రహియో టీ-హబ్ ఏర్పాటుతో పాటు ఐటీకి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని గమనించి తెలంగాణ ప్రభుత్వంతో కలసి పని చేయాలని నిర్ణ యించుకున్నారు. దీంతో గురువారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో సమావేశమయ్యారు. ఎస్తోనియా.. ఉత్తర ఐరోపాలోని చిన్న దేశం. అక్కడ సైబర్ సెక్యూరిటీ, టెక్నాలజీ విద్యను అందించే ప్రపంచంలోనే టాప్ 100 యూనివర్సిటీలు ఉన్నాయి. ఆ యూని వర్సిటీల్లో మన విద్యార్థులు ఉన్నత విద్యను తక్కువ ఖర్చుతో అభ్యసించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వంతో ఎస్తోనియా అధికారులు సమావేశమై చర్చించారు. త్వరలోనే ఉన్నత విద్యామండలి బృందం ఎస్తోనియాలో పర్యటించి ఒప్పందం చేసుకోనున్నట్లు పాపిరెడ్డి చెప్పారు.

దారి కనుక్కోండి



మాష్టారిలో మార్పు



సిరిపురం హైస్కూలులో రామనాథం మాస్టార్ పని చేస్తున్నారు. ఆయనకు చేతివాటం ఎక్కువ. స్కూల్లోని చాక్‌పీసులు దగ్గర్నుంచి పెన్సిళ్లు, పుస్తకాలు.. ఏవి కనిపిస్తే అవి తస్కరిస్తుండేవాడు. వాటిని తీసుకొచ్చి ఇంట్లో భద్రపరుస్తుండేవాడు. ఒకరోజు భార్య వాటిని గురించి అడిగింది. 'అబ్బే ఏంలేదు.' అంటూ తప్పించుకున్నాడు. కానీ భార్య మాత్రం 'నేను రోజూ మిమ్మల్ని గమనిస్తున్నాను. రోజుకో వస్తువు తీసుకొస్తున్నారు. ఇవి దొంగతనంగా తీసుకొస్తున్నారని నేను అర్థం చేసుకొన్నాను. నలుగురికి నీతులు చెప్పాల్సిన మీరే ఇలా చేయడం బాగోలేదు. ఇక నుంచైనా ఈ పద్ధతి మానుకోండి' అని సలహా ఇచ్చింది.

రామనాథం మాస్టారు భార్య మాటలు అసలు పట్టించుకోలేదు. రోజూ తన పనిలో తాను ఉంటూనే ఉన్నాడు. రోజూ ఏదో ఒక వస్తువు ఇంటికి దొంగతనంగా తెస్తూనే ఉన్నాడు.

కొన్ని రోజుల తర్వాత హెడ్మాష్టరు రామనాథం చేస్తున్న పనులు గమనించాడు. కానీ జాగ్రత్తగా బుద్ధి చెప్పాలని తగిన సమయం కోసం వేచి చూడసాగాడు. ఒకరోజు హెడ్మాస్టర్ గారి రూమ్‌లో ఉన్న రిజిస్టరులో సంతకం పెట్టి, టేబుల్ మీదున్న పేపర్ వెయిట్‌ను జేబులో వేసుకున్నాడు. దాన్ని లోపలికి వస్తున్న హెడ్మాష్టరు గమనించాడు. అప్పటికి చూడనట్లు ఉన్నాడు. క్లాసుకు వెళ్లబోతున్న రామనాథం మాస్టారిని కాసేపు ఆగమని చెప్పాడు. ఇంతలో రాజేష్, కిరణ్ అక్కడికి వచ్చారు. హెడ్మాష్టరుతో 'మీరు ఈ ఉదయం రమ్మని చెప్పారు. అందుకే వచ్చాం' అన్నారు.

అప్పుడు హెడ్మాష్టరు, రామనాథం వైపు చూసి 'మాస్టారు వీరిద్దరూ సెవెన్త్ క్లాసు విద్యార్థులు. ఈ రాజేష్ పెన్ను బెంచీ కింద పడితే కిరణ్ తీసుకున్నాడట. తనది ఇవ్వమని అడిగితే కిరణ్ ఇవ్వడంలేదట. నిన్న ఏం చేయాలో అర్థంగాక ఈ రోజు ఉదయం రమ్మని చెప్పాను. ఇంకో విషయం తప్పులెంచేటప్పుడు, ముందు మనం తప్పులు చేయకుండా ఉండాలి. నేను కూడా గతంలో కొన్ని తప్పులు చేశాను. అందుకే వీరికి తీర్పు చెప్పే అర్హతలేదు. మీరు తీర్పు చెప్పి, వీరిద్దరికీ న్యాయం చేయండి' అని చెప్పారు.

హెడ్మాష్టరు మాటలతో ఆలోచనలో పడ్డాడు రామనాథం మాస్టారు. తాను చేసిన తప్పులు తెలుసుకున్నాడు. వెంటనే ప్యూనును ఇంటికి పంపించి స్కూల్లో దొంగలించిన వస్తువులన్నింటిని తెప్పించి హెడ్మాష్టరుకు అందజేసి క్షమాపణలు చెప్పాడు. ఇక ముందు ఎలాంటి తప్పు చేయనని మాట ఇచ్చాడు.

'రామనాథంగారు పిల్లలు తప్పుచేస్తుంటే సరిదిద్దాల్సిన మనం తప్పుచేయకూడదు. మీలో మార్పు రావడం కోసమే ఈ నాటకం ఆడించాను. ఆ ఇద్దరు విద్యార్థులు ఎలాంటి దొంగతనం చేయలేదు.' అని చెప్పాడు హెడ్మాష్టరు.

ఏదేమైనా రామనాథంలో వచ్చిన మార్పునకు భార్యతోపాటు హెడ్మాష్టరు ఎంతో సంతోషించారు.

చెప్పుకోండి చూద్దాం

1. చక్కనైన దొరగారికి పసుపు టోపీలు రెండట. ఇంతకీ ఆ దొర ఎవరు?
2. మా ఎర్రగుంట మావయ్య మాట్లాడకపోయినా రోజంతా నోరెళ్లబెట్టే ఉంటాడు. మావయ్య పేరేంటో చెప్పుకోండి.
3. అందరినీ వణికించే అతడు భయపడేది భాస్కరుడికే.. ఎవరతను?
4. కాళ్లూ చేతులూ లేకపోయినా మెడకో తాడు కట్టుకుని నీళ్లలో దూకే మొనగాడెవ్వరూ?
5. నీళ్లులేని చెరువులో లతలు పూయవూ, కాయవూ.. అలాగని ఎండిపోవు కూడా. వాటి పేరు చెబుతారా?

జవాబులు : 1. బరాణీ 2. పోస్ట్‌బాక్స్ 3. చలి 4. బిందె 5. చేతిలోరేఖలు

అతి పురాతనమైన కంప్యూటర్



గ్రీకు ద్వీప తీరప్రాంతంలో మునిగిపోయిన ఓ ఓడకు చెందిన శిథిలాల నుంచి 1900 ప్రాంతంలో గజ ఈతగాళ్లు గడియారాన్ని పోలిన ఓ కంచు పరికరాన్ని వెలికితీశారు. ప్రాచీన లిపితో కానవచ్చే ఈ పరికరం పోర్టబుల్ టైప్‌రైటర్‌లో దాదాపు సగం ఉంటుంది. ఈ పరికరాన్ని వెలికితీసిన డెబ్బై అయిదు సంవత్సరాల తర్వాత అంటే 1975లో దీని ఉపయోగాన్ని కనుక్కోగలిగారు. కంప్యూటర్ లాంటి ఈ పరికరం ద్వారా సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాల గమనాలను తెలుసుకునేవారట. దీనిలో చక్రాలతో పనిచేసే గేర్లు, డయల్స్ ఉండడం విశేషం. అప్పట్లో సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని ప్రాచీన గ్రీస్‌లో ఇలాంటి పరికరాన్ని ఎలా రూపొందించారన్నది నేటికీ ఎవరూ చెప్పలేకపోతున్నారు.

గాలివాన వచ్చేటప్పుడు...

మబ్బుల్లో పుట్టి భూమిని తాకే మెరుపుల తాకిడికి ఏటా అనేక వందలమంది ప్రాణాలు కోల్పోతుంటారు. నీటి మేఘాలన్నీ, విద్యుచ్ఛక్తికి నిలయాలే. ఈ మేఘాల పైభాగం అధిక ధనావేశాన్ని కలిగి ఉంటే, అడుగు భాగం తక్కువ రుణావేశాన్ని కలిగి ఉంటుంది. ఈ రుణావేశపు విద్యుచ్ఛక్తే మెరుపు రూపంలో భూమిని చేరేందుకు తహతహలాడుతుంది. ఎక్కడికైనా వెళ్తూ మార్గమధ్యంలో గాలివానలో చిక్కుకుంటే ఏ చెట్టుకిందో తలదాచుకుంటాం. మెరుపుల తాకిడి నుంచి తప్పించుకోవడానికి చెట్టు కింద నిలబడడం మంచిదా, లేక ఏ కారులోనో కూర్చోవడం మంచిదా? కారులోనే మంచిది.. ఎందుకంటే.. మేఘాల నుంచి దూసుకువచ్చే మెరుపు, అతి సమీపమార్గం నుంచి భూమిపై అన్నిటికంటే ఎత్తుగాఉన్న చెట్టును ముందుగా తాకే అవకాశముంది. ఒకవేళ మెరుపు కారుని తాకిని పక్షంలో కారుకున్న మెటాలిక్ ఫ్రేమ్ విద్యుత్ వాహకంగా పనిచేసి, మెరుపును భూమికి చేరుస్తుంది.



గడ్డి మొలవకపోతే..

చైనా అధీనంలో ఉన్న మన అక్సాయిచిన్ గురించి పార్లమెంటులో ఓసారి చర్చ జరుగుతోంది. ఆ సందర్భంలో.. ఆ ప్రాంతంలో గడ్డి కూడా మొలవదని నెహ్రూ సమర్థించుకున్నారు.

వెంటనే మహావీర్ త్యాగి లేచి 'ఇదిగో నా బట్టతలను చూడండి! దీనిమీద ఒక్క వెంట్రుక కూడా లేదు. అంతమాత్రాన శత్రువుకు తలవంచినా ఫర్లేదా?' అని ప్రశ్నించారు. సభలో విరిసిన నవ్వులకు నెహ్రూ కూడా గొంతు కలిపారు.

ప్రప్రథమం



మొట్టమొదటిగా తయారైన రిఫ్రిజిరేటర్ పేరు 'డొమెల్రే'.1913లో చికాగోలో తయారైన ఈ ఫ్రిజ్‌ను చెక్కతో రూపొందించడం విశేషం.



ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి. - అబ్రహాం లింకన్

నేను ఎక్కడికెళ్లినట్లు?

రాజు చురుకైన కుర్రాడు. తన పరిజ్ఞానాన్నంతా వినియోగించి తెలివిగా ప్రశ్నలు అడుగుతుంటాడు. ఒకరోజు వాళ్లింటికి రాము వచ్చాడు. 'నిన్న రాత్రి కలలో నేను మధ్య భారతదేశానికి వెళ్లొచ్చాను.. అంటే ముంబాయి, త్రివేంద్రం, ఢిల్లీ, భోపాల్ నగరాల్లో ఎక్కడికి వెళ్లినట్లు' అని అడిగాడు రాజు. కాస్త సమయం తీసుకున్నా రాము సరైన సమాధానమే చెప్పాడు. అది ఏమిటి?

జవాబు : భోపాల్

'పేట' రొటీన్ యాక్షన్ డ్రామా



రజనీకాంత్ అంటేనే' స్టైల్ ఆఫ్ మేనరిజమ్స్. తెరపై తనదైన మార్కు స్టైల్‌ని క్రియేట్ చేసిన ఆయన ఆ స్టైల్‌తో దేశ వ్యాప్తంగా అభిమానగణాన్ని సొంతం చేసుకున్నారు. అయితే అలాంటి ఆయన నుంచి గత కొంత కాలంగా ఆ స్థాయి సినిమా రావడం లేదు. దానికి కారణం ఆయన ఎంచుకున్న కథలే. ఇటీవల వచ్చిన కబాలి, కాలా, 2.ఓ చిత్రాల్లో ఆయన మార్కు మేనరిమ్స్‌తో పాటు రజనీ నుంచి మాస్ ప్రేక్షకులు కోరుకునే మాసీవ్ సన్నివేశాలు చూపించే ఆస్కారం చిక్కలేదు. ఆ లోటును తీర్చే సినిమా వస్తే, బాషా, నరసింహ చిత్రాల్లో కనిపించిన రజనీ మళ్లీ అదే స్థాయిలో తెరపై కనిపిస్తే అభిమానులకు పండగే. అలాంటి కథతోనే పేట చిత్రాన్ని తెరకెక్కించానని మొదటి నుంచీ చెబుతూ వస్తున్న దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు తన మాటను నిలుపుకున్నాడా?, రజనీ అభిమానిగా తనకు లభించిన అరుదైన అవకాశాన్ని ఎంత వరకు సద్వినియోగం చేసుకున్నాడు. ఈ గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చిన పేట రజనీ అభిమానుల్ని ఏ స్థాయిలో ఆకట్టుకుంది? అనే విషయాలు తెలియాలంటే కథలోకి వెళ్లాల్సిందే.

కాళీ (రజనీకాంత్) ఓ రాజకీయ నాయకుడి రికమెండేషన్ వల్ల ఓ హాస్టల్ వార్డెన్‌గా చేరతాడు. అక్కడ జరుగుతున్న సమస్యల్ని తనదైన స్టైల్లో పరిష్కరించడం మొదలుపెడతాడు. ఆ తరువాత ఓ ప్రేమ జంటని కలుపుతాడు. ఈ క్రమంలో కాలేజీ విద్యార్థులను ర్యాగింగ్‌కి గురిచేస్తున్న మైఖేల్, అతని తండ్రితో వైరం మొదలవుతుంది. కాళీని అంతమొందించాలని ప్రయత్నించిన ఆ గ్యాంగ్ స్కెచ్ వేస్తుంది. ఈ క్రమంలో అదే గ్యాంగ్ ముసుగులో హాస్టల్‌లోకి ఉత్తరప్రదేశ్ గ్యాంగ్ చొరబడుతుంది. అప్పుడే తను కాళీ కాదని, అతని అసలు పేరు పేట వీర అని తెలుస్తుంది. పేట వీరకు, ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌కు వున్న వైరమేంటి? అక్కడి రాజకీయ నాయకుడు సింగ్ అలియాస్ సింహాచలం పేటను ఎందుకు చంపాలనుకుంటున్నాడు? పేట అసలు కథేంటి? అనేది తెరమీద చూడాల్సిందే.



ఇలాంటి పాత్రల్లో తనదైన మేనరిజమ్స్‌ని జోడించి రక్తికట్టించడంలో రజనీ మాస్టర్. అయితే తన స్థాయికి తగ్గ నటనను ఈ సినిమా ఏ మాత్రం రాబట్టుకోలేకపోయింది. పాత పద్ధతిలోనే పగా ప్రతీకారాల నేపథ్యంలో సాగే కథ కావడంతో రజనీ హైవేపే విజిలేస్తూ సాఫీగా ప్రయాణం సాగించినంత ఈజ్‌తో పేట పాత్రని సునాయాసంగా చేసేశారు. అయితే సినిమాలోని తొలి భాగంలో రజనీ నడిచే తీరు, యువకుడిగా ఆయన పలికించిన హావభావాలు, సిమ్రన్‌తో సాగే లవ్‌ట్రాక్ ఆకట్టుకుంటాయి. సిమ్రాన్ కనిపించేది తక్కువ సమయమే అయినా ఫరవాలేదనిపించింది. చాలా కాలంగా రజనీతో కలిసి నటించాలని ఎదురు చూసిన త్రిషకు ఎలాంటి ప్రాధాన్యత లేకపోవడం కొంత నిరాశ కలిగిస్తుంది. సింహాచలం పాత్రలో బాలీవుడ్ విలక్షణ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ, జీతూగా విజయ్ సేతుపతి, మాలిక్‌గా శశికుమార్, మేఘా ఆకాష్‌లు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. అనురుధ్ అందించిన పాటలు సినిమా కథనానికి స్పీడు బ్రేకర్లుగా మారినా నేపథ్య సంగీతం మాత్రం ఆకట్టుకునే స్థాయిలో వుంది. ఓరిస్సా స్థాయినిక కళాకారులతో చేయించి బీజియమ్స్ నేపథ్య సంగీతానికి ప్రాణం పోశాయి. రజనీ సినిమాకు ఓ సగటు అభిమాని ఎలాంటి నేపథ్య సంగీతాన్ని కోరుకుంటాడో ఆ స్థాయి సంగీతాన్ని అందించడంలో అనిరుధ్ సక్సెస్ అయ్యాడు. తిరునవుక్కరసు ఛాయాగ్రహణం, సన్ పిక్చర్స్ నిర్మాణ విలువలు ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తాయి.

రజనీ మార్కు మేనరిజమ్స్, స్టైల్స్‌తో కూడిన సినిమా చూడాలని చాలా కాలంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. బాషా, నరసింహా చిత్రాల తరువాత రజనీకాంత్ నుంచి ఆ స్థాయి మాస్ అంశాల మేళవింపుతో సినిమా వచ్చి చాలా కాలమవుతున్నది. ఇటీవల వచ్చిన కబాలి, కాలా చిత్రాల్లో కొంత మేరకు రజనీ స్టైల్‌ని చూపించే వీలున్నా కథ డిమాండ్ చేయకపోవడంతో అభిమానుల కల కలగానే మిగిలిపోయింది. ఇక ఆ తరువాత శంకర్ దర్శకత్వంలో వచ్చిన 2.ఓ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇందులో రజనీ మార్కును చూపించడం అసాధ్యం. దాంతో రజనీ అభిమాని అయిన కార్తీక్ సుబ్బరాజు పేట పైనే అంతా ఆశలు పెట్టుకున్నారు. దానికి తగ్గట్టే పేటలో రజనీ మార్కు మెరుపులు వుండేలా కథ రాసుకున్నాడు. ఓ అభిమానిగా రజనీని ఎలా చూడాలనుకున్నాడో అదే స్థాయిలో ప్రజెంట్ చేయడానికి ప్రయత్నించాడు. తొలి భాగంలో జరిగే హాస్టల్ ఎపిసోడ్ నరసింహా, బాషా, ముత్తు చిత్రాలను గుర్తు చేస్తుంది. సిమ్రన్, రజనీల మధ్య వచ్చే సన్నివేశాలు ఇరవైఏళ్ల క్రితం రజనీని మరోసారి కళ్లముందుంచుతాయి. ప్రథమార్థం మొత్తం రజనీ అభిమానుల్ని మెప్పించే కోణంలో ఆలోచించిన కార్తీక్ సుబ్బరాజు కథను పాత పంథాలోనే నడిపించాడు. దీంతో తొలి భాగం పాస్ మార్కులతో గట్టెక్కేసింది.

అయితే ద్వితీయార్థాన్ని మాత్రం అంత ప్రభావ వంతంగా రాసుకోలేకపోయాడు. పగా ప్రతీకారాల నేపథ్యంలో సాగే రొటీన్ యాక్షన్ డ్రామాకు రజనీ మేనరిజమ్స్‌ను జోడించి నడిపించాలనుకున్నాడు కానీ ద్వితీయార్థం కథ సీరియస్ టర్న్ తీసుకోవడంతో ఎక్కడా రజనీ మార్కు మెరుపులు కనిపించడానికి ఆస్కారం లేకుండా పోయింది. ద్వితీయార్థం మొత్తాన్ని ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్, పగ, ప్రతీకారాలతో నింపేయడం కబాలి చిత్రాన్ని గుర్తు చేస్తుంది. దానికి భిన్నంగా కార్తీక్ ఆలోచన చేసి కథని ఇంకొంత భిన్నంగా రాసుకుని వుంటే పేట ఫలితం మరోలా వుండేది. ఆ విషయంలో ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్న దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు విఫలమయ్యాడని చెప్పక తప్పదు. అయితే గత కొంత కాలంగా రజనీ మార్కు మేనరిజమ్స్, స్టైల్స్ చూడలేకపోతున్నామే అని భావిస్తున్న వాళ్లకు పేట కొంత ఊరటనిస్తుంది.



ఆకట్టుకుంటున్న 'మణికర్ణిక' పాట

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయ్ జీవితం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మణికర్ణిక'. కంగనా రనౌత్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. క్రిష్ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 'బాహుబలి' దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ ఈ సినిమాకు కథ అందించారు. ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్‌లో కంగన తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. జనవరి 25న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

తాజాగా ఈ చిత్రంలోని 'విజయీభవ..' అనే పాటను విడుదల చేశారు. ఇందులో కంగన తన సైన్యంలో ధైర్యం నింపుతూ యుద్ధానికి సిద్ధం చేస్తూ కనిపించారు. వెండితెర ఝాన్సీరాణి హీరోయిజాన్ని చక్కగా చూపించారు. ప్రసూన్ జోషి ఈ చిత్రానికి సాహిత్యం అందించారు. శంకర్-ఇషాన్-లాయ్ పాటకు సంగీతం అందించారు. శంకర్ మహదేవన్ పాటను ఆలపించారు. ఈ పాటకు యూట్యూబ్‌లో మంచి స్పందన లభిస్తోంది.

'మణికర్ణిక' సినిమా షూటింగ్ సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంది. కొన్ని కారణాల వల్ల ఈ సినిమా దర్శకత్వ బాధ్యతల్ని క్రిష్‌తోపాటు కంగన కూడా చూసుకున్నారు. ఆమె దాదాపు 40 రోజుల షూటింగ్‌కు దర్శకత్వం వహించారు. కంగనతో అభిప్రాయభేదాల వల్ల నటుడు సోనూసూద్ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు.

'మహానాయకుడు' కోసం ఎదురుచూస్తున్నా : బ్రాహ్మణి



'యన్.టి.ఆర్-కథానాయకుడు' సినిమా తనకు ఎంతో నచ్చిందని నారా బ్రాహ్మణి అన్నారు. రెండో భాగం 'మహానాయకుడు' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఆమె తండ్రి నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్ పోషించిన ఈ సినిమా బుధవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. తెలుగు వారి అభిమాన నటుడు ఎన్టీఆర్ జీవితం ఆధారంగా దర్శకుడు క్రిష్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాకు మంచి స్పందన లభించింది. నందమూరి కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు ఏఎమ్‌బీ సినిమాస్ మల్టీప్లెక్సులో ఈ చిత్రం ప్రత్యేక ప్రదర్శనను వీక్షించారు. ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమాలోని ప్రతి నటుడు, నటి అద్భుతంగా నటించారు. నా చిన్నతనంలో మా తాతయ్యతో ఎక్కువ సమయం గడపలేదు. ఆయన ప్రతిరోజు బిజీగా ఉండేవారు. మా నాన్న ఎన్టీఆర్ పాత్రలో జీవించారు' అని అన్నారు. ఎన్టీఆర్ కుమార్తె లోకేశ్వరి మాట్లాడుతూ.. 'చాలా ఏళ్ల తర్వాత మా నాన్నను మళ్లీ స్క్రీన్‌పై చూసినట్లు అనిపించింది. ఈ క్రెడిట్ మొత్తం బాలకృష్ణ, క్రిష్‌లకే దక్కుతుంది' అని చెప్పారు. 'మా తాతయ్య గురించి నాకు పెద్దగా తెలియదు. కానీ ఈ సినిమా ద్వారా ఆయన గురించి చాలా తెలుసుకున్నా. ఎన్టీఆర్‌గా బాలయ్య బాబాయి, తండ్రి హరికృష్ణ పాత్రలో కల్యాణ్‌రామ్ అద్భుతంగా నటించారు' అని నందమూరి సుహాసిని అన్నారు.

హైదరాబాద్‌లో జయలలిత బయోపిక్ మేజర్ షెడ్యూల్

1960 మధ్య కాలంలో టాప్ హీరోయిన్‌గా అలరించిన అందాల నటి జయలలిత. తెలుగు, తమిళం, కన్నడ,భాషలలో దాదాపు 140కి పైగా సినిమాలు చేసింది పురుచ్చితలైవీ. భారత రాజకీయాలలోను ముఖ్య భూమిక పోషించిన జయలలిత దాదాపు 14 సంవత్సరాలకి పైగా తమిళనాడు ముఖ్యమంత్రి బాధ్యతలని నిర్వర్తించింది. తమిళ తంబీలు అమ్మగా పిలుచుకొనే జయలలిత కొద్ది రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో కన్నుమూశారు. ప్రస్తుతం ఆమెపై బయోపిక్ రూపొందించేందుకు పలువురు దర్శకులు సన్నాహాలు చేస్తున్నారు.

ఏ.ఎల్. విజయ్, ప్రియదర్శిని, భారతీ రాజా, వైబ్రీ మీడియా,ఆదిత్య భరద్వాజ్ తదితరులు కొన్నాళ్ళుగా జయలలిత బయోపిక్ స్క్రిప్ట్‌ని రూపొందించే పనిలో ఉన్నారు. అయితే తమిళ దర్శకురాలు ప్రియదర్శిని ముందుగా తాను 'ది ఐరన్ లేడీ' పేరుతో బయోపిక్ రూపొందిస్తుంది. నిత్యామీనన్ చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తుండగా, ఆమె అచ్చం జయలలిత లుక్‌లో కనిపిస్తుంది. పేపర్ టేల్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకున్నట్టు తెలుస్తుంది. జనవరి 24 నుండి హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో ఈ చిత్ర మేజర్ షెడ్యూల్ జరగనుందని సమాచారం. చిత్రంలో జయలలిత సినీ, పొలిటికల్ జర్నీని ప్రియదర్శిని ఏ విధంగా చూపిస్తుందో అనే దానిపై అంతటా ఆసక్తికర చర్చ నడుస్తుంది.



లాలూ బెయిల్ పిటిషన్ తిరస్కరణ



రాంచీ : ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు జార్ఖండ్ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం గురువారం తిరస్కరించింది. పశుదాణా కుంభకోణానికి సంబంధించిన మూడు కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న లాలూ బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ తిరస్కరించినట్టు సీబీఐ న్యాయవాది రాజీవ్ సిన్హా తెలిపారు. ఈనెల 4న లాలూ తరపు న్యాయవాది కపిల్ సిబల్‌తో పాటు సీబీఐ తరపు న్యాయవాది వాదనలు విన్న జార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిల్ ఇవ్వడంపై తీర్పును రిజర్వులో పెట్టింది. లాలూ ప్రస్తుతం రాజేంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో చికిత్స పొందుతున్నారు. 2017, డిసెంబరులో ఆయనను రాంచీ జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

అస్థానా కేసు విచారణ నుంచి తప్పుకున్న సిన్హా



న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా కేసు విచారణ నుంచి ఆ సంస్థ డీఐజీ ఎంకే సిన్హా వైదొలిగారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ కుమార్ వర్మ తిరిగి బాధ్యతలు స్వీకరించిన వెంటనే డీఐజీ సిన్హా నాగపూర్ బదిలీ ఉత్తర్వులను రద్దు చేశారు. అంతేగాకుండా ఆయనకు బ్యాంకింగ్, సెక్యూరిటీస్, ఫ్రాడ్ సెల్ (బీఎస్ఎఫ్‌సీ) బాధ్యతలతోపాటు అస్థానా అక్రమాల కేసు విచారణ బాధ్యతలు చూసే ఏసీ – 3 యూనిట్ బాధయతలను అప్పగించారు. బీఎస్ఎఫ్‌సీ బాధ్యతలు స్వీకరించిన సిన్హా, అస్థానా కేసు విచారణ నుంచి స్వతహాగా తప్పుకున్నట్లు సీబీఐ అధికారికంగా వెల్లడించింది. కేసు విచారణ బాధ్యతలను నిర్వర్తించలేనని ఆయన డైరెక్టర్ వర్మకు కూడా తెలియజేశారు. ఇందుకు వర్మ కూడా సానుకూలంగానే స్పందించినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి.

రాహుల్‌కు మహిళా కమిషన్ నోటీసులు



న్యూఢిల్లీ : ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి జాతీయ మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై 'మోసపూరితమైన, అనైతిక' వ్యాఖ్యలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కమిషన్ ఆయనకు గురువారం నోటీసులు జారీ చేసింది. పార్లమెంటులో రాఫెల్ ఒప్పందంపై తనను రక్షించుకునేందుకు ప్రధాని మోడీకి ఒక మహిళ దొరికారంటూ మంత్రి సీతారామన్ చేసిన ప్రసంగాన్ని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు. సీతారామన్‌జీ, నన్ను కాపాడండి, నన్ను నేను కాపాడుకోలేను అని '56 అంగుళాల ఛాతీగల కాపలాదారు' అడిగారు. రెండున్నర గంటల పాటు ఆమె ఆయనను రక్షించలేక పోయారు. నేను నేరుగా ఓ ప్రశ్న అడిగాను. యస్ లేదా నో అని సమాధానం చెప్పమన్నాను. కానీ ఆమె చెప్పలేదు' అని రాహుల్ ఓ ర్యాలీలో అన్నారు. రాహుల్ వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ తప్పుపట్టింది. ఆయన మహిళలను గౌరవించాలని కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మ వెల్లడించారు. రాహుల్ వివరణ ఇవ్వాలని, నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు చెప్పాలన్నారు. నిర్మలా సీతారామన్ రక్షణ శాఖ మంత్రి అని, ఓ పార్టీ అధ్యక్షుడి నుంచి ఇలాంటి వ్యాఖ్యలను తాము ఊహించలేదని తెలిపారు.

సాహితీవేత్త సహా ముగ్గురిపై దేశద్రోహం కేసు



సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ హిరెన్ గొహెయిన్

గువహటి : పౌరసత్వం (సవరణ) బిల్లుపై అసోం వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరమైన నేపథ్యంలో సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ హిరెన్ గొహెయిన్, సీనియర్ జర్నలిస్టు మంజిత్ మహంత, కేఎంఎస్ఎస్ నేత అఖిల్ గొగోయ్‌పై దేశద్రోహం కేసు నమోదైంది. పౌరసత్వ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 'నాగరిక్ సమాజ్' సభ్యులైన ఈ ముగ్గురిపై లతాసిల్ పోలీసుస్టేషన్‌లో ఐపీసీ 124(ఎ), 120(బి) సెక్షన్ల కింద సుమోటో కేసు నమోదైనట్టు గువహటి పోలీసు కమిషనర్ దీపక్ కుమార్ వెల్లడించారు. 'వారిపై కేసు నమోదైంది. ఈనెల 7న జరిగిన నాగరిక్ సమాజ్ సమావేశంలో వారు ఏం మాట్లాడరన్నది ఆరా తీస్తున్నా' అని ఆయనన్నారు.

మోడీని కలిసిన మలేసియా నేత

న్యూఢిల్లీ : మలేసియా అధికార పార్టీ కియాదిలాన్ రాక్యార్ నేత, పార్లమెంట్ సభ్యుడు అన్వర్ ఇబ్రహీం గురువారం ప్రధాని మోడీని కలిశారు. ప్రపంచ, ప్రాంతీయ విషయాలతోపాటు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. న్యూఢిల్లీలో జరగనున్న ప్రాంతీయ రాజకీయ, వ్యూహాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన దేశానికి వచ్చారు. మలేసియా నేత అన్వర్ వెంట పార్లమెంటు సభ్యులు కేశవన్ సుబ్రమణియన్, ఎస్‌కే రామానాయుడు ఉన్నారు.

తప్పుకున్న జస్టిస్ లలిత్





- 29కి అయోధ్య కేసు విచారణ వాయిదా
- మళ్లీ ధర్మాసనం ఏర్పాటు చేస్తాం : సుప్రీం

న్యూఢిల్లీ : అయోధ్యలోని రామ జన్మభూమి– బాబ్రీ మసీదు స్థల వివాదంపై కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో వాదనలు వినేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఈ ధర్మాసనం గురువారం విచారణ ప్రారంభించింది. అయితే ధర్మాసనంలో ఒకరైన జస్టిస్ యు.లలిత్ విచారణ నుంచి తప్పుకోవడంతో తదుపరి విచారణను జనవరి 29కి వాయిదా వేసింది. ఈ కేసులో కొత్త రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేస్తామని న్యాయస్థానం వెల్లడించింది. అయోధ్య కేసు విచారణ కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ యు.లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. ఈ ధర్మాసనం వాదనలు వినడం ప్రారంభించింది. అయితే బెంచ్‌లో జస్టిస్ లలిత్ ఉండటంపై సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ లలిత్ గతంలో ఇదే కేసులో కల్యాణ్‌సింగ్ తరపున న్యాయవాదిగా వాదించారని, రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ లలిత్ సభ్యులుగా ఉండటమేమిటని ధవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జస్టిస్ లలిత్ విచారణ నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అయోధ్య కేసులో జనవరి 29 నుంచి కొత్త ధర్మాసనం వాదనలు వింటుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లా మధ్య సమానంగా పంపిణీ చేయాలని 2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో సంతృప్తి చెందని పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వ్యక్తులు, ధార్మికసంస్థల తరపున 14 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వ్యాజ్యాలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. 2019 జనవరి మొదటివారంలో ధర్మాసనానికి నివేదిస్తామని గత ఏడాది అక్టోబరు 29న పేర్కొంది. విచారణ నిమిత్తం గత మంగళవారం రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.

సత్వర పరిష్కారం మంచిదే : రిజ్వీ

రామజన్మభూమి–బాబ్రీ మసీదు భూ వివాదంపై విచారణలో ఆటంకాలేమీ ఉండబోవని, వివాదం సత్వర పరిష్కారం హిందూ, ముస్లింలు ఇద్దరికీ మంచిదేనని జాతీయ మైనారిటీ కమిషన్ చైర్‌పర్సన్ సయ్యద్ ఘయోరుల్ హసన్ రిజ్వీ గురువారం అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలలో పది శాతం రిజర్వేషన్ కల్పించినందుకుగాను మోడీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీలకు ఇది ఎంతో లబ్ధి చేకూరుస్తుందని చెప్పారు. బాబ్రీ వివాదం సత్వరమే పరిష్కారమైతే హిందూ, ముస్లింలు ఇద్దరికీ ఉపయోగమేనని అన్నారు.

బులంద్‌షహర్ కేసులో బీజేవైఎం నేత శిఖర్ అగర్వాల్ అరెస్టు



మీరట్ : భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) నేత శిఖర్ అగర్వాల్‌ను అరెస్టు చేసినట్టు పోలీసులు గురువారం తెలిపారు. బులందర్‌షహర్ ఘటనలో నిందితుడిగా ఉన్న శిఖర్ అగర్వాల్ అలియాస్ శేఖర్ (25) 40 రోజులుగా పరారీలో ఉన్నాడు. గురువారం ఉదయం 7.20 గంటలప్పుడు హాపూర్ జిల్లాలోని ఫ్లైఓవర్ వద్ద అతనిని అరెస్టు చేసినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. శిఖర్‌ను విచారిస్తున్నట్టు తెలిపారు. కేసుకు సంబంధించి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు బులంద్ షహర్ ఏఎస్పీ అతుల్ కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. శిఖర్‌ను కోర్టులో హాజరుపరుస్తామన్నారు. శిఖర్‌తో సహా ఇప్పటివరకు 36 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. గోవధకు కేసులో మరో ఏడుగురికి జైలుశిక్ష పడినట్టు వెల్లడించారు.

భానుశాలి హత్యకేసులో సీఐడీ విచారణ



అహ్మదాబాద్ : బీజేపీ మాజీ ఎమ్మెల్యే జయంతి భానుశాలి హత్య కేసులో నిందితుడిగా ఉన్న పార్టీ నేత ఛాబిల్ పటేల్‌పై గుజరాత్ సీఐడీ విచారణ చేపట్టింది. అతను ప్రస్తుతం అమెరికాలో ఉన్నారా లేదా అన్నది ఆరాతీస్తోంది. భానుశాలి హత్యకు గురైన సమయంలో రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లిన వారి వివరాలను అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి సేకరిస్తోంది. భానుశాలి (53) మంగళవారం గుజరాత్‌లోని కచ్ జిల్లా భుజ్ పట్టణం నుంచి అహ్మదాబాద్‌కు రైల్లో వస్తుండగా హత్యకు గురయ్యారు. బుధవారం కచ్‌లోని గాంధీధామ్ రైల్వే పోలీసుస్టేషన్‌లో పటేల్, ఆయన కుమారుడు, ఓ మహిళ సహా నలుగురిని నిందితులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదైంది. పటేల్ కుమారుడు సిద్ధార్థ పటేల్ మీడియాతో మాట్లాడుతూ బిజినెస్ కోసం తన తండ్రి అమెరికాలో ఉన్నట్టు తెలిపారు. అయితే పటేల్ నిజంగా అమెరికాలో ఉన్నారా లేదా అన్న విషయాన్ని గుజరాత్ సీఐడీ–క్రైమ్, రైల్వే ధ్రువీకరించాల్సి ఉంది. దీనిపై సీఐడీ ఎస్పీ భావనా పటేల్ స్పందిస్తూ 'ఎవరు ఏది చెబితే దానిని గుడ్డిగా నమ్మం. పూర్తి విచారణ జరిగిన తర్వాత ఏదేని విషయాన్ని వెల్లడిస్తాం' అని అన్నారు. మొత్తం ఏడుగురితో కూడిన సీఐడీ సిట్ బృందం భానుశాలి హత్య కేసును విచారిస్తోంది.

రాజాంగ్యానికి 'మోడీ' ముప్పు : ముకుల్ వాస్నిక్



నాగ్‌పూర్ : భారత రాజ్యాంగానికి ఏదేని ముప్పు పొంచి ఉన్నదంటే అది ప్రధాని నరేంద్రమోడీ నుంచేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ గురువారం విమర్శించారు. విదర్భలో పార్టీ సంఘర్ష్ యాత్ర ఐదో దశను ప్రారంభించిన సందర్భంగా దీక్షాభూమి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. 'భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్రమోడీ ఇప్పుడు అదే రాజ్యాంగానికి పెనుముప్పుగా మారారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం సంఘర్ష్ యాత్రలో భాగంగా ప్రతి పట్టణానికి, గ్రామానికి వెళతాం. ప్రజలు పూర్తిగా మద్దతిస్తారన్న నమ్మకం నాకుంది' అని ఆయనన్నారు. సంఘర్ష్ యాత్రలో భాగంగా మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ప్రధానంగా తీసుకెళతామని ముకుల్ వాస్నిక్ తెలిపారు.

గే సెక్స్‌కు తావులేదు : ఆర్మీ చీఫ్



న్యూఢిల్లీ : భారత సైన్యంలో గే సెక్స్‌ను అనుమతించేది లేదని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ స్పష్టంచేశారు. భారత సైన్యం ఓ సంప్రదాయ బద్ధమైనదని, అందులో స్వలింగ సంపర్కులకు చాన్స్ ఇచ్చేది లేదని ఆయన తేల్చిచెప్పారు. గే సెక్స్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము అమలు చేయలేమన్నారు. జనరల్ రావత్ గురువారం తన వార్షిక పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గే సెక్స్ ఆర్మీలో నిషిద్ధమని, అదే సమయంలో ఆర్మీ చట్టానికి అతీతమేమీ కాదని జనరల్ రావత్ అన్నారు. వ్యభిచారంపై కోర్టు తీర్పుపై స్పందిస్తూ సైన్యం ఓ సంప్రదాయబద్ధమైనదని, ఆర్మీలో అలాంటివి జరగడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని ఆర్మీ చీఫ్ చెప్పారు.

ముంబైలో మూడోరోజు కదలని బస్సులు



- మెస్మా, ఇతర అణచివేత చర్యలు
- పట్టించుకోని బెస్టు ఉద్యోగులు
- ప్రయాణికుల ఇక్కట్లు
- సమస్యల పరిష్కారానికి డిమాండు

ముంబై : దేశ ఆర్థిక రాజధాని ముంబైలో వరుసగా మూడో రోజు కూడా బస్సులు కదలలేదు. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉద్యోగుల నిరవధిక సమ్మెతో నగరానికి చెందిన పౌర రవాణా వ్యవస్థ బ్రిహన్‌ముంబై ఎలక్ట్రిసిటీ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్టు (బెస్టు)కి చెందిన ఒక్క బస్సు కూడా కదలలేదని అధికారులు తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఆటో రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లు సాధారణ ఛార్జీలకన్నా చాలా రెట్లు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోయారు. సమ్మెకు ముగింపు పలికేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా మహారాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమస్య త్వరలో పరిష్కారమవుతుందన్న ఆశాభావాన్ని బెస్టు సీనియర్ అధికారి వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని, నష్టాలు వస్తున్న సంస్థలను బ్రిహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)లో విలీనం చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం బెస్టు ఉద్యోగులు దాదాపు 32000 మంది మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తు న్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు మహారాష్ట్ర ప్రభు త్వం రంగంలోకి దిగింది. సమ్మె చేస్తున్న బెస్టు ఉద్యోగులపై మహారాష్ట్ర అత్యవసర సేవల నిర్వహణ చట్టం (మెస్మా)ని ప్రయోగించింది. సమ్మెను విరమించి, చర్చలకు రావాలని బెస్టు యాజమాన్యం కోరింది. సమ్మె చేస్తున్న ఉద్యోగులపై బెస్టు యాజమాన్యం కక్షసాధింపు చర్యలు ప్రారంభించింది. తాము కేటాయించిన ఇళ్లను ఖాళీచేయమని 2వేల మందికిపైగా ఉద్యోగులకు నోటీసులను జారీచేసింది. బెస్టు వర్కర్సు యూనియన్ నాయకులు శశాంక్ రావుతో చర్చలు జరిపింది, ఆ చర్చలు ఫలించలేదు. ఆందోళన చేస్తున్న కార్మికుల ప్రతినిధులతో తాము చర్చలు జరుపుతున్నామని బెస్టు రోజువారీ వ్యవహారాలను చూసే కమిటీ చైర్మన్ అశీష్ చంబర్కర్ తెలిపారు. కాగా, శివసేన అనుబంధ బెస్టు కంగార్ సేన నిరసనను ఉపసంహరించుకున్నప్పటికీ బుధవారం 11 బస్సులు మాత్రమే తిరిగాయని అధికారులు చెప్పారు. "సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావంతో మేము ఉన్నాం. సమస్యకు పరిష్కారం లభించాలని ప్రతిఒక్కరూ భావిస్తున్నారు" అని చంబర్కర్ పీటీఐకి తెలిపారు. ఉద్యోగుల సమ్మె కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణికులు తెలిపారు. అటో-రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లు పెద్ద మొత్తంలో చార్జీలు డిమాండు చేస్తున్నారని చెప్పారు. అంధేరి నుంచి వెర్సోవాకు రోజూ ప్రయాణిస్తున్న వినోద్ దూబే మాట్లాడుతూ, "అటో-రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లు సాధారణ చార్జీలకన్నా రెండు,మూడు రెట్లు అధికంగా డిమాండు చేస్తున్నారు. ఆ మొత్తాన్ని చెల్లించేందుకు మేము అంగీకరించకపోతే, రావటానికి వారు తిరస్కరిస్తున్నారు. ఈ దోపిడీని అడ్డుకోవాలి" అని చెప్పారు.

ఎన్‌డీఏ బలోపేతానికి బీజేపీ ద్వారాలు తెరిచే ఉంటాయి

తమిళనాడు నేతలతో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ / చెన్నై : లోక్‌సభ ఎన్నికలకు ముందు పలు పార్టీలు ఎన్‌డీఏను వీడుతుండటంతో బీజేపీ కంగారు పడుతోంది. ఎన్‌డీఏలో బలమైన టీడీపీతోపాటు అసోం గణపరిషత్ (ఏజీపీ), బీహార్‌లో రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌ఎల్ఎస్పీ) ఇప్పటికే కూటమి నుంచి బయటకు వెళ్లిపోయాయి. కూటమిలో కీలకమైన శివసేనసైతం బీజేపీపై నిప్పులు కక్కుతోంది. మరోవైపు చిన్నా చితకా పార్టీలుసైతం ఎన్‌డీఏను వీడేందుకు సిద్ధమవుతున్నాయి. ఎన్‌డీఏ బలహీన పడుతుండటంతో బలోపేతం చేసే బాధ్యతను ప్రధాని మోడీ స్వీకరించారు. ఎన్‌డీఏలో చేరేందుకు అన్ని పార్టీలకు ద్వారాలు తెరుచుకునే ఉన్నాయని, పాత మిత్రులను కూడా కలుపుకుంటా మని మోడీ గురువారం ప్రకటించారు. న్యూఢిల్లీ నుంచి తమిళ నాడులోని అరక్కోణం, కడలూరు, కృష్ణగిరి, ఈరోడ్, ధర్మపురి జిల్లాలకు చెందిన బీజేపీ బూత్‌స్థాయి నాయకులతో మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన 1990లో మాజీ ప్రధాని వాజ్‌పేయి నేతృత్వంలో కూటమి రాజకీయాలను విజయవంతంగా నిర్వహించాన్ని గుర్తు చేశారు. మిత్రుల కోసం బీజేపీ ద్వారాలు ఎప్పటికీ తెరుచుకునే ఉంటాయన్నారు. కూటమిలో ప్రాంతీయ పార్టీలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. కూటమి రాజకీయాలకు వాజ్‌పేయి మార్గదర్శకుడన్నారు. ప్రాంతీయ పార్టీలను కేంద్రం చిన్నచూపు చూస్తోందన్న కాంగ్రెస్ విమర్శలను ఆయన తిప్పికొట్టారు. కూటమిని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.


రాఫెల్‌కు భయపడే వర్మకు ఉద్వాసన

మోడీపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ : రాఫెల్ కుంభకోణం భయంతోనే సీబీఐ చీఫ్ అలోక్‌వర్మను ప్రధాని నరేంద్రమోడీ రాత్రికి రాత్రి ఒక్క సంతకంతో తప్పించారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గురువారం మరోసారి విమర్శించారు. అధికారాలకు కత్తెర వేసి..సెలవుపై పంపుతూ రాత్రికి రాత్రి అలోక్ వర్మపై నరేంద్రమోడీ చర్యలు తీసుకోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టిన నేపథ్యంలో రాహుల్ పైవిధంగా స్పందించారు. సీబీఐ డైరెక్టరు అలోక్‌వర్మ, ఆయన డిప్యూటీ రాకేష్ ఆస్తానా మధ్య జరిగిన వివాదం ఆ సంస్థ పరువును బజారుకీడ్చింది. ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పరస్పరం అవినీతి ఆరోపణలు గుప్పించుకున్నారు. ఆశ్చర్యమేమంటే ఇద్దరూ మోడీకి అత్యంత సన్నిహితులే. సీబీఐ చీఫ్‌ను ప్రధాని హడావుడిగా ఎందుకు తొలగించారు? ఎంపిక కమిటీ ముందు వర్మ కేసును ప్రస్తావించకుండా మోడీ ఎందుకు అడ్డుకున్నారు? వీటన్నింటికీ సమాధానం 'రాఫెల్' అని రాహుల్ ట్వీట్ చేశారు. మోడీ ప్రభుత్వానికి చెంప పెట్టులా సుప్రీంకోర్టు తిరిగి వర్మను సీబీఐ చీఫ్‌గా నియమించిందని తెలిపారు. సీబీఐ డైరెక్టర్ ఎంపికపై అత్యున్నతస్థాయి కమిటీ సమావేశమయ్యేంత వరకూ విధానపర నిర్ణయాలేమీ తీసుకోవద్దని వర్మను సుప్రీం మంగళవారం ఆదేశించింది.

ఐదు బిల్లులకు పార్లమెంటు ఆమోదం

లోక్‌సభ పనిశాతం 47... రాజ్యసభది 27శాతం : తోమర్



న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ 47శాతం పనిచేయగా రాజ్యసభ 27శాతం పనిచేసిందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. కోటా బిల్లుకు ఉభయసభల ఆమోదం లభించడం ప్రత్యేక విజయమన్నారు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా ప్రకారం 16వ లోక్‌సభ అతితక్కువ పనిచేసినట్టు తెలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్ కల్పించేలా 124వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించడం చారిత్రకమని గురువారం పార్లమెంటు ఆవరణలో విలేకరులతో మాట్లాడిన తోమర్ అన్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభలో పెండింగ్ బిల్లులపై శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్ మాట్లాడుతూ 'ట్రిపుల్ తలాక్ బిల్లు, పౌరసత్వం (సవరణ) బిల్లులను పాస్ చేయించేందుకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈసారి పార్లమెంటు సమావేశాల్లో లోక్‌సభలో 12, రాజ్యసభలో 5 బిల్లులు అంటే మొత్తం 17 బిల్లులను ప్రవేశపెట్టగా, ఐదు బిల్లులకు ఉభయ సభల ఆమోదం లభించింది. పెండింగ్‌లో ఉన్న నాలుగు బిల్లులను రాజ్యాసభ వెనక్కు తీసుకుంది. వాటిలో నలందా యూనివర్సిటీ (సవరణ) బిల్లు, ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ (సవరణ) బిల్లు, హోమియోపతి సెంట్రల్ కౌన్సిల్ (సవరణ) బిల్లు ఉన్నాయి.

మహారాష్ట్రలో సీట్ల సర్దుబాటుపై గాంధీ–పవార్ మధ్య కుదరని ఏకాభిప్రాయం



ముంబై : మహారాష్ట్రలోని ఎనిమిది లోక్‌సభ నియోజకవర్గాల్లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్, ఎన్‌సీపీ మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని ఎన్‌సీపీ సీనియర్ నాయకుడొకరు గురువారం తెలిపారు. సీట్ల సర్దుబాటుపై బుధవారం కాంగ్రెస్, ఎన్‌సీపీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, శరద్ పవార్ మధ్య చర్చలు అసంపూర్ణంగా ముగిశాయన్నారు. తదుపరి చర్చలు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ఖర్గే, ఎన్‌సీపీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్ నేతృత్వంలో జరుగుతాయని చెప్పారు. యావత్‌మాల్, వసీమ్, బుల్దానా, నందుర్‌బార్, రావేర్, అహ్మదాబాద్ సహా ఎనిమిది స్థానాలపై రెండు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అలాగే, రత్నగిరి– సింధుదుర్గ్, పూనే స్థానాలను పంచుకోవాలా లేక మార్చుకోవాలా అన్న దానిపై రాజీ కుదరలేదు. న్యూఢిల్లీలోని 6 జన్‌పథ్‌లోని రాహుల్ ఇంట్లో ఇద్దరు అధినేతలు భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలలో సీట్ల సర్దుబాటుతో పాటు ఇతర ప్రధాన అంశాలను చర్చించారు. అయితే మొత్తం 48 నియోజకవర్గాల్లో 25 స్థానాల నుంచి తమ పార్టీ, చిరు మిత్రపక్షాలు పోటీ చేస్తాయని మిగిలిన 23 స్థానాల్లో ఎన్‌సీపీ, కూటమిలోని ఇతర పార్టీలు పోటీచేస్తాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే ఎన్‌సీపీ నేత స్పందిస్తూ 'రాష్ట్రంలో 20 సీట్లను పంచుకునేందుకు ఎన్‌సీపీ అంగీకారం తెలిపింది. మిగతా స్థానాలపై మరో వారంలో స్పష్టత రావచ్చు. ఏకాభిప్రాయం కుదిరిన తర్వాతే ఆయా స్థానాలపై పూర్తి స్పష్టత వస్తుంది' అని అన్నారు. ఇదిలా వుండగా, శివసేన నాయకుడు కూడా పొత్తులో భాగస్వామి కావచ్చునని రెండు పార్టీల వర్గాలు పేర్కొన్నాయి. జాల్నా స్థానం నుంచి కూటమి సభ్యునిగా శివసేన అభ్యర్థి పోటీచేస్తాయని తెలిపాయి. అయితే ఈ విషయాన్ని శివసేన ధ్రువీకరించలేదు.

రూ.20 వేల కోట్ల చెక్కులు పెండింగ్

న్యూఢిల్లీ : ట్రేడ్ యూనియన్ల సమ్మె కారణంగా బ్యాంకింగ్ రంగంలో రూ. 20 వేల కోట్ల మేర చెక్కులు క్లియరెన్స్ కాకుండా పెండింగ్‌లో పడినట్లు బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రకటనలో తెలిపింది. 'బ్యాంకు అధికారులు సమ్మెలో పాల్గొనకపోయినా..కొన్ని బ్రాంచులు పనిచేస్తున్నా, క్యాష్ కార్యకలాపాలు, చెక్కు క్లియరెన్సులు, ప్రభుత్వ ఖజానా కార్యక్రమాలు, ఫారెన్ ఎక్స్ఛేంజ్ వంటి ముఖ్యమైన కార్యక్రమాలు నిలిచిపోయాయి' అని సమాఖ్య ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 8, 9 తేదిలో జరిగిన ట్రేడ్ యూనియన్ల సమ్మెలో బ్యాంకులు కూడా పాల్గొన్న విషయం తెలిసిందే. నెల రోజుల వ్యవధిలో బ్యాంకులు సమ్మెలో పాల్గొనడం ఇది మూడోసారి కావడం గమనార్హం.

పదేళ్లుగా బంగ్లా నుంచి అక్రమ ప్రవేశాలు లేవు

గువహటి (అసోం) : బంగ్లాదేశ్ నుంచి అసోంలోకి పదేళ్లుగా ఎలాంటి అక్రమ ప్రవేశాల్లేవని బీజేపీ గురువారం వెల్లడించింది. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోకి అక్రమంగా చొచ్చుకొచ్చిన వారి వల్ల నష్టం జరుగుతుందన్న వ్యాఖ్యలపై బీజేపీ ఈ వివరణ ఇచ్చింది. పౌరసత్వ సవరణ చట్టం వల్ల కొత్తగా విదేశీయులు ఎవరూ దేశంలోకి వచ్చే అవకాశంలేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి స్వప్ననిల్ బారువా తెలిపారు. గతంలోనే విదేశీయులు దేశంలోకి చొచ్చుకొచ్చారని, తాజా బిల్లుతో వాటిని నిలువరించే అవకాశం ఉంటుందన్నారు. బంగ్లాదేశీయులు దేశంలోకంటే యూరప్, గల్ఫ్, ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు వలసపోతున్నట్లు తెలిపారు. ఆర్థిక కారణాల నేపథ్యంలోనే దేశంలోకి వలసలు తగ్గాయన్నారు. యూరప్ దేశాలలో రోజుకు రూ.3 వేలు వేతనం లభిస్తుండగా, దేశంలో అది రూ.వెయ్యిగానే ఉందన్నారు. తాజా బిల్లు వల్ల బంగ్లాదేశ్ నుంచి కొత్తగా ఒక్కరు కూడా వచ్చే అవకాశంలేదని స్పష్టం చేశారు.



రాష్ట్ర విద్యుత్తు సంస్థలకు జాతీయస్థాయి గుర్తింపు

విశాలాంధ్ర - తిరుపతి : రాష్ట్ర విద్యుత్తు సంస్థల అత్యుత్తమ పనితీరు కారణంగా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని రాష్ట్ర విద్యుత్తు నియంత్రణా మండలి చైర్మన్ జస్టిస్ జి. భవానీప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతిలోని ఏపీఎస్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో గురువారం రాష్ట్ర విద్యుత్తు సలహా మండలి, రాష్ట్ర సమన్వయ మండలి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఇంధనశాఖ సలహాదారు కె.రంగనాథం, ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్లు దినేష్ పరుచూరి, పి. ఉమాపతి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం. నాయక్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ హెచ్.వై. దొర, ఏపీ సీడ్‌కో ఎండీ ఎ.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తమ సంస్థల స్థితిగతులను వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ జి. భవానీప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్తు వినియోగదారుల సంతృప్తి స్థాయి శాతం బాగా పెరిగిందని, తద్వారా గత యేడాది విద్యుత్తు సంస్థలు జాతీయ స్థాయిలో అనేక అవార్డుల ను అందుకున్నాయని వివరించారు. వినియోగదారులకు నిష్పాక్షి కంగా సేవలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలకు పదవీవిరమణ పొందిన న్యాయమూర్తులను చైర్‌పర్సన్లుగా నియమించిందన్నారు. జాతీయ స్థాయి విద్యుత్ నియంత్రణా మండళ్ళ పనితీరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి ద్వితీయ స్థానంలో ఉండడం చాలా గొప్ప విషయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 534 కోర్టు భవనాల్లో ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సహకారంతో విద్యుత్ ఆదా కోసం ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, స్టార్ రేటెడ్ ఏసీలు, ఫ్యాన్లు, వీధిలైట్ల ఏర్పాటు ద్వారా ఏడాదికి 3.2 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఆదా చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు పాఠశాల విద్యార్థుల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించేందుకు వీలుగా 'విద్యుత్ శక్తి పొదుపు, సమర్థ వినియోగం' అంశంపై రాష్ట్ర ఇంధన పొదుపు సంస్థ రూపొందించిన పుస్తకాన్ని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ జి.భవానీ ప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత నియంత్రణా మండలి సభ్యులు పి.రామ మోహన్, పి.రఘు, ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్లు కె.సీతారామరాజు, ఎం.వెంకటేశు పాల్గొన్నారు.





డా. శారద

చల్లపల్లిలోని శారదా దంత వైద్యశాల

శారద డెంటల్ కేర్‌కు జాతీయ గుర్తింపు

విశాలాంధ్ర - చల్లపల్లి : దివిసీమలో ప్రముఖ దంత వైద్యశాల శారద డెంటల్ కేర్‌కు జాతీయ గుర్తింపు లభించింది. ఈ వైద్యశాలకు నేషనల్ ఎక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్, హెల్త్ కేర్ ప్రొవైడర్స్ గుర్తింపు లభించింది. కృష్ణాజిల్లాలో దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొందిన రెండవ వైద్యశాలగా శారదా డెంటల్ కేర్ నిలిచింది. ఇప్పటికే కొన్నేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులకు, జర్నలిస్టులకు ఈ హెచ్ఎస్ ద్వారా ఉచిత దంత వైద్య సేవలను అందిస్తున్నారు. ఆసుపత్రి స్థాపించిన నాటి నుంచి అత్యున్నత పరికరాలతో వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు పొందారు. జాతీయ స్థాయిలో గుర్తింపు లభించటంతో తమపై బాధ్యత మరింత పెరిగిందని, వైద్య సేవల్లో అధునాతన పరికరాలు వినియోగిస్తూ ప్రజలకు మేలైన దంత వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ మాలెంపాటి శారద చెప్పారు. ఈహెచ్ఎస్ వైద్య సేవలను ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడీని అడ్డుకోవడమే లక్ష్యం



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : దేశంలో ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మోడీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకుండా చేయడమే తమ పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కేఏ పాల్ తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. తాము అధికారంలోకి రాగానే రైతులకు పూర్తి రుణమాఫీ, డ్వాక్రా, చేనేత మహిళలకు కూడా రుణమాఫీ చేస్తామన్నారు. నిరుద్యోగులకు రూ. 3 వేలు భృతి, అక్టోబర్ 2 కల్లా అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏపీ ప్రస్తుత బడ్జెట్‌ను అయిదేళ్ళలో డబుల్ బడ్జెట్ చేస్తామన్నారు. మోడీ మళ్లీ ప్రధాని కావడం కల్ల... ఎన్నికలలో లబ్ధి పొందాలనే స్వార్థంతో ఓటమి భయంతో ఏవేవో హామీలు.. దానిలో భాగంగానే అగ్ర వర్ణాల పేదలకు రిజర్వేషన్ ప్రకటన అన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు, జగన్‌లలో ఎవరిని గెలిపించినా బీజేపీని గెలిపించినట్లే అవుతుందన్నారు. బీజేపీకి 150 లోపే సీట్లు వస్తాయి, అందుకే కపిల్ సిబాల్ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, సేవ్ సెక్యులర్ ఇండియా పేరుతో తాము ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేదర సురేష్ కుమార్, బీసీ నాయకులు నమ్మి అప్పారావు పాల్గొన్నారు.

గిరిజనులను టీడీపీ మోసం చేసింది



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ళుగా గిరిజనులను అన్నిరంగాల్లో నిలువునా మోసం చేసిందని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలని గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పాలకిర్తి రవి పిలుపునిచ్చారు. జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మైదాన ప్రాంత గిరిజనులకు శాసనసభ స్థానాలు కేటాయించేలా అన్ని రాజకీయ పార్టీలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. గిరిజనులకు ఎమ్మెల్సీ గానీ, ట్రైకార్ ఛైర్మన్ పదవి కూడా లేకపోవడం దారుణమన్నారు. సుండిపెంట ఐటీడీఏ పీఓ మరుగుదొడ్ల నిర్మాణం కోసం కోటి 60 లక్షల రూపాయలు కేటాయించినా పీఓ ఎక్కడా నిర్మాణాలు చేపట్టకుండా దోచుకున్నారని విమర్శించారు. దీనిపై తక్షణం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిత్యం అవినీతిలో కూరుకుపోయిన సుండిపేట ఐటీడీఏను ప్రక్షాళన చేయకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సబ్సిడీలను మాత్రమే కేటాయించి మిగిలిన నిధులను దిగమింగుతున్నారన్నారు. త్వరలో కర్నూలు జిల్లా గిరిజన ప్రాంతాల్లో పర్యటన అనంతరం విజయవాడ వేదికగా నిరసన, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బీసీ సామాజిక వర్గంలోని కొన్ని కులాలను గిరిజన తెగల్లో కలిపితే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షులు ఉయ్యాల శ్యామ్యూల్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ అనగాని, సుధాకర్, మేడా సురేష్, బందేల కిరణ్‌రాజు, తాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన శనగ రైతు

వర్షాభావ పరిస్థితులను లెక్కచేయకుండా పుడమి తల్లిని నమ్ముకున్న ఆ రైతు గుండె ధైర్యంతో శనగ పంట సాగు చేశారు. సాగునీటి సమస్యతో ఒడిదుడుకులను అధిగమిస్తూ వచ్చినా, కూలీల ఖర్చులకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పశువులకు మేతకు వదిలేశాడు కరవుసీమ అన్నదాత. కర్నూలు జిల్లా మిద్దూరు మండలం చింతలపల్లె గ్రామంలో రైతు ప్రతాప్‌రెడ్డి అయిదు ఎకరాల పొలంలో శనగ వేశాడు. ఎకరాకు కేవలం 20 నుంచి 25 కేజీల వరకు మాత్రమే వస్తుండడంతో గొర్రెలకు వదిలేశాడు. ఏటా ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ళ దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో దారుణ పరిస్థితి నెలకొందని రైతు ప్రతాప్‌రెడ్డి వాపోయాడు. ఇలా ఎంతో మంది శనగ రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కరవు రైతులను తక్షణం ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.

విశాలాంధ్ర - మిద్దూరు



పొలంలో మేస్తున్న పశువులు

పారిశ్రామిక ప్రగతి జాడేదీ?

- రాజధానిలోని పశ్చిమ కృష్ణాలో కానరాని పరిశ్రమలు
- నూతన కంపెనీలు, ఫ్యాక్టరీలకు పడని పునాదులు
- భూముల సర్వేకే పరిమితం
- పత్తి పండుతున్నా టెక్స్‌టైల్స్ పరిశ్రమ ఏదీ
- సుబాబుల్ నిండా ఉన్నా కాగితాల్లోనే కాగిత పరిశ్రమ

విశాలాంధ్ర - నందిగామ : రాష్ట్ర నూతన రాజధాని అమరావతి పరిధిలోని పశ్చిమ కృష్ణాలో పారిశ్రామిక ప్రగతి ప్రకటనలకే పరిమితమైంది. కొత్త కంపెనీలు, ఫ్యాక్టరీలకు పునాదులు పడలేదు. భూ సమస్య, కోర్టు కేసులు, ఇతర చిక్కుముడులతోనే తొలి ప్రభుత్వ పుణ్య కాలం గడిచిపోతోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పారిశ్రామిక ప్రగతి కొత్తపుంతలు తొక్కుతుందంటూ పాలకులు, అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టినా ప్రయోజనం కానరాలేదు. భూతద్దాలు పెట్టి మండలాల వారీ ప్రభుత్వ భూముల వివరాలు తెలుసుకున్న ప్రభుత్వ పెద్దలు భూ సేకరణ చట్టం కింద ఏపీఐఐసీ ద్వారా భూములు తీసుకున్నారు. అనంతరం ఏమైందో ఏమోగానీ పరిశ్రమల ఊసెత్తే నాథులు కనిపించటం లేదు. పరిశ్రమల స్థాపనతో అద్భుతం సృష్టిస్తామన్న పాలక పెద్దలు ముఖం చాటేశారు. కొత్త ఫ్యాక్టరీలతో ఉపాధి దొరుకుతుందని ఆశ పడ్డ నిరుద్యోగ యువతకు నిరాశే మిగిలింది. కంచికచర్ల ప్రాంతంలో రోడ్డు కంకర క్రషర్లు, జగ్గయ్యపేట చుట్టుపక్కల సిమెంట్ పరిశ్రమలు తప్పితే చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేవు. పశ్చిమ కృష్ణా పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తామని రెండు దశాబ్దాలు రాజకీయ నాయకులు ఎన్నికల హామీలు కురిపిస్తున్నా పరిస్థితి షరామామూలే అన్నట్లు ఉంది. ఈ ప్రాంతంలో పత్తి ఎక్కువ పండుతున్నప్పటికీ టెక్స్‌టైల్స్ పరిశ్రమ అభివృద్ధి చెందలేదు. సుమారు లక్ష ఎకరాల్లో సుబాబుల్ సాగవుతున్నా కాగిత పరిశ్రమ కాగితాలకే పరిమితమైంది.

భూములు లాక్కోవడంలో చూపిన శ్రద్ధ ఫ్యాక్టరీల్లో ఏదీ..

నందిగామ మండలం పెద్దవరం రెవెన్యూ పరిధిలో 1,100 ఎకరాల గట్టుపోరంబోకు భూములను ఒకటికి నాలుగుసార్లు అణువణువూ పరిశీలించిన అధికారులు పరిశ్రమల స్థాపనకు అనువుగా ఉందని తేల్చారు. దీనిలో 567 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించారు. మరో 116 ఎకరాలు సుదీర్ఘకాలంగా 118 మంది రైతుల అధీనంలో ఉంది. సాగులోని భూములకు పట్టాలు ఇవ్వాలని పేద రైతులు ఎప్పటి నుంచో పోరాటం చేస్తూనే ఉన్నారు. పాలక పెద్దలకు మాత్రం పేద రైతుల ఆక్రందన వినిపించలేదు. రైతుల అధీనంలోని పొలాలకు పట్టాలు ఇవ్వని అధికారులు ఎకరానికి రూ.5 లక్షల వంతున రూ.5.80 కోట్లు నష్టపరిహారం ముట్టచెప్పి మొత్తం 116 ఎకరాలను స్వాధీనం చేసుకోవచ్చని మండల స్థాయి అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది. 60 ఎకరాలను మాత్రం ఇటీవల టాటా ట్రస్టుకు కేటాయించడంతో ఆ స్థలంలో భూమి చదును పనులు పూర్తయ్యాయి. మిగతా ఎంసీ ల్యాండ్ (మైక్రోసర్క్యూట్) తమదంటూ ఆరుగురు వ్యక్తులు కోర్టుకు వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. చందర్లపాడు మండలం గుడిమెట్ల ప్రాంతంలో 482 ఎకరాలు పంచాయతీ అటవీ, 260 ఎకరాల కొండపోరం బోకు భూములను అధికారులు పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాల్లో సర్వే నంబర్లు 286/1, 350/1లలో 50 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయించడంతో ప్రభుత్వం దీనిని గుర్రాల స్వారీ క్రీడా ప్రాంగణానికి కేటాయించనున్నట్లు తెలుస్తోంది.



సిమెంట్ కర్మాగారం

జగ్గయ్యపేట మండలం జయంతిపురం రెవెన్యూ పరిధిలో 498.93 ఎకరాల ఎంసీల్యాండ్‌ను సినీ నటుడు బాలకృష్ణ సమీప బంధువుకు ఎకరం లక్ష రూపాయల చొప్పున కేటాయించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎంసీల్యాండ్‌ను నాటి కాంగ్రెస్ హయాంలో 2010లో ఎరువుల కర్మాగారం కోసం వీబీసీ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్‌కు కేటాయించారు. యూరియా, అమోనియా, నైట్రిక్ యాసిడ్ తయారుచేసేందుకు రూ.10వేల కోట్ల పెట్టుబడితో నెలకొల్పే ఈ కర్మాగారంలో నాలుగు వేల మందికి పైగా ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు. విద్యుత్ అవసరాల కోసం 67.5 మెగావాట్స్ ప్లాంట్ పెట్టాలని ఆలోచించారు. కాలుష్యం లేని గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా పర్యావరణ అనుమతులు వచ్చాయి. 2015 అక్టోబరు 5న ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరిగింది. ఎంసీ ల్యాండ్‌ను వైఎస్ హయాంలోనే తమకు కేటాయించారని తెలుపుతూ ఒక సంస్థ కోర్టును ఆశ్రయించడంతో పనుల ప్రారంభానికి ఆటంకాలు ఏర్పడ్డాయి.

ప్రోత్సాహం అవసరం

చిన్న చిన్న పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. శాశ్వత ప్రణాళి కల రూపకల్పనతో బాటలు వేయాలి. వేల కోట్లు ఖర్చు చేస్తున్నా చిన్న పారిశ్రామిక వేత్తలకు చేయూత అందించటం లేదు. అధికారులు, పాలకులు ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలను చైతన్యపర్చాలి. పరిశ్రమ పెట్టేందుకు ముందుకొచ్చే వారిని గుర్తించి ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి. మౌలిక వసతులు కల్పించాలి.

హరి, కీసర

మౌలిక వసతులు కరవు..

చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో ఒకటి రెండు చిన్న తరహా పరిశ్రమలు వెలిసినా కనీస మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే మెటీరియల్‌ను తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు, రహదారులు లేవు, డ్రెయినేజీ, నీటి సదుపాయం లేకపోవటంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావటం లేదనే విమర్శలు ఉన్నాయి.

మరో జూట్‌మిల్ లాకౌట్ !

- అర్ధరాత్రి మిల్లుకు నోటీస్ అంటించిన యాజమాన్యం
- రోడ్డునపడ్డ కార్మిక కుటుంబాలు



విశాలాంధ్ర - విజయనగరం : విజయనగరంలో మరో జూట్ పరిశ్రమకు లాకౌట్ ప్రకటించారు. ఈ ఏడాది పండగను ఆనందంగా జరుపుకుందామని భావించిన కార్మిక కుటుంబాల్లో విషాదం నెలకొంది. అర్ధరాత్రి యాజమాన్యం ఎవరికీ చెప్పకుండా తీసుకున్న నిర్ణయంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల జూట్ మిల్‌కు బుధవారం అర్ధరాత్రి లాకౌట్ ప్రకటించినట్లుగా మిల్లు బయట నోటీసులు అంటించారు. ఉదయం నోటీసులు చూసిన కార్మికులు ఆందోళన చెందారు. ఉత్పత్తి విషయంలో గత కొంతకాలంగా కార్మికులకు, యాజమాన్యానికి మధ్య చర్చలు జరుగుతున్నాయి. మిల్లు ఉత్పత్తి తగ్గడంతో ఆశించిన స్థాయిలో లాభాలు రావడంలేదని యాజమాన్యం చెబుతోంది. ఈ నేపథ్యంలో కార్మికులు తమపై పనిఒత్తిడి పెరుగుతోందని, దీనిని గమనించాలని యాజమాన్యానికి సూచించారు. దీంతో ఇరువర్గాల మధ్య అసంతృప్తి నెలకొందని తెలుస్తోంది. ఈనేపథ్యంలో నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యం మిల్లును మూసేందుకే నిర్ణయించుకుంది. అర్ధరాత్రి సమ యంలో మిల్లుకు లాకౌట్ ప్రకటించి నోటీసుల ద్వారా తన నిర్ణయాన్ని ప్రకటించింది. దీంతో కార్మికులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. పండగ సమయంలో వేతనాలు కూడా ఇవ్వకుండా ఇలా అర్థాంతరంగా మిల్లుకు లాకౌట్ విధించడం అన్యాయమంటున్నారు. మిల్లును మూసివేశారనే వార్త తెలియడంతో నెల్లిమర్ల పరిసర ప్రాంతాల్లో విషాదం నెలకొంది. గతంలో చాలాకాలం మిల్లును మూసివేసి తిరిగి 2009లో తెరిచారు. ఇప్పుడు మరోసారి మూసివేశారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



పీఏసీఎస్ ఉద్యోగుల ర్యాలీ

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వానికి రైతుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదని, రైతులకు ప్రభుత్వానికి సంధానకర్తలుగా వ్యవహరిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగులు సమస్యల పరిష్కారానికై 25 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్ అన్నారు. ప్రాథమిక సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులు వేతన సవరణ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం విజయవాడ రైల్వేస్టేషన్ నుండి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గత కొన్ని రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షల ముగింపు సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో గఫూర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం పీఆర్‌సీ ఇచ్చారని, మరలా ఆ ఉద్యోగులు 35 శాతం పెంచమని అడుగుతున్న పరిస్థితుల్లో ఎప్పుడో 10 సంవత్సరాల క్రితం పీఏసీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన వేతన సవరణను ఇప్పుడు కేవలం 10 శాతం పెంచాలని కమిటీ సిఫార్సు చేయడం దారుణమన్నారు. గ్రాట్యూటీ చట్టం ప్రకారం సర్వీసులోని ప్రతి ఏడాదికి 15 రోజుల వేతనం గ్రాట్యూటీ ఇవ్వాల్సిఉండగా కేవలం రూ.లక్ష, రెండు లక్షలతో సరిపెట్టుకోమని చెప్పడం సరి కాదన్నారు. గత 25 రోజులుగా పీఏసీఎస్ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే మంత్రులు, అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే కార్మిక సంఘాలన్నిటినీ కూడగట్టి ఉద్యోగులకు మద్దతుగా నిలబడతామని హామీనిచ్చారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగులు అడిగినవిధంగా కమిటీ సిఫార్సుల్లో మార్పులు చేసి జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ, డీసీసీబీ 5వ కేడర్ ఖాళీలలో కమిటీ సిఫార్సు చేసిన 25 శాతానికి బదులు 50 శాతం సీనియార్టీ ప్రాతిపదికపై ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణం వారి సమస్యలపై ప్రభుత్వం స్పందించి చర్చించాలన్నారు.




అద్దంకి-నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

తులసి రైతు తిరుగుబాటు

- అద్దంకిలో రైతుల రాస్తా రోకో
- మోసగించిన 'జైకిసాన్'పై విచారణ చేయాలి
- అండగా నిలిచిన ఏపీ రైతు సంఘం నేత కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర - అద్దంకి : రైతులను నమ్మించి తులసి పంట వేయించి మోసం చేసిన హైదరాబాదుకు చెందిన జైకిసాన్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా అద్దంకి, దర్శి నియోజకవర్గాల పరిధిలోని అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ, పంగులూరు, ముండ్ల మూరు, తాళ్లూరు మండలాల్లో తులసి పంట సాగుచేసి మోసపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అద్దంకిలో రైతులు నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ జైకిసాన్ పేరు పెట్టుకున్న హైదరాబాదుకు చెందిన బోయిన శ్రీనివాసరావు తులసి సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని, తామే కొనుగోలు చేస్తామని, విత్తనాలు, ఎరువులు తామే ఇస్తామని రైతులను నమ్మించి 1,200 ఎకరాలలో విత్తనాలను రూ. 20లక్షల వరకు అమ్ముకున్నారన్నారు పంట చేతికి వచ్చాక కనిపించకుండా పోయాడన్నారు. శ్రీనివాసరావుపై, అతనికి సహకరించిన అధికా రులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థ గురించి తెలుసుకోకుండా ప్రచారం చేయడాన్ని చూస్తే అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రైతులకు నష్టపరిహారం అందే వరకు ఏపీ రైతు సంఘం బాధిత రైతులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సాయి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హనుమారెడ్డి, రైతు సంఘం నాయకులు గొల్లపూడి వెంకటేశ్వర్లు, పనకా రామాంజనేయులు, సుంకర అంజిరెడ్డి, భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, సీపీఐ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఫిబ్రవరిలో కళింగాంధ్ర ఉత్సవాలు

విశాలాంధ్రబ్యూరో - శ్రీకాకుళం : కళింగాంధ్ర ఉత్సవాలను ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో నిర్వహించనున్నారు. కళింగ ప్రాంత చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాలపై ప్రజల్లో అవగాహన కోసం జిల్లా యంత్రాంగం, రాష్ట్ర భాషా సాంస్కృతిక మండలి సంయుక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తోంది. కలెక్టర్ కె.ధనంజయరెడ్డి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. కోడి రామమూర్తి స్టేడియం ప్రధాన వేదికగా ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. కళింగ దేశ రాజధానిగా విరాజిల్లిన శ్రీముఖలింగంతోపాటు కళింగపట్నం, కళింగ చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజేయు ఘట్టాలను ప్రదర్శిం చాలని కలెక్టర్ పేర్కొన్నారు. చారిత్రక అంశాలు ప్రతిబింబించే విధంగా ఉండాలని, కళింగ కాలం నాటి చరిత్ర, కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, వస్త్రాలంకరణ, ఆహార అలవాట్లు, అప్పటి ప్రజలు వినియోగించిన పనిముట్లు, ఆరాధనా విధానాలు, కళలు, ఆటలు, పాటలకు స్థానం కల్పించాలని ఆయన అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలోనూ ప్రాచీన కళలకు పెద్దపీట వేయాలని ఆయన సూచించారు. కళింగాంధ్ర చారిత్రక ఘట్టాలు ప్రస్ఫుటితం కావాలన్నారు. కవులు, స్వాతంత్ర్యసమర యోధులు, కళాకారులు, క్రీడాకారులు, మల్లయోధుల జీవిత చరిత్రను పొందుపరచాలన్నారు. జిల్లా సంస్కృతి సంప్రదాయాలు, జిల్లా వ్యాప్తంగా ఉన్న చారిత్రక ఖ్యాతి పొందిన స్థలాల వివరాలు ఎగ్జిబిషన్ ద్వారా తెలియజేయాలన్నారు. కళింగ చరిత్ర, కళలు, సంస్కృతి, సంప్రదాయాలు తదితర విషయాలపై పూర్తి అవగాహన కలిగిన వారు సంబంధిత అంశాలను ఇంటాక్ కన్వీనర్ కేవీజే రాధాప్రసాద్, పాలకొండ రోడ్, శ్రీకాకుళం (ఫోన్ 94401 49659) వారికి వ్రాత పూర్వ కంగా అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎల్.శివశంకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.జి.సి. కిషోర్‌కుమార్, జేసీ2 పి. రజనీకాంతరావు, సెట్ శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎల్. రమేష్, డీటీఓ ఎన్. నారాయణరావు, శ్రీకాకుళం కళాకారుల సమాఖ్య ప్రతినిధులు ఎల్.రామలింగ స్వామి, పన్నాల నర్సింహమూర్తి., సంప్రదాయం గురుకులం ట్రస్టు డైరెక్టర్ స్వాతీ సోమనాథ్, ఇంటాక్ ప్రతినిధి వావిలాపల్లి జగన్నాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో గృహాలు బాగున్నాయి: ఉద్యోగులు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అమరావతి పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయాలను ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు గురువారం సందర్శించారు. అలాగే అసెంబ్లీ, సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలను కూడా సందర్శించారు. ఈసందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీ రాజధాని అమరావతిలో అన్ని వసతులతో ప్రభుత్వ ఉద్యోగులకు గృహసముదాయాలను నిర్మించడం అభినందనీయమని సీఎం చంద్రబాబుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. 400 మంది మహిళా ఉద్యోగులు, 200 మంది పురుషులు కలిసి పది బస్సులలో వెళ్లి వీటిని సందర్శించామన్నారు. కార్పొరేటు సెక్టార్‌లో ఉన్న గేటెడ్ కమ్యూనిటీలో కూడా లేని సదుపాయాలను ఇక్కడ కల్పించడం అభినంద నీయమన్నారు. అంతేకాకుండా నిర్మాణ సమయంలో ఉద్యోగ సంఘాలతో చర్చించి వారి ఇచ్చిన సలహాలను కూడా స్వీకరించి కిందిస్థాయి ఉద్యోగులైన డ్రైవర్లు, క్లాస్‌ఫోర్ ఉద్యోగులకు కూడా 900 చదరపు అడుగుల్లో మూడు పడకల గదులతో నిర్మాణాలు చేపట్టడం సంతోషమన్నారు. అలాగే గాలి, వెలుతురు పుష్కలంగా రావడంతోపాటు పిల్లలు ఆడుకునే విధంగా నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. పర్యటనలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫణి పేర్రాజు, ట్రెజరర్ మురళీ కృష్ణనాయుడు, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశవ నాయుడు, కృష్ణా జిల్లా చైర్మన్ ఈశ్వర్, గుంటూరు జిల్లా చైర్మన్ సంగీతారావు, రెవెన్యూ, కోఆపరేటీవ్, పంచాయతీరాజ్, మెడికల్ అండ్ హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, లేబరు, మహిళా స్త్రీశిశుసంక్షేమశాఖ, మున్సిపల్, ఎడ్యుకేషన్, నీటిపారుదలశాఖలకు సంబంధించిన శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, గిడ్డయ్య, రామాంజనేయులు, రామచంద్రయ్య, శ్రీరాములు గౌడ్, శరత్ తదితరులు

ఏఐఎస్‌ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కర్నూలు : ఏఐఎస్ఎఫ్ రూపొందించిన 2019 క్యాలెండర్‌ను ఇక్కడి ప్రభుత్వ అతిథిగృహంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎనిమిది దశాబ్దాలుగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఎనలేని పోరాటాలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో అనేక మంది విద్యార్థులు తమ ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. కొత్త సంవత్సరంలో విద్యార్థులు తమ పోరాటాలతో కేంద్రంలోని నరేంద్రమోడీ, రాష్ట్రంలో చంద్రబాబును ఎన్నికల్లో ఓడించి చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ రామచంద్రయ్య, కె రామాంజనేయులు, బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బీ గిడ్డయ్య, సహాయ కార్యదర్శి మునెప్ప, ఎస్ఎన్ రసూల్, కార్యదర్శివర్గ సభ్యుడు రంగనాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సోమన్న, నగర అధ్యక్ష కార్యదర్శులు శరత్‌కుమార్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీకి 84 కొత్త ఏసీ బస్సులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాబోయే వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) కొత్తగా 84 ఏసీ బస్సులను కొనుగోలు చేసింది. వీటిలో ఏసీ సీటర్ విభాగంలో ఇంద్ర బస్సులు 48, అమరావతి 4 బస్సులున్నాయి. అలాగే ఏసీ సీటర్ ప్లస్ స్లీపర్ విభాగంలో నైట్ రైడర్ పేరుతో 12 బస్సులు, పూర్తిగా స్లీపర్ విభాగంలో 20 వెన్నెల బస్సులను సమకూర్చుకుంది. వీటిలో వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులు 10 సంస్థ గూటికి చేరుకోగా, త్వరలో మరో 10 బస్సులు రానున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో సంస్థ అధికారులు తెలిపారు. సంస్థకు చేరిన 10 స్లీపర్ బస్సుల్లో విజయవాడ రీజియన్‌లో 6, తిరుపతి, విశాఖపట్నం రీజియన్లలో రెండేసి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. ఏసీ స్లీపర్ విభాగంలో ఒక్కో బస్సులో 30 బెర్తులు ఉంటాయి. మెరుగైన ఎయిర్ సస్పెన్షన్ విధానం వల్ల గతుకుల రోడ్లపై కూడా తక్కువ కుదుపులతో ప్రయాణం ఎంతో హాయిగా సాగుతుందన్నారు. బెర్తు పక్కనే ప్రయాణికుల లగేజీ క్యారియర్ ఉంటుందని, మొబైల్, ల్యాప్‌ట్యాప్ చార్జింగ్ చేసేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఇంద్ర, గరుడ, అమరావతి బస్సులలో మాదిరిగా ఈ బస్సుల్లో కూడా మంచి నీటి బాటిళ్లను ఉంచే సౌకర్యం ఉందన్నారు. ఏసీ సీటర్ ప్లస్ స్లీపర్ బస్సుల్లో కొన్ని కూర్చుని, మరికొన్ని పడుకుని ప్రయాణించేందుకు వీలుగా డిజైన్ చేసినట్లు తెలిపారు.

సామాన్యులకు 'సంక్రాంతి'



- 40 జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు
- సాధారణ చార్జీతోనే ప్రయాణం
- ఉపరాష్ట్రపతి ఆదేశాల అమలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు పుణ్యమాని సంక్రాంతి పండగ సెలవుల్లో సామాన్యులు సాధారణ టికెట్ చార్జీకే ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే అవకాశం కలిగింది. పండగ రోజుల్లో రైల్వేశాఖ 'సువిధ' పేరుతో ప్రత్యేక రైళ్లను నడుపుతూ అదనపు చార్జీలను వసూలు చేస్తున్న తరుణంలో జనసాధారణ్ ప్రత్యేక రైళ్ల ఏర్పాటుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్ర పర్యటనలో భాగంగా వెంకయ్య ఇటీవల రేణిగుంట నుంచి వెంకటాచలం వరకు ప్రత్యేక రైలులో ప్రయాణించారు. ఆయన వెంట విజయవాడ డీఆర్ఎం ధనుంజయులు, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులను వారు వెంకయ్యకు వివరించారు. ఇదే సమయంలో సంక్రాంతి ప్రత్యేక రైళ్ల ప్రస్తావన వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, పట్టణాల మధ్య సువిధ రైళ్లను ఏర్పాటు చేయాలని అధికారులు వివరించారు. సువిధ రైళ్లలో చార్జీలు సాధారణ రైళ్ల కంటే ఎక్కువగా ఉంటాయన్న విషయం గ్రహించిన వెంకయ్య వెంటనే సామాన్యుల కోసం రిజర్వేషన్ లేని రైళ్లను నడపాలని సూచించారు. ఇప్పటికే 20 జనసాధారణ్ సంక్రాంతి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకున్నామని, ఇందుకు సంబంధించిన ప్రకటనను బుధవారం జారీ చేస్తున్నట్లు వెంకయ్యకు అధికారులు వివరించారు. ఇవి చాలవని, మరిన్ని రైళ్లను నడపాలని ఆయన సూచించారు. ముఖ్యంగా సికింద్రాబాద్-విజయవాడ మధ్య రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను పండగ సెలవులతో పాటు అన్ని రోజుల్లో నడపాలన్నారు. అప్పటికప్పుడు కుటుంబసమేతంగా బయలుదేరే వారు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ముందుగా ప్రకటించిన 20 రైళ్లకు అదనంగా మరో 40 రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సంక్రాంతికి మొత్తం 60 జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను వివిధ ప్రాంతాల మధ్య నడవనుంది. తొలుత ప్రకటించిన 20 రైళ్లలో సికింద్రాబాద్- తిరుపతి- సికింద్రాబాద్ మధ్య 2 సర్వీసులు, తిరుపతి-కాకినాడ టౌన్- తిరుపతి మధ్య 2; విజయవాడ- విజయనగరం- విజయ వాడ మధ్య 16 సర్వీసులున్నాయి. తర్వాత ప్రకటిం చిన 34 ప్రత్యేక రైళ్లలో సికింద్రాబాద్- విజయవాడ- సికింద్రా బాద్ మధ్య పగటి వేళల్లో 18, రాత్రి వేళల్లో 16 సర్వీసులున్నాయి.

పగలు, రాత్రి వేళల్లో జనసాధారణ్ రైళ్లు

40 అదనపు ప్రత్యేక రైళ్లను పగలు, రాత్రి వేళల్లో నడిపేలా అధికారులు చర్యలు చేపట్టారు. నంబరు 07192 సికింద్రాబాద్-విజయవాడ జనసాధారణ్ ప్రత్యేక రైలు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు (14వ తేదీ మినహా) మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి 7.30 గంటలకు విజయవాడ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో నంబరు 07193 విజయవాడ-హైదరాబాద్ రైలు ఇదే తేదీల్లో రాత్రి 8.25 గంటలకు విజయవాడలో బయలుదేరి తెల్లవారుజాము 3 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, మంగళగిరిలో ఆగుతాయి. నంబరు 07194 సికింద్రాబాద్-విజయవాడ జనసాధారణ్ ప్రత్యేక రైలు ఈనెల 11నుంచి 19 వ తేదీ వరకు (14వ తేదీ మినహా) సికింద్రబాద్‌లో రాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.10 గంటలకు విజయవాడ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో నంబరు 07195 విజయవాడ-సికింద్రాబాద్ రైలు 12 నుంచి 20వ తేదీ వరకు (15వ తేదీ మినహా) విజయవాడలో ఉదయం 8.35 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, మంగళగిరిలో ఆగుతుంది. ఈ రైళ్లలో 16 సెకండ్ క్లాస్ సిటింగ్ బోగీలతో పాటు రెండు లగేజి కమ్ బ్రేక్ వ్యాన్లు ఉంటాయి.



ఆతిథ్య రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు

హిమాన్షు శుక్లా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్ర అతిథ్యరంగంలో పెట్టుబడుల పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ అధ్వర్యంలో విజయవాడలో బెరం పార్క్‌లో గురువారం 'అతిథ్యరంగంలో ఉన్న అవకాశాలు' అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శుక్లా మాట్లాడుతూ ఏపీలో ఉన్న వనరులు మరే రాష్ట్రంలోనూ లేవని, వాటిని సద్వినియోగం చేసుకోవటం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. పర్యాటకశాఖ పరంగా ఔత్సాహిక పెట్టుబడిదారులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అవసరమైన భూమిని నిబంధనల మేరకు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో అతిధ్య రంగం అభివృద్ధికి పర్యాటకశాఖ అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి పరిశ్రమ వర్గాలు అవగాహన పెంపొందిచుకోవాలని ఆయన సూచించారు. పర్యాటక పరంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే జాతీయ స్థాయిలో మూడో స్థానంలో కొనసాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా అతిధ్య రంగంలో పర్యాటక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ఆయన వివరించారు. అతిధ్య రంగంలో అందుబాటులో ఉన్న ఉత్తమ పద్ధతులపై నిపుణులు వివరించడమే కాకుండా సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్లు హరనాథ్, శ్రీదేవి, సీఎంవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

28న కలెక్టర్ల సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉండవల్లిలోని ప్రజా వేదిక వద్ద ఈనెల 28వ తేదీన కలెక్టర్ల సమావేశం జరగనుంది. సమావేశాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ మన్మోహన్‌సింగ్ గురువారం జీవోను జారీ చేశారు.

దున్నే వాడికే భూమి

- మరో భూ పోరాటానికి సిద్ధం
- గిరిజనులకు అండగా ఉంటాం
- వినగడప తండా భూ పోరాట సదస్సులో జల్లి విల్సన్



భూపోరాట సదస్సులో పాల్గొన్న జల్లివిల్సన్, అక్కినేని వనజ తదితరులు

విశాలాంధ్ర - గంపలగూడెం : గిరిజనుల ఆధీనంలో ఉన్న అటవీ భూములు వారికే దక్కేంత వరకు కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ చెప్పారు. భూ పోరాటం ద్వారా 80 వేల ఎకరాలను దళితులు, గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత సీపీఐకి ఉందన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా దున్నే వాడికే భూమి దక్కేందుకు మరో భూ పోరాటం చేస్తామన్నారు. కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం వినగడప తండాలో భూ పోరాట సదస్సు గురువారం జరిగింది. తండాలో వంద మంది గిరిజనులు సీపీఐ ఆధ్వర్యంలో పదేళ్లగా 150 ఎకరాలను సాగు చేసుకుంటున్నారు. గతంలో అటవీశాఖ అధికారులు బెదిరింపులకు పాల్పడినా సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమించి భూములను దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా అటవీశాఖ అధికారులు గిరిజనుల ఆధీనంలో ఉన్న భూమిలో మొక్కలు నాటాలని నిర్ణయించి, సాగుదారులను లోపలకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో సీపీఐ ఆధ్వర్యంలో అటవీ భూమిలోనే భూ పోరాట సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన విల్సన్ మాట్లాడుతూ, చట్టం ప్రకారం దున్నే వాడికే భూమి దక్కాలని, వినగడప తండా భూములను గిరిజనులకే దక్కేలా పోరాటం చేస్తామన్నారు. కృష్ణాజిల్లా నూజివీడు, మైలవరం, తిరువూరు, చాట్రాయి తదితర ప్రాంతాల్లో భూ పోరాటం ద్వారా 80 వేల ఎకరాలను పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఎంతో పోరాట చరిత్ర కలిగిన సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వినగడప తండా గిరిజనులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అధికారుల బెదిరింపులు, పోలీసుల లాఠీ దెబ్బలకు భయపడే ప్రసక్తేలేదన్నారు. సీపీఐతో కలిసి పోరాడి భూములు దక్కించుకోవాలన్నారు. ఉన్న భూమిని జాగ్రత్తగా కాపాడుకుంటూ, పిల్లలను విద్యావంతులు చేయాలని విల్సన్ సూచించారు. సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లాడుతూ, సాగు భూములను దక్కించుకునేందుకు అంతా సమష్టిగా కష్టపడాలన్నారు. భూమి కోసం మహిళలు నడుంబిగించాలని ఆమె పిలుపునిచ్చారు. అటవీ భూమిలో గిరిజనులంతా సమష్టిగా అపరాలు పండిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సీపీఐ గంపలగూడెం మండల కార్యదర్శి నాగుల్‌మీరా అధ్యక్షతన జరిగిన భూ పోరాట సదస్సులో తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి తూము కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిలుకూరి వెంకటేశ్వరరావు, మర్సకట్ల త్యాగరాజు, మేకల డేవిడ్, తండా భూ పోరాట కమిటీ నాయకులు భూక్యా హర్ష, గంసీ పాల్గొన్నారు.



తిరుపతిలో జగన్‌కు ఘన స్వాగతం

కాలినడకన తిరుమలకు చేరుకున్న వైసీపీ అధినేత

విశాలాంధ్ర - తిరుపతి : ప్రజా సంకల్పయాత్రను పూర్తి చేసుకుని గురువారం తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వచ్చిన వైసీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికి తిరుపతిలో ఘన స్వాగతం లభించింది. తిరుపతి నుంచి కాలినడకన తిరుమల తిరుమలకు చేరుకున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం రేణిగుంటకు చేరుకున్నప్పుడు వైసీపీ కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు.విజయనగరం నుంచి రైల్లో వచ్చిన జగన్‌పై రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి తిరుపతి పద్మావతి గెస్ట్ హౌస్ వరకుపూల వర్షం కురిపించారు. గురువారం ఉదయం రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. పాదయాత్ర ముగించుకుని తిరుపతికి వచ్చిన జగన్‌కు రేణిగుంటలో ఘనంగా స్వాగతం లభించింది. వైసీపీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం తిరుమలకు వచ్చిన స్వరూపా నందేంద్ర స్వామి ఆశీస్సులను జగన్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,రోజా, నారాయణస్వామి, మాజీ ఎంపిలు విజయసాయిరెడ్డి, వరప్రసాద్, నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదరహో అనిపించనున్న ఆంధ్రా వంటకాలు

పర్యాటక శాఖ నేతృత్వంలో నేటినుంచి ఆహార పండుగ

విశాలాంధ్ర బ్యూ రో - అమరావతి : తెలుగుదనం ఉట్టిపడే వంటకాలను మరింతగా జనబాహుళ్యంలోకి తీసు కువెళ్లేలా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ నిరం తరం వివిధ కార్యక్రమా లు చేపడుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో నగరంలో నూతనంగా ప్రారంభించిన నోవాటెల్ హెూటల్‌లో జనవరి 11 నుండి 24 వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుందని ఏపీటీఏ సీఈఓ, ఏపీటీడీసీ ఎండీ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ విడత ప్రత్యేకత ఏమిటంటే ఏకకాలంలో మూడు చోట్ల ఆహార ఉత్సవాలు నిర్వహించటం. ఇటు విజయవాడ నోవాటెల్‌తో పాటు తిరుపతిలోని హెూటల్ మానస్ సరోవర్, కాకినాడలోని మహేంద్రా మిఠాయి వాలాలలో ఈ ఆంధ్రా ఆహార పండుగలు నిర్వహిస్తున్నారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి స్వయంగా రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా హాజరు కానుండగా ఆహార పండుగను పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆచార్య జయరామి రెడ్డి ప్రారంభించనున్నారు. జనవరి 12వ తేదీన తిరుపతిలో ఆహార పండుగ ప్రారంభం కానుంది. తిరుపతి, కాకినాడలలో వారం రోజుల వరకే పండుగ పరిమితం కానుండగా, విజయవాడ నోవాటెల్‌లో 15 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగ నున్నాయి. కార్యక్రమంలో భాగంగా మంగళగిరి చేనేత, లేపాక్షి, అరకు కాఫీ స్టాల్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు పర్యాటక శాఖ అధికారులు వివరించారు. పర్యాటక శాఖ నిర్వహించే ఈ వేడుకలో తెలుగుదనం ప్రతిబింబించే ముంత మసాలా రుచి చూడవచ్చు. శాఖాహారంలో దొండకాయ కొబ్బరి కూర రుచి చూస్తే వదిలిపెట్టరెవ్వరూ. తెలగపిండి, మునగాకు తాలింపు మజానే వేరు. మునగాకు పప్పు కూర గురించి తెలిసిన వారు తక్కువనే చెప్పాలి. ఆయుర్వేద విలువల భరితం ఇది. కాకరకాయ ఉల్లికారం రుచి చూస్తే మళ్లీ, మళ్లీ నోరూరవలసిందే. అరటిపువ్వు కాంబినేషన్‌లో చేసే పెసరకూర రుచి, తింటే కాని అర్థం కాదు. అందరికీ తెలిసిందే గుత్తి వంకాయ కమ్మదనం. ఇక ఉలవచారు మీగడతో రెండు ముద్దలు తిన్నా చాలు. చింతచిగురు పప్పు, తోటకూర పప్పు, ఆనపకాయ పప్పు, ముక్కల పులుసు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విశేషాలు పొదిగిన ఆహారం ఆంధ్రులది. ఇక దంపుడు బియ్యం, పెసరమొలకల పలావ్ తింటే ఏ పరదేశీ అయినా ఇక్కడి పౌరసత్వం తీసుకోవాలసిందే. మెంతికూర టమోటా అన్నం, పుల్లట్లు, రాగిముద్ద, పన్నీరు గంటి కుడుములు గ్రామీణాంధ్రలో కనిపించే విశేష వంటకాలు. ఇక మాంసాహారం ముచ్చట చెప్పనక్కర లేదు. కొత్తిమీర కోడి మసాలా వాసనకే కడుపు నిండిపోతుంది. బొంగు చికెన్, గోంగూర మాంసం, దోసకాయ మాంసం రుచులు అంతర్జాతీయ పర్యాటకులకు చేరువ అయితే వీటి కోసమే వారు మళ్లీ, మళ్లీ రాకపోరు. మాంసాహార ప్రియులలో బీరకాయ రొయ్యల కూర, సొర పొట్టు కూరను స్వాగతించని వారే ఉండబోరు. తాటిబెల్లం ఉక్కిరి రుచి చూడాలంటే ఎవరైనా తెలుగుదేశం రావలసిందే. ఒక కొబ్బరి మీగడ పాయసం గురించి ఎంత చెప్పినా తక్కువే.

ఎన్ఓసిలు ఇచ్చేందుకు చర్యలు వేగవంతం

విశాలాంధ్ర, హైదరాబాద్ : చెరువులు, కుంటలు తదితర జలాశయాల ప్రక్కన నిర్మించబోయే భవన నిర్మాణాలకు, లే-అవుట్లకు నిరభ్యంతర ప్రమాణ పత్రాలు జారీ చేసే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తున్న రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ హరీష్‌ను హెచ్ఎండీఏ కమీషనర్ డా.బి.జనార్ధన్ రెడ్డి ప్రశంసించారు. నేడిక్కడ బి.పి.పి. కార్యాలయంలో జరిగిన ఎన్.ఓ.సి. సమన్వయ సమితి సమావేశానికి వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, నీటి పారుదల విభాగం అధికారులు, రెవిన్యూ విభాగం అధికారులు హాజరైనారు. కాగా రంగారెడ్డి జిల్లాలో ఎన్ఓసీ (నిరభ్యంతర ప్రమాణ పత్రము) లు కోరుతూ 10వేలు ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు రాగా, వాటిలో 5064 దరఖాస్తులను పరిష్కరించడాన్ని కమీషనర్ డా.జనార్ధన్ రెడ్డి ప్రశంసించారు.

చిన్నవ్యాపారులకు ఊరట


(మొదటిపేజీ తరువాయి)

లాభం చేకూరే విధంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'కాంపొజిషన్ పథకం కింద వ్యాపారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి పన్నులు చెల్లించాలి. కానీ, రిటర్న్ మాత్రం ఏడాదికి ఒకసారి మాత్రమే దాఖలు చేయాలి. కాంపొజిషన్ పథకం పరిమితిని రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లకు పెంచాం. ఏప్రిల్ 1, 2019 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. చిన్న, మధ్య తరహా వ్యాపారుల పన్ను విధింపు పరిమితిని రూ.20 లక్షల వార్షిక టర్నోవర్‌ను రూ.40 లక్షల వరకు పెంచాం. రెండేళ్ల వరకు అంతర్ రాష్ట్ర అమ్మకాలపై ఒక శాతం సెస్ విధిం చేందుకు కేరళకు అనుమతి ఇస్తున్నాం' అని జైట్లీ వెల్లడించారు. ప్రజలపై పన్ను భారం పడకుండా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ జీఎస్టీని సరళతరం చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే గత నెలలో జరిగిన సమావేశంలో 23 వస్తువులను తక్కువ పన్ను శ్లాబులోకి తీసుకొచ్చామన్నారు. మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా సినిమా టికెట్లు, 32 అంగుళాల వరకు టీవీలు, పవర్ బ్యాంకులు, డిజిటల్ కెమెరాలు, వీడియో గేమ్స్‌పై పన్ను భారం తగ్గించినట్లు తెలిపారు. తగ్గించిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయన్నారు. తాజాగా నిర్ణయం చిరు వ్యాపారులకు ఊరట నిస్తుందని జైట్లీ వివరించారు.

తొలితరం కమ్యూనిస్టు శివరామిరెడ్డి కన్నుమూత

నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

విశాలాంధ్ర బ్యూరో - కడప : ఆయన కమ్యూనిస్టు భావజాలాన్ని అణువణువునా నింపుకున్న ఉద్యమ నేత.... ఎన్నో పోరాటాలకు నేతృత్వం వహించిన నాయకుడు. కడప జిల్లా కమ్యూనిస్టు చరిత్రలో తన పేరును సుస్థిరం చేసుకున్నారు. ఆయనే నర్రెడ్డి శివరామిరెడ్డి. నేటితరం కమ్యూనిస్టులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన కమలాపురం, పులివెందుల ఉమ్మడి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డి (97) గురువారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఆయనకు ఐదుగురు పిల్లలు. నిత్యం పార్టీ కార్యక్రమాలలోనే గడుపుతూ, పార్టీ అభ్యున్నతికి తన వంతుగా కృషి చేసిన ఆయన ఇక లేరన్న విషయం తెలుసుకున్న కడప జిల్లా కమ్యూనిస్టు శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి చెందాయి. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపాయి. రేపు జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ పయనమయ్యాయి. అరుణోదయం పేరిట కడప జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ స్మృతులు అనే పుస్తకాన్ని ఆయన సంపాదకులుగా 1998, ఆగస్టు 3న తీసుకువచ్చారు. కమ్యూనిస్టు పార్టీ కోసం తన ఆస్తులను, భూములను నర్రెడ్డి అమ్మి ఖర్చు చేసేవారు. 1958లో వారి స్వగ్రామం నుండి కడపకు మకాం మార్చినప్పుడు ఆయనకు మిగిలిన 6 ఎకరాల బీడు భూమిని అమ్మగా రూ.2700 వచ్చింది. దాంతో జీవితం ప్రారంభించారు. త్యాగం చేశానని చెప్పుకోవడం కంటే బాధ్యత నెరవేర్చాననే తృప్తి నాకు కొండంత నైతిక శక్తి ఇచ్చిందని చెప్పేవారు. 1922, ఫిబ్రవరి 25న కడప జిల్లా వీరపునాయునిపల్లి మండలం, గడ్డం వారిపల్లిలో జన్మించిన



శివరామిరెడ్డిని గొప్ప విద్యావంతునిగా చేసి ప్రభుత్వ ఉద్యోగిని చేయాలని ఆయన తండ్రి భావించారు. వీరపునాయునిపల్లె మండలం, అనిమెలకు సమీపంలో వున్న కృష్ణస్వామి ఆశ్రమంలో జె.వెంకటరామిరెడ్డి, ఎన్సీ గంగిరెడ్డి, జస్టిస్ పి.చెన్నకేశవ రెడ్డి, అన్న చెన్నారెడ్డి తదితరులు శివరామిరెడ్డి సహా విద్యార్థులుగా ఉండేవారు. ఆ పాఠశాలలో విద్య అనంతరం కోచింగ్ తీసుకుని పులివెందుల హై స్కూల్‌లోనూ, ఆనక అనంతపురం డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. 1941-43 మధ్యలో శివరామిరెడ్డి కమ్యూనిస్టు రాజకీయాలలో ఓనమాలు నేర్చుకుని కమ్యూనిస్టు నాయకునిగా ఎదిగారు. 1952లో సీపీఐ తరపున కమలాపురం ఎమ్మెల్యే గా విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి రామ లింగారెడ్డిపై గెలుపొంది కడప జిల్లాలో కమ్యూనిస్టుల ప్రాభవాన్ని చాటి చెప్పారు. ఫ్యూడల్ కుటుంబం నుంచి వచ్చిన రామలింగారెడ్డిపై కమ్యూనిస్టు అయిన నర్రెడ్డి గెలవడం విశేషమని చెప్పవచ్చు. 1947 మే నెలలో కొండమ్మతో శివరామిరెడ్డికి వివాహం జరిగింది. వారి పెళ్లైన పది మాసాలకే పార్టీపై నిర్బంధం ప్రారంభమైంది. అనిమెల నల్లకొండల్లోని రాళ్ల మధ్య గుట్టల్లో, పొలాల్లో ఆయన గడిపారు. అప్పట్లో జిల్లాలో ఎద్దుల ఈశ్వర్‌రెడ్డిని, నర్రెడ్డిని పట్టుకునేందుకు పోలీసులు శతవిధాల ప్రయత్నాలు చేశారు. 1973-87 సంవత్సరంలో కడప జిల్లా కమ్యునిస్టు పార్టీ కార్యదర్శిగా విశేష సేవలు అందించారు. కమ్యూనిజం తనకు పునర్జన్మ ప్రసాదించింది అని చెప్పే శివరామిరెడ్డి పునర్జన్మ అంటే మతాలు, స్వాములు చెప్పే పునర్జన్మకాదని, సంపన్న కుటుంబంలో పుట్టిన తాను అందుకు పూర్తిగా విరుద్ధమైన సామ్యవాదాన్ని ఎంచుకోవడమే పునర్జన్మ అనేవారు. శివరామిరెడ్డి జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేశారు. నేటి యువతరానికి, నవ తరానికి నాటి స్మృతులు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు ఆయన రచించిన అరుణోదయం నేటికీ ఆయన గుర్తుగా కమ్యూనిస్టుల చేతుల్లో నిలుస్తుందని చెప్పవచ్చు.

నారాయణ ప్రభృతుల సంతాపం

కమ్యూనిస్టు పార్టీ ముద్దుబిడ్డ, మొదటి అసెంబ్లీకి కమలాపురం నుంచి శాసనసభకు ఎన్నికైన కమ్యూనిస్టు పార్టీ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు శివరామిరెడ్డి మృతి పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. దీర్ఘకాలంగా రాయలసీమ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి శివరామిరెడ్డి విశేష కృషిచేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గసభ్యుడు జి.ఓబులేసు వేరొక ప్రకటనలో కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన శివరామిరెడ్డి..కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల ఆకర్షితులయ్యారని వివరించారు. సీపీఐ రాష్ట్ర నాయకులుగా ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. శివరామిరెడ్డి మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.





ఆసిస్‌కు ఎదురుదెబ్బ

సిడ్నీ: భారత్‌తో జరుగనున్న మూడు వన్డేల సిరీస్‌లో తలపడే ఆస్ట్రేలియాకు ఎదురుదెబ్బ తగలింది. శనివారం సిడ్నీ వేదికగా జరిగే తొలి వన్డేకు ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ దూరమయ్యాడు. జీర్ణాశయ సంబంధిత రోగంతో బాధపడుతున్న మార్ష్ కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాంతో మిచెల్ మార్ష్ తొలి వన్డేలో పాల్గొనడం లేదని ఆసీస్ కోచ్ జస్టిన్ లాంగర్ తెలిపాడు. మిగతా రెండు వన్డేలకు మార్ష్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నాడు. మిచెల్ మార్ష్ తేరుకోవడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున అతని స్థానంలో ఆస్టాన్ టర్నర్‌ను జట్టులోకి తీసుకున్నట్లు వెల్లడించాడు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అయిన టర్నర్.. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ కావడంతో అతన్ని ఎంపిక చేసినట్లు కోచ్ తెలిపాడు. మరొకవైపు ఆస్టన్ వికెట్ల మధ్య పరుగెత్తడంలో అథ్లెట్‌ను తలపిస్తాడన్నాడు.

కోహ్లికి.. సవాళ్లు



హైదరాబాద్: ఆస్ట్రేలియాలో చిరస్మరణీయ టెస్టు సిరీస్ విజయాన్ని టీమిండియా ఆస్వాదిస్తోంది. దాదాపు 71 ఏళ్లకు కంగారూలను వారి సొంతగడ్డపై ఓడించింది కోహ్లిసేన. వెంటనే మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధమైంది. శనివారమే తొలి పోరు. ఇంగ్లండ్‌లో నిర్వహించే ప్రపంచకప్ ముందు భారత్ కేవలం 11 వన్డేలే ఆడనుంది. జట్టును కొన్ని సమస్యలు వేధిస్తున్నాయి. అందుకే ఆసీస్, న్యూజిలాండ్ సిరీస్‌ల్లో వీటికి పరిష్కారం కనుగొనేందుకు టీమిండియా సమాయత్తం అవుతోంది. ప్రపంచకప్ కోసం అన్ని దేశాలు తమ జట్లను పటిష్ఠం చేసుకుంటున్న నేపథ్యంలో ఆసీస్‌తో మూడు వన్డేలు భారత్‌కు అత్యంత కీలకం.

రాయుడు @ 4



భారత జట్టును చాన్నాళ్లుగా 'నంబర్ 4' సమస్య వేధించింది. 2015, ఏప్రిల్ నుంచి దాదాపు 11 మందిని ఈ స్థానంలో పరిశీలించారు. గతేడాది జరిగిన వెస్టిండీస్ సిరీస్‌లో పరిష్కారం దొరికినట్టు కనిపించింది. హైదరాబాదీ ఆటగాడు అంబటి రాయుడు విండీస్ సిరీస్‌లో అదరగొట్టాడు. నాలుగో స్థానంలో అద్భుతంగా రాణించాడు. 22 నాటౌట్, 73, 100, 22 స్కోర్లు చేశాడు. భారత్ ఈ సిరీస్‌ను 3-1తో గెలిచింది. రాయుడు ఆట, టెక్నిక్, దూకుడుపై సారథి విరాట్ కోహ్లి సంతృప్తి వ్యక్తం చేశాడు. 'రాయుడు తనకు వచ్చిన అవకాశాన్ని రెండు చేతుల్తో ఒడిసిపట్టాడు. 2019 ప్రపంచకప్ వరకు అతడిని మేం ప్రోత్సహించాలి. అతడు ఆటను బాగా అధ్యయనం చేస్తాడు. అందుకే నాలుగో స్థానంలో తెలివైన ఆటగాడు ఉన్నందుకు మేం సంతోషంగా ఉన్నాం' అని విరాట్ కోహ్లి అన్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీసుల్లో రాయుడు ఓపికతో రాణిస్తే అతడికి జట్టులో ఇక తిరుగుండదు. ప్రపంచకప్ కోసమే అతడు రంజీలకు వీడ్కోలు పలికి పరిమిత ఓవర్ల క్రికెట్‌పై దృష్టి సారించిన సంగతి తెలిసిందే.

ధోనీ పరిస్థితి ఏంటి?



వన్డే ఫార్మాట్‌లోనే మునుపటిలా ఆడలేకపోతున్న ఎంఎస్ ధోనీని న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. టెస్టుల్లో రాణిస్తున్న యువ రిషబ్ పంత్‌ను మరింత ప్రోత్సహించాలని చాలామంది అంటున్నారు. అయితే రంజీలు ఆడకపోవడంతో ధోనీకి సాధన కరవైంది. ఈ ఉద్దేశంతోనే ప్రపంచకప్ వరకు అతడు క్రికెట్ ఆడుతూ ఉండాలని టీ20 సిరీస్‌కు ఎంపిక చేశారు. గతేడాది మహీ 13 వన్డేలు ఆడగా సగటు 25. ఇక స్ట్రైక్‌రేట్ 71.4. అతడి కెరీర్‌లోనే 2004ను మినహాయిస్తే అత్యంత ఘోరమైన స్ట్రైక్‌రేట్ ఇది. ప్రపంచకప్‌లో ధోనీ అనుభవం జట్టుకు ఉపయోగమని సునీల్ గవాస్కర్ లాంటి దిగ్గజాల భావన.

'ఆరు' ఎవరు?



టీమిండియాలో ఆరో స్థానంలో ఎవరిని ఆడించాలన్న సందిగ్ధం ఇంకా తీరలేదు. గత ప్రపంచకప్ నుంచి భారత్ 73 వన్డేలు ఆడింది. ఈ స్థానంలో 11 మందిని పరీక్షించింది. అందరి కన్నా బాగా రాణించింది మాత్రం కేదార్ జాదవ్. అతడు పదేపదే గాయపడటమే అందరినీ విసిగిస్తోంది. దాదాపు 52 ఇన్నింగ్సుల్లో 33 సార్లు భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది ధోనీ, జాదవ్ త్వరగా ఔటవ్వడం మూలంగానే. గణాంకాలను పరిశీలిస్తే 2015 నుంచి ధోనీ 17 ఇన్నింగ్సుల్లో 46.50 సగటు, 76.73 స్ట్రైక్‌రేట్‌తో 465 పరుగులు చేశాడు. కేదార్ 15 ఇన్నింగ్సుల్లో 66.11 సగటుతో, 119.71 స్ట్రైక్‌రేట్‌తో 595 పరుగులు చేశాడు. పైగా అతడు పది ఓవర్లు బౌలింగ్ చేయగలడు. తన స్పిన్‌తో ఇబ్బంది పెట్టగలడు. కీలక సమయాల్లో వికెట్లు తీయగలడు. అందుకే 'గోల్డెన్ హ్యాండ్' అంటారు. ఇదే స్థానంలో యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య సైతం పోటీ పడుతున్నాడు. మ్యాచ్‌లను ముగించే ఈ ఆరో స్థానంలో మంచి ఆటగాడు లేకుంటే భారత్‌కు కష్టం అవుతుంది. ఉన్నవి రెండే సిరీస్‌లు కాబట్టి త్వరగా ఓ నిర్ణయానికి రావాలి.

మణికట్టుతోనే కనికట్టు!





కోహ్లిసేన రెండేళ్లుగా ఫింగర్ స్పిన్నర్లను పక్కన పెట్టి పూర్తిగా మణికట్టు స్పిన్నర్లపై ఆధారపడుతోంది. యువ ద్వయం కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్ అద్భుతంగా రాణిస్తున్నారు. జడేజా ఎప్పుడోగానీ జట్టులోకి రావడం లేదు. అశ్విన్‌కు దాదాపు శాశ్వత విశ్రాంతి ప్రకటించేశారు! 2017 నుంచి ఇప్పటి వరకు చాహల్ 27 మ్యాచ్‌లు ఆడాడు. 25.91 సగటు, 4.91 ఎకానమీతో 45 వికెట్లు తీశాడు. కుల్‌దీప్ 26 మ్యాచుల్లో 56 వికెట్లు తీశాడు. సగటు 19.92, ఎకానమీ 4.93. రవీంద్ర జడేజా 8 మ్యాచుల్లో 24.57 సగటు, 4.59 ఎకానమీతో 8 వికెట్లు తీశాడు. ఫింగర్ స్పిన్నర్లతో పోలిస్తే పిచ్ ఎలాగున్నా మణికట్టు స్పిన్నర్లు అదరగొడుతున్నారు. బ్యాట్స్‌మెన్‌కు అంతు చిక్కకుండా బంతులు వేస్తున్నారు. వీరిద్దరితో పోటీపడి జడేజా ప్రపంచకప్‌నకు ఎంపికవుతాడా అన్నది సందేహమే!

బుమ్రా, భువి గాయపడితే?





ఇక పేసర్ల విషయానికి వస్తే బుమ్రా, భువి జోడీ బాగా హిట్టయింది. ప్రస్తుతం బుమ్రా వీరోచిత ఫామ్‌లో ఉన్నాడు. ఎడతెరపి లేకుండా ఆడిన భువి గాయం నుంచి కోలుకున్న తర్వాత లయ అందుకోలేదు. ప్రస్తుతం ఫిట్‌గానే ఉన్నా ఐపీఎల్‌లో గాయపడితే ప్రపంచకప్‌లో వీరికి బ్యాకప్ ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. పాండ్య పూర్తిగా ఫిట్ అయితే జట్టుకు సమతూకం తెస్తాడు. మూడో పేసర్ బాధ ఉండదు. బుమ్రా, భువిలో ఎవరు గాయపడ్డ పరిస్థితి మరో విధంగా తయారవు తుంది. విండీస్ సిరీస్‌లో షమీ ఎక్కువ పరుగులిచ్చాడు. వికెట్లు తీయలేకపోయాడు. ఎడమచేతి వాటం యువ పేసర్ ఖలీల్ అహ్మద్ ఆసియా కప్‌లో ఆకట్టుకున్నాడు. ఉమేశ్ యాదవ్‌ను నమ్ముకోలేని పరిస్థితి. అందుకే పేసర్ల విషయంలో జాగ్రత్తలు అవసరం.

భారత్‌లో ఆసిస్ పర్యటన ఖరారు

రెండు టీ20లు, 5వన్డేలు



ముంబై: భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన షెడ్యూల్‌ను బీసీసీఐ ఖరారు చేసింది. ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభమై మార్చి 13తో ముగియనున్న ఈ పర్యటనలో భారత్-ఆస్ట్రేలియా మధ్య రెండు టీ20లు ఐదు వన్డేలు జరుగనున్నాయి. రెండు టీ20ల్లో తొలి మ్యాచ్ బెంగళూరులో జరుగనుండగా, ఫిబ్రవరి 27న రెండో టీ20 విశాఖ పట్నంలో జరగనున్నది. మార్చి 2 నుంచి వన్డేలు ప్రారంభం కానుండగా తొలి వన్డే హైదరాబాద్‌లో జరగనున్నది. రెండో వన్డే నాగ్‌పూర్, మూడో వన్డే రాంచీ, నాలుగో వన్డే మొహాలీ, చివరి వన్డే ఢిల్లీ వేదికగా జరుగనున్నాయి. 2017లో ఆసీస్ పరిమితి ఓవర్ల సిరీస్ కోసం భారత్‌లో పర్యటించగా 5 వన్డేల సిరీస్‌ను భారత్ 4-1 తేడాతో గెలుచుకోగా, మూడు టీ20ల సిరీస్‌ను 1-1తో డ్రాగా ముగిసింది. ప్రపంచ కప్ ముందు జరుగనున్న సిరీస్ కాబట్టి ఇరు జట్లకు ఈ మ్యాచులు కీలకం కానున్నాయి.

మేరీ నెం.1

న్యూఢిల్లీ: ప్రముఖ బాక్సర్ మేరీ కోమ్‌కు అరుదైన ఘనత సాధించింది. ఏఐబీఏ తాజాగా ప్రకటించిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మేరీ మొదటి స్థానంలో నిలిచింది. గతేడాది నవంబర్‌లో ఢిల్లీ వేదికగా జరిగిన ఏఐబీఏ మహిళా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 48 కేజీల విభాగంలో మేరీ స్వర్ణం సాధించింది. దీంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆరుసార్లు టైటిళ్లు నెగ్గిన ఘనత సొంతం చేసుకంది. ఈ విజయంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 48కేజీల విభాగంలో 1700 పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. 2020లో జరగబోయే ఒలింపిక్స్‌లో 48 కేజీల విభాగం చేర్చకపోవడంతో మేరీ 51కేజీల విభాగంలో పోటీ పడనుంది. 2018 మేరీకోమ్‌కు ఎన్నో మధురానుభూతులను మిగిల్చింది. గతేడాది జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకాన్ని సాధించిన మేరీ.. స్ట్రాంజ్జా మెమోరియల్ పోటీల్లో రజతపతకాన్ని నెగ్గింది. ఏఐబీఏ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో మేరీతో పాటు మరికొందరు మహిళా బాక్సర్లు సైతం ఉత్తమ ర్యాంకులు దక్కించుకున్నారు. 51కేజీల విభాగంలో పింకీ జంగ్రా ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఆసియా క్రీడల్లో రజతం సాధించిన మనీషా మౌన్ 54 కేజీల విభాగంలో ఎనిమిదో స్థానాన్ని కైవసం చేసుకుంది. 57 కేజీల విభాగంలో సోనియా లాథర్ రెండో స్థానంలో నిలిచింది. మరో బాక్సర్ సిమ్రంజిత్ కౌర్ 64 కేజీల విభాగంలో నాలుగోస్థానానికి చేరింది. మాజీ ప్రపంచ చాంపియన్ ఎల్ సరితా దేవి 16 స్థానానికి పరిమితమైంది. ఇండియా ఓపెన్‌లో స్వర్ణాన్ని అందుకున్న లవ్లీనా 69కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచింది.



పాండ్య, రాహుల్‌పై

రెండు వన్డేల నిషేధం..?

ముంబై: టీవీ షోలో పాల్గొని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన టీమిండియా క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యలపై చర్యలకు రంగం సిద్ధమైంది. వీరిపై రెండు వన్డే మ్యాచ్‌ల నిషేధం విధించాలని పాలకుల కమిటీ (సీఓఏ) చైర్మన్ వినోద్ రాయ్ గురువారం సూచించారు. బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రీకి పంపిన మెయిల్‌లో ఈ ప్రతిపాదన చేశారు. 'షో సందర్భంగా వారిద్దరూ చేసిన వ్యాఖ్యలను పరిశీలించా. అవి ఆమోదయోగ్యంగా లేవు. క్షమాపణలు ఆ తప్పును కప్పి పుచ్చలేవు. వారిపై ఎలాంటి పెనాల్టీ విధించాలో డయానాను అడిగాను. రెండు మ్యాచ్‌ల నిషేధం సరైందని భావిస్తున్నా. దానికి డయానా అంగీకరిస్తే, విధివిధానాలను రూపొందించండి. అలాగే బీసీసీఐ కాంట్రాక్టు ఆటగాళ్లు, సిబ్బందికి విడిగా నిబంధనలనుసిద్ధం చేయండి' అని ఈ-మెయిల్‌లో వెల్లడించారు.

దేశంలో హిందోన్మాదుల కుట్ర...!

- ముస్లింలపై జాత్యాంహకార దాడి
- మాజీ ఐఏఎస్ అధికారి షా ఫయెసల్

శ్రీనగర్: తన భవిష్యత్తు కార్యాచరణను ప్రజానీకం... ముఖ్యంగా యువత నిర్ణయిస్తారని బుధవారం రాజీనామా చేసిన కాశ్మీర్ కేడర్ ఐఏఎస్ ఆఫీసర్ షా ఫయెసల్ అన్నారు. కాశ్మీరీలో మారణకాండకు చలించి, నిరసనగా బుధవారం తన ఉద్యోగానికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పీటీఐతో ఆయన గురువారం మాట్లాడుతూ, తాను ఉద్యోగం నుంచి వైదొలిగిన క్షణంలో... ఎందరో అవమానించారని, మరెందరో కీర్తించారని, ఐతే, ఈ స్పందనను తాను ముందే ఊహించానని వివరించారు. తన భవిష్యత్తు కార్యాచరణ కాశ్మీరీల స్పందనపై ఆధారపడిందన్నారు. ఇప్పటికే ఫేస్‌బుక్, ట్విట్టర్లలో తనకు అనేక మంది సూచనలు చేస్తున్నారని, కానీ తాను ప్రత్యక్షంగా ప్రజలు, యువతతో సంప్రదించిన తరువాతే ఓ నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. శుక్రవారం తాను ఎక్కడ కలవబోయేదీ ఫేస్‌బుక్, ట్విట్టర్లలో చెబుతానని, అక్కడకు ఎంత మంది వస్తారో గమనించి, వారితో చర్చించి అడుగు ముందుకు వేస్తానని తెలిపారు. దేశంలో 20 కోట్ల మంది ముస్లింలపై హిందూత్వ శక్తులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముస్లింల సంఖ్య తగ్గించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఒక రకంగా ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా కుట్రపూరిత దాడులు జరుగుతున్నాయన్నారు. ఒక రకంగా ముస్లింల భవిష్యత్తు హిందూత్వశక్తుల గుప్పెట్లో నలిగిపోతోందన్నారు.



జాతీయత పేరిట అసహనం, ఏహ్య భావం సంస్కృతి దేశవ్యాప్తంగా పెరిగిందని ఫయెసల్ ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ఆర్బీఐ, సీబీఐ, ఎన్ఐఏ తదితర సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారని పరోక్షంగా మోడీ సర్కారును విమర్శించారు. ఇదిలా ఉంటే, ఆయన నేషనల్ కాన్ఫరెన్స్ చేరుతారని ప్రచారం జరిగింది. ఐతే, సామాజిక మాధ్యమంలో ఆయన పోస్టులు మరిన్ని ఊహాగానాలకు తెరలేచింది.

ఆయనకు శాల్యూట్ : మాజీ మంత్రి చిదంబరం

తొలి కాశ్మీరీ ఐఏఎస్ టాపర్ షా ఫయెల్ తన ఉద్యోగానికి రాజీనామా చేయటమే కాదు... నరేంద్ర మోడీ విధానాలను దుయ్యబట్టగా... కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం తీవ్రంగా స్పందించారు. ఆయన రాజీనామా విచారకరమైనా... ఆయనకు శాల్యూట్ చేస్తున్నా అని ట్వీట్ చేశారు. బీజేపీ సర్కారుపై ఆయన ఆక్రోశం, ఆగ్రహాన్ని ప్రపంచం గమనిస్తోందన్నారు. ఉన్నతోద్యోగుల్లో అసంతృప్తిని నిరూపించే ఘటనలు చాలా చోటు చేసుకున్నాయని వివరించారు. పంజాబ్ మాజీ డీజీపీ జులియో రిబైరో కూడా ఇదే రీతిలో రాజీనామా చేశారని, ప్రభుత్వ విధానాలపై రాజీ పడలేక అత్యుత్తమ అధికారులు ప్రజాసేవకు దూరం కావటం విచారకరమని, ప్రభుత్వం సిగ్గుతో తలవంచుకోవాల్సిన తరుణమని చిదంబరం వ్యాఖ్యానించారు.

కోటాపై సుప్రీంలో పిటిషన్

- 50 శాతం దాటిన రిజర్వేషన్లు
- రాజ్యాంగ విరుద్ధమంటున్న యూత్ ఫర్ ఈక్విటీ

న్యూఢిల్లీ: జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈబీసీ) 10 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్ దాఖలైంది. ఇప్పటికే ఈ బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి. ఇక రాష్ట్రపతి సంతకం పెడితే ఈ బిల్లు చట్ట రూపం దాలుస్తుంది. అయితే, ఈ బిల్లును సవాల్ చేస్తూ యూత్ ఫర్ ఈక్విటీ అనే సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈబీసీ బిల్లు వల్ల దేశంలో రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాల్లో జనరల్ కేటగిరి వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన 124 రాజ్యాంగ సవరణ బిల్లుకు రెండు రోజుల్లో పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. మంగళవారం లోక్‌సభ సభ్యులు దీనికి ఆమోద ముద్ర వేయగా, బుధవారం రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని కొందరు అభిప్రాయపడినా, చివరకు ఓటింగ్ దగ్గరకు వచ్చేసరికి అంతా అనుకూలంగా ఓటు వేశారు. ఈ రిజర్వేషన్ వల్ల బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ వంటి సామాజిక వర్గాల ప్రజలు లబ్ధిపొందనున్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 49.50 శాతం రిజర్వేషన్లకు ఇది అదనం. తాజా బిల్లుతో దేశంలో రిజర్వేషన్లు 59.50 శాతం అవుతాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పింది. ప్రస్తుత బిల్లు ఈ తీర్పుకు వ్యతిరేకంగా ఉండటంతో దీనిపై న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది.

బాలిక హత్య.. పెల్లుబికిన నిరసనలు



పాట్నా: బీహార్‌లో పదహారేళ్ల బాలిక హత్యకు గురైన ఘటనపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ఆదివారం గయ పట్టణంలో ఓ బాలిక మృతదేహం శరీరం నుంచి తల వేరుపడి ఉండడమే కాకుండా ముఖంపై యాసిడ్‌తో కాల్చిన గాయాలు, ఛాతీపైనా తీవ్రమైన గాయాలతో అత్యంత దారుణ స్థితిలో లభ్యమైంది. తమ కూతురుపై అత్యాచారానికి పాల్పడి కిరాతకంగా చంపేశారని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో బాలిక విషయంలో జరిగిన ఘోరంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ ఘటన పట్ల గయలో ఆందోళనలు పెల్లుబికాయి. పోలీసుల దర్యాప్తు వేగవంతంగా చేయాలని, దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ నగరంలో మంగళ, బుధ వారాల్లో క్యాండిల్ లైట్లతో ర్యాలీలు చేశారు. అయితే ఈ కేసు విషయంలో అనుమానాలు ఉన్నాయి. తల్లిదండ్రులు దీన్ని అత్యాచారం, హత్యగా ఆరోపిస్తుండగా.. కుటుంబ సభ్యుల హస్తం ఉన్నదేమోనన్న దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం లభ్యమై అయిదు రోజులు గడుస్తున్నా పోలీసులు ఇప్పటి వరకు ఎవ్వరినీ అరెస్ట్ చేయకపోవడంపై ప్రజలు పెద్ద ఎత్తున నిరసన చేస్తున్నారు. బాలిక డిసెంబరు 28న కనిపించకుండా పోగా, జనవరి 6న కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. తమ కూతురు కనిపించట్లేదని ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు సరిగ్గా పట్టించుకోలేదని బాలిక తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే బాలిక కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు వేర్వేరుగా ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. శవపరీక్షలో బాలికపై అత్యాచారం జరిగిందా.. లేదా అని తెలుస్తుందని తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి: సీపీఐ

- పారిశ్రామిక శాంతిని పునరుద్ధరించాలి
- సమ్మె విజయవంతం చేసిన కార్మికవర్గానికి జేజేలు

న్యూఢిల్లీ: కార్మికవర్గం న్యాయసమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, పారిశ్రామిక శాంతిని పునరుద్ధరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండు చేసింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాపితంగా రెండు రోజుల సార్వత్రిక సమ్మెను విజయవంతంగా నిర్వహించిన కార్మికవర్గానికి జేజేలు పలికింది. సమ్మెను విజయవంతంగా నిర్వహించిన కార్మికవర్గానికి విప్లవాభివదనలు తెలుపుతూ సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలోని నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై పెల్లుబికిన నిరసనకు ప్రతిబింబం సమ్మె విజయవంతం అని ఆ ప్రకటన పేర్కొన్నది. సమ్మెలో 20 కోట్ల మందికిపైగా కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారని తెలిపింది. చుక్కలనంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేసేందుకు పటిష్టమంతమైన చర్యలు తీసుకోవాలనీ, కొత్త ఉద్యోగాలు సృష్టించాలనీ, కనీస వేతనం రూ. 18,000 ఇవ్వాలని, అందరికీ కనీస పెన్షన్ రూ. 6,000 చెల్లించాలనీ, ప్రభుత్వరంగ సంస్థ (పీఎస్‌యూ)ల వాటాలను విక్రయించే అన్ని చర్యలను నిలిపివేయాలనీ, ఔట్‌సోర్సింగ్, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో సహా అన్ని రకాల ప్రైవేటీకరణను మొత్తంగా ఆపివేయాలని, అందరికీ సార్వజనీన సామాజిక భద్రత కల్పించాలనీ, ఎన్పీఎస్‌కు స్వస్థిపలకాలనీ, ప్రభుత్వోద్యోగులకు ఇంతకుముందున్న పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండు చేస్తున్నాయి. తమ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు కార్మికులు, బ్యాంకింగ్, ఆర్థిక, రక్షణ తదితర విభాగాలతో సహా అన్ని రంగాల ఉద్యోగుల నుంచి వ్యక్తమౌతున్న తీవ్ర నిరసనను మోడీ ప్రభుత్వం తెలుసుకోవాలని ఆ ప్రకటన సూచించింది. కార్మిక వ్యతిరేక, నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రభుత్వం విడనాడాలని సీపీఐ డిమాండు చేసింది.

పెద్ద శబ్దంతో ఊగిపోయిన విమాన ఇంజిన్

ముంబై: ఇండిగో విమానం ఇంజిన్ విఫలమైన ఐదు రోజుల వ్యవధిలోనే గోఎయిర్‌కు చెందిన విమానం ఇంజిన్ పెద్ద శబ్దం చేస్తూ ఊగిపోయింది. ఆ సమయంలో విమానంలో దాదాపు 168 మంది ప్రయాణికులు ఉన్నారు. దీంతో పైలెట్లు వెంటనే విమానాన్ని అత్యవసరంగా ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. ముంబై నుంచి టేకాఫ్ అయిన గంట సేపటికే మళ్లీ వెనక్కి వచ్చేసింది. ఈ విషయాన్ని గోఎయిర్ ప్రతినిధి ధ్రువీకరించారు. గోఎయిర్ జీ8319 విమానం ముంబై నుంచి ఢిల్లీ వెళ్లాల్సి ఉంది. విమానం ఆకాశంలో ఉండగా ఇంజిన్ విఫలమై పెద్ద శబ్దంతో ఊగిపోయింది. దీంతో పైలెట్లు వెంటనే విమానాన్ని ముంబైకి తీసుకొచ్చి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో ఉన్న 168 మంది ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.